ప్రతి అక్షరం ప్రజల కోసం
www.prajapaksham.in
# ప్రజాపక్షం
PRAJAPAKSHAM ★★★
7th ANNIVERSARY 22nd October, 2025
సంపుటి 08, సంచిక: 299 | సోమవారం | 29-09-2025 | కరీంనగర్
Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00

40కి చేరిన తొక్కిసలాట మృతులు
బిహార్, మరో 7 రాష్ట్రాలకు 470 మంది పరిశీలకులు
కువైట్‌లో చొరబాటు యత్నం భగ్నం..
05


02

### శాంతించిన మూసీ
ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో మూసీ నదికి వరద ఉద్ధృతి తగ్గింది. మూసీ శాంతించడంతో నిర్వాసిత ప్రాంతాల ప్రజలు ఇళ్లలోకి బురద చేరడంతో ప్రస్తుతం శుభ్రం చేసుకుంటున్నారు.


03

### బాంబు కలకలం
శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపులొచ్చాయి. ఎయిర్‌పోర్టుకు పంపిన ఇ–మెయిల్‌లో దుండగులు ఈ విషయం వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ సిబ్బంది ముమ్మర తనిఖీలు చేపట్టారు.


05

### స్వామి చైతన్యానంద అరెస్ట్
లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న ఆరోపణలపై ఢిల్లీకి చెందిన స్వామి చైతన్యానంద సరస్వతి(62)ని పోలీసులు అరెస్టు చేశారు. ప్రశ్నించి వివరాలు రాబట్టేందుకు వీలుగా ఐదు రోజులు ఆయనను రిమాండ్‌లో ఉంచాలని ఢిల్లీ కోర్టు డ్యూటీ మెజిస్ట్రేట్ రవి పోలీసులను ఆదేశించారు. స్వామీజీకి సంబంధించిన రూ.8 కోట్ల ఆస్తులు, వివిధ బ్యాంకు అకౌంట్లలో నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్లను లావాదేవీలకు అవకాశం లేకుండా స్తంభింపజేశారు.

# భారత్ ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకోసమే

## రంగారెడ్డి జిల్లా అమీర్‌ఖాన్ పేట్‌లో ఎఫ్‌సిడిఎ భవనానికి శంకుస్థాపనలో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి

"భారత్ ఫ్యూచర్ సిటీకి వ్యతిరేకంగా అనేక కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. నోటికొచ్చింది మాట్లాడుతున్నారు. ఇక్కడ నాకేదో భూములు ఉన్నాయి. అందుకే ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. వారి ఆరోపణలన్నీ అక్కసుతో చేస్తున్నవే. 'ఫ్యూచర్ సిటీ నా కోసమో.. నా కుటుంబం కోసమో' చేయడంలేదు. రాబోయే తరాల భవిష్యత్తు కోసం చేస్తున్నాం" అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మీర్ ఖాన్ పేటలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ) భవనానికి ఆదివారం సిఎం శంకుస్థాపన చేశారు. దీనితో పాటు తరువాయి 2లో



# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

## ముగ్గురు నక్సల్స్ మృతి

సమష్టిగా రూ. 14 లక్షల రివార్డు కలిగి ఉన్న మావోయిస్టులు

అసోంలో జరగిన కాల్పుల్లో నలుగురు దోపిడీదొంగలు హతం

**కాంకేర్/గోల్‌పారా :** ఛత్తీసగఢ్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. కాంకేర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఎన్‌కౌంటర్‌లో సమష్టిగా రూ.14 లక్షల రివార్డు కలిగి ఉన్న ముగ్గురు నక్సలైట్లు మరణించారని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. కాంకేర్, గరియాబంద్ జిల్లాల సరిహద్దులోని చింద్ఖాడక్ గ్రామ సమీపంలోని అటవీ కొండపై ఈ కాల్పులు జరిగాయని, ఉదయం భద్రతా సిబ్బంది ఉమ్మడిగా నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌కు బయలుదేరారని కాంకేర్ పోలీసు సూపరింటెండెంట్ తరువాయి 2లో

# బతుకమ్మ కుంట బతికింది!

హైదరాబాద్ అంబర్‌పేటలో బతుకమ్మ కుంటను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





## దేశంలో నిరుద్యోగానికి వ్యతిరేకంగా
# బలమైన ప్రజాపోరాటాలు

- తద్వారానే ఖాళీగా ఉన్న కోటి ఉద్యోగాలు భర్తీ
- 20శాతం నిరుద్యోగ సమస్య పరిష్కారం : 20 ఏళ్ళు నిండిన యువతకు నిరుద్యోగ భృతి
- ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం సాధించేందుకు ప్రజాతంత్ర శక్తులు గళమెత్తాలి

**సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్**

- కూనారిల్లుతున్న ప్రజాస్వామ్య పునాదులైన నాలుగు స్తంభాలు : కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో నిత్యం పెరుగుతున్న నిరుద్యోగానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా బలమైన ప్రజా పోరాటానికి నాంది పలకాలని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ యువతకు పిలుపునిచ్చారు. తద్వారానే ఖాళీగా ఉన్న కోటి ఉద్యోగాలు భర్తీ కావడం ద్వారా 20 శాతంగా ఉన్న నిరుద్యోగ సమస్య కొంత పరిష్కారం కావడమే కాకుండా 21 ఏళ్ల నిండిన యువతకు నిరుద్యోగ భృతి లభిస్తుందన్నారు. ఉద్యోగాలతో పాటు ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం సాధించుకునేందుకు ప్రజాతంత్ర శక్తులన్నీ ఏకమై గళమెత్తాలని కోరారు. ఈ ఉద్యమానికి తనవంతుగా పూర్తి సహకారాన్ని అందిస్తానని ఆయన చెప్పారు. తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం (టిఎస్‌డిఎఫ్), జాగో నవతెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి – న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడాలి' అనే అంశంపై సదస్సు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. టిఎస్‌డిఎఫ్ చైర్మన్ జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథులుగా సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ హాజరయ్యారు. ఈ సదస్సులో తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## ఉగ్రవాదం లేని పాలస్తినా దేశం కావాలి
### ఐక్యరాజ్యసమితిలో యుఎఇ విదేశాంగమంత్రి

**న్యూయార్క్ :** ఉగ్రవాదం, ఉగ్రవాదులకు అవకాశంలేని, ఆయుధాలకు తావులేని పాలస్తినా దేశం ఆవిర్భవించాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విదేశాంగమంత్రి లానా నుస్సేబెహ్ ఆకాంక్షించారు. అదేవిధంగా ఇజ్రాయెల్ దురాక్రమణ చర్యలను కూడా ఆమె తీవ్రంగా ఖండించారు. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 80వ వార్షికోత్సవ సభలో ఆదివారం ఆమె ప్రసంగించారు. మధ్యప్రాచ్యంలో శాంతికే తమ దేశం కట్టుబడి ఉందన్నారు. వెస్ట్ బ్యాంక్ ప్రాంతాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆమె అన్నారు. ఐదు సంవత్సరాలక్రితం ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలు పునరుద్ధరించుకున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌దేశం ఇటీవల ఖతార్‌పై దాడి జరిగిన తర్వాత నెతన్యాహూకు ఒక హెచ్చరిక కూడా చేసింది. ఈ నేపథ్యంలో ఉగ్రవాదంలేని పాలస్తినా ఆవిర్భవించాలని లానా నుస్సేబెహ్ చేసిన ప్రసంగం ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. వేలమంది ప్రజలను నిర్బంధించి, ఆకలికి గురిచేయడాన్ని ఎవ్వరూ సహించబోరని ఆమె అన్నారు.

# స్టార్‌మర్‌కు సొంత పార్టీలో సెగ
## పాలనపై ప్రజల్లో క్షీణించిన రేటింగ్

**లండన్:** బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్‌కు సొంతపార్టీలో అప్పుడే సెగ మొదలైంది. ఆయన అధికారం చేపట్టి ఏడాదిపైన రెండు నెలలు మాత్రమే గడిచింది. దేశంలో వ్యతిరేకత సొంతపార్టీలో చర్చకు దారితీసింది. బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలకు ఇంకా నాలుగు సంవత్సరాలు సమయం ఉంది. కానీ వేలాదిమంది లేబర్‌పార్టీ నాయకులు,సభ్యులు ఆదివారంనాడు లివర్‌పూల్‌లోని రివర్ మెరే పక్కనున్న హాలులో వార్షిక సమావేశమయ్యారు. పార్టీలో కీర్‌స్టార్‌మర్‌పట్ల అసంతృప్తి పెరుగుతోంది. కొద్దివారాల క్రితం స్టార్‌మర్ ఉప ప్రధానమంత్రి ఎంజెలా రేనెర్ పన్నుల ఎగవేత ఆరోపణలతో రాజీనామా చేశారు. మొదట అందరూ స్టార్‌మర్ తర్వాత ఆమెపైనే దృష్టిసారించారు. కానీ మంత్రివర్గంలో మార్పులు జరిగాయి. ఉక్రేన్‌లో రష్యా యుద్ధం, ట్రంప్ విధించిన సుంకాలు వంటి విషయాల్లో స్టార్‌మర్‌కు దేశంలో మంచిపేరు రాలేదు. ట్రంప్‌తో వాణిజ్య ఒప్పందంలో దిగుమతి సుంకాల ఉపశమనంతో కొంత మేరకు బయట పడినాగానీ నవంబరులో బడ్జెట్ పైనే అందరూ దృష్టిపెట్టారు. ఆండీ బర్న్‌హామ్ పార్టీలో ఆయనకు పోటీ నాయకుడుగా ఎదిగారు. పార్టీని ఏకమొత్తంగా సంస్కరించాలని, ప్రక్షాళన చేయాలని ఆయ న ప్రకటనలు చేస్తున్నారు. స్టార్‌మర్ నాయకత్వాన్ని సవాలు చేయాడానికి తన సరైన నాయకుడుగా ఎంపీలందరూ కోరుకుంటున్నారని, ఆయనను స వాలు చేయమంటున్నారని బర్న్‌హామ్ వ్యాఖ్యానించడం వివాదానికి దారితీసింది. 55 ఏళ్ళు వయసుగల బర్న్‌హామ్ గ్రేట్ మాంఛెస్టర్‌కు 2017 నుండి మేయర్‌గా వ్యవహరిస్తున్నారు. లేబర్‌పార్టీకి అనారోగ్య లక్షణాలు వచ్చాయని లండన్‌లోని క్వీన్ మేరీ యూనివర్సిటీలో రాజకీయ విభాగం ప్రొఫెసర్ టిమ్ బాలే మరోవైపు వ్యాఖ్యానించారు. ఇటీవలి కాలంలో ప్రధానమంత్రి స్టార్‌మర్ పనితీరు క్షీణించింది ప్రజల్లో ఆయన రేటింగ్ కూడా గణనీయంగా పడిపోయింది. లేబర్‌పార్టీకి బలమైన నాయకుడు కావాలని ఆ పార్టీ సభ్యులంతా బలంగా కోరుకుంటున్నారు. స్టార్‌మర్ శక్తిసామర్థ్యాలమీద నమ్మ కం సన్నగిల్లుతోంది. ప్రభుత్వం పాలనాపరంగా చాలా ఎదురుదెబ్బలు తింటోంది. ఇటీవల అమెరికాలో ఛార్లీ కిర్క్ హత్య తర్వాత అక్రమ వలసలకు వ్యతిరేకంగా సెం ట్రల్ లండన్‌లో లక్షమందికిపైగా మితవాదులు టమ్మీ రాబిన్సన్ నాయకత్వాన భారీ ప్రదర్శన చేశారు. 2024 జులై లో ఎట్టకేలకు కన్జర్వేటివ్‌పార్టీ పరిపాలనకు లేబర్‌పార్టీ చరమగీతం పాడింది. ఆనాడు స్టార్‌మర్ ఒక స్టార్‌లాగా కనిపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో ఈ ఆశలు వమ్ము అవుతున్నాయి.



## చైనాలో వరల్డ్ టాలెస్ట్ బ్రిడ్జి ప్రారంభోత్సవం



**బీజింగ్:** ప్రపంచంలోనేఅతిపొడవైన,చాలా ఎత్తు లో నిర్మించిన చైనాలోని 'హువా జియాంగ్ గ్రాం డ్ కాన్యన్' వంతెనకు అధికారులు ఆదివారంప్రారంభోత్సవం చేశారు. చైనా గుయి జౌ రాష్ట్ర ప్ర భుత్వం దీనిని నిర్మించింది. బుయి జాతికి చెందిన లుకియోంగ్ (70) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ప్రాం తంలో బాల్యం నుండీ ఆమె నివసిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు రవాణా వ్యవస్థ లేకపోవడంవల్ల ఎన్ని సమస్యలు ఎదుర్కొన్నారో ఆమె ప్రత్యక్షంగా చూశారు. ఈనాడు ఇంత గొప్ప నిర్మాణాన్ని ఆమె చూసి పట్టరాని సంతోషంతో ఊగిపోయారు. సంప్రదాయ దుస్తులు ధరించి అందరికంటే ముం దుగా అక్కడికి చేరుకున్న లుకియోంగ్ ఈ సూప్ ప్రాజెక్టు తన ప్రాంతంలో ఆవిర్భవించినందుకు సంతోషిస్తున్నానన్నారు. తన బాల్యంలో హుయాజింగ్ నది దాటేందుకు తాటి బుట్టల్లో ప్రయాణించేవాళ్ళమని, ఆ తర్వాత ఒక కర్ర వంతెన వచ్చిందని ఇనుప గొలుసులతో మరో వంతెన వచ్చిందని, ఈనాడు ప్రపంచ ప్రఖ్యాత వంతెన ఆవిర్భవించిందని ఇది తమ ప్రాంతానికి ఎక్కువమంది పర్యాటకులను తీసుకువస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. చైనాలో రెండు లక్షల కంటే ఎక్కువమంది జనాభాగల 99 శాతం గ్రామాలను అనుసంధానిస్తూ దేశంలో 1.99 లక్షల కి.మీ రహదారులను నిర్మించామని రవాణామంత్రి లియూ వి ఈ సందర్భంగా చెప్పారు. అత్యంత ఖచ్చితత్వంతో నదికి 652 మీటర్ల ఎత్తులో నిర్మించిన ఈ వంతెన రెండు విధాలుగా రికార్డు సృష్టించిందని అధికారులు చెప్పారు. పర్వతప్రాంతాల్లో ఉన్న అత్యంత లోతైన, ప్రమాదకరమైన పెద్ద అగాధాన్ని ప్రభుత్వం సాహసోపేతమైన నిర్మాణం ద్వారా రెండుప్రాంతాలమధ్య ప్రధాన రహదారిగా మార్చేసింది.

# ఉక్రేన్‌పై 12 గంటలపాటు రష్యా దాడులు
### నలుగురు మృతి
### 70మందికి గాయాలు

**కీవ్:** ఉక్రేన్‌లోని ఏడు ప్రాంతాలలో 12 గంటలపాటు రష్యా దాడులు చేసింది. ఈ దాడుల్లో నలుగురు మరణించారు. 70 మంది గాయపడ్డారు. మరణించినవారంతా కీవ్ నగరవాసులే. కీవ్ నగరంలోనే ఈ మరణాలు సంభవించాయి. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ రష్యా దాడులను తీవ్రంగా ఖండించారు. ఈ దారుణాన్ని అపాలని ప్రపంచ దేశాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దాదాపు 600 డ్రోన్లు, 40 క్షిపణులతో ఈ దాడులు చేసినట్లు ఆయన చెప్పారు.పారిశ్రామిక కేంద్రాలతోపాటు ఉక్రేన్ సైన్యానికి ఆయుధ భాగాలు సరఫరా చేసే పరిశ్రమలపై కూడా రష్యా దాడులు చేసిందని ఆయన చెప్పారు. రాజధాని కీవ్‌లో దాదాపు 20కిపైగా ప్రాంతాలలో దాడులు జరిగాయి. కీవ్ సెంట్రల్ ట్రైన్ స్టేషన్, ప్యాసింజర్స్ ఎరైవల్‌వద్ద డ్రోన్లు దాడులు జరిగాయి. బహుళ ఒంతస్తుల నివాసిత భవనాలు ఈ డ్రోన్ల దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ దాడులపై రష్యా అధికారులు వెంటనే స్పందించలేదు. ఈ యుద్ధం ఉక్రేన్‌ను దాటి ఇతర ప్రాంతాలకు కూడా వ్యాపించే ప్రమాదం కనిపిస్తోందని ఇటీవలికాలంలో తీవ్ర ఆందోళన పెరిగింది. పోలెండ్ భూభాగాగంలోకి కూడా రష్యా డ్రోన్లు ప్రవేశించాయని మొదట ఫిర్యాదులు వచ్చాయి. ఆ తర్వాత ఇలాంటి ఫిర్యాదులు మరిన్ని పెరిగాయి. రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావరోవ్ ఐక్యరాజ్యసమితిలో మాట్లాడుతూ, తమ దేశంపై ఎలాంటి దాడులు జరిగినా 'నిర్ణయాత్మకమైన ప్రతిస్పందన'' చవిచూడాల్సి వస్తుందని నాటోకు హెచ్చరిక చేసిన తర్వాత ఈ భారీ దాడులు జరిగాయి. రష్యా డ్రోన్లు గనుక ఈసారి నాటో కూటమి దేశాల గగనతలాన్ని ఉల్లంఘిస్తే వెంటనే కూల్చివేయాలని, ఆ తర్వాతే మాటలు మాట్లాడాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సలహా ఇచ్చారు. ట్రంప్ చేసిన ఈ ప్రకటన ఎంతో సాహసోపేతమైనదంటూ జెలెన్స్కీ కూడా హర్షం ప్రకటించారు. రష్యాకు వ్యతిరేకంగా దాడులకు తాము నిర్ణయాత్మకంగా వ్యవహరించాల్సివస్తుందనికూడానాటో హెచ్చరించిన తర్వాత లావరోవ్ ఐక్యరాజ్యసమితిలో ఎదురుహెచ్చరిక చేశారు. పోలెండ్, రుమేనియా, ఎస్తోనియా, డెన్మార్క్ గగనతలాలను రష్యా సెప్టెంబరునెలలో ఉల్లంఘించిందని నాటో ఆరోపించింది. మరోవైపు జెలెన్స్కీ కూడా అమెరికా తయారు చేసిన పేట్రియాట్రిక్ వైమానిక రక్షణ వ్యవస్థను ఇజ్రాయెల్ నుండి దిగుమతి చేసుకుంది.

## ఇద్దరు బందీల జాడ తెలియడంలేదు
### హమాస్ ప్రకటన

**గాజా:** తమవద్ద ఉన్న ఇద్దరు ఇజ్రాయెల్ బందీల జాడ తెలియడంలేదని, గడచిన 48 గంటలుగా వారితో సంబంధాలు తెగిపోయాయని హమాస్ మిలిటరీ విభాగం ఆదివారం ప్రకటించింది. గాజాసిటీలో ఇజ్రాయెల్ సైన్యం వెంటనే దాడులు ఆపేయాలని, వారి జాడకోసం వెతకాల్సిన అవసరం ఉందని హమాస్ ప్రకటించింది. సైన్యం దాడులకారణంగా ఒమ్రి మిరాన్, మతన్ ఆంగ్రెస్ట్ అనే ఇద్దరు ఇజ్రాయెలీ బందీలతో తమకు సంబంధాలు తెగిపోయాయని హమాస్ మిలిటరీ విభాగం ప్రకటించింది. గాజా సిటీలో సౌత్ ఆఫ్ ఎయిట్ వీధి నుండి ఇజ్రాయెల్ సైన్యం వైదొలగాలని, 24 గంటలపాటు గగనతల దాడులు ఆపేయాలని, జాడ తెలియకుండాపోయిన ఇద్దరు బందీలను వెతికి పట్టుకోవాల్సి ఉందని హమాస్ మిలిటరీవింగ్ డిమాండ్ చేసింది.

## ఎలక్ట్రానిక్ గుర్తింపు కార్డుల జారీపై స్విట్జర్లాండ్‌లో ఓటింగ్



**బెర్న్:** స్విట్జర్లాండ్‌లో ఎలక్ట్రానిక్ గుర్తింపు కార్డులు ప్రవేశపెట్టాలా? వద్దా? అనే విషయాన్ని నిర్ధారించేందుకు ఆ దేశంలో ఆదివారం పోలింగ్ నిర్వహించారు. ఈ గుర్తింపు కార్డులకు సంబంధించిన డేటాను సంరక్షించే విషయంలో ప్రజలకు చాలా సందేహాలు ఉన్నందువల్ల ఇంతకుముందు 2021 లో మొదటిసారి ఈ విషయంపై జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్‌ను తిరస్కరించారు. ఇప్పుడు రెండోసారి మళ్ళీ ఇదే విషయం తెరమీదకు వచ్చింది. స్విట్జర్లాండ్‌లో ఈ డేటా సంరక్షణ కేంద్రాలన్నీ ప్రైవేటు సంస్థలే నిర్వహిస్తూ ఉండటం ప్రజలకు సందేహంగా మారింది. ఈ ప్రైవేటు వ్యక్తుల నుండి ఎవరికైనా సమాచారం లీకయ్యే అవకాశం ఉంటుందని ప్రజలు గట్టిగా ఆలోచిస్తున్నారు. బ్రిటన్ ప్రభుత్వం కూడా ఎలక్ట్రానిక్ గుర్తింపు కార్డులపై ఈ వారంలోనే ఒక ప్రకటన చేసింది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించి ఉద్యోగాలు చేస్తూ నివసిస్తున్నవారిని గుర్తించడంకోసం ఈ గుర్తింపు కార్డులు ప్రవేశపెట్టాలని బ్రిటన్ ప్రభుత్వంభావిస్తున్నది.స్విట్జర్లాండ్‌లో ఈ కార్డులు ప్రవేశపెట్టే విషయంపై పార్లమెంటు ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు మళ్ళీ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోంది.

# శాంతించిన మూసీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో మూసీ నదికి వరద ఉధృతి తగ్గింది. మూసీ శాంతించడంతో నిర్వాసిత ప్రాంతాల ప్రజలు ఇళ్లలోకి బురద చేరడంతో ప్రస్తుతం శుభ్రం చేసుకుంటున్నారు. పరివాహక ప్రాంతాలు, బ్రిడ్జిల వద్ద భారీ ఎత్తున చెత్తచెదారం పేరుకపోవడంతో జిహెచ్‌ఎంసి అధికారులు తొలగింపు పనులను ముమ్మరం చేశారు. బ్రిడ్జిల వద్ద చెత్త తొలగింపు చర్యలు చేపట్టి, రాకపోకలు పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. జంటజలాశాయాలకు వరద పోటేత్తడంతో జలమండలి అధికారులు దిగువ ప్రాంతాలకు భారీ స్థాయిలో నీటి విడుదల చేశారు. ఏకంగా ఉస్మాన్‌సాగర్(గండిపేట్) 15 గేట్లు 9 అడుగుల ఎత్తుకు ఎత్తారు. అలాగే హిమాయత్ సాగర్ 9 గేట్లు 6 అడుగుల ఎత్తుకు ఎత్తారు. ఉస్మాన్ సాగర్ నుంచి మూసీలోకి, హిమాయత్‌సాగర్ నుంచి ఈసీ నదిలో జలాశాయాల నీటిని విడుదల చేశారు. ఈ రెండు నదులు లాగర్‌హౌస్ సంఘం దగ్గర కలుస్తాయి. వరద ఉధృతికి లాగర్‌హౌస్ వద్ద ఉన్న బాపూఘాట్ పూర్తిగా ముంపునకు గురైంది. పరివాహ ప్రాంతాలు మొత్తం ఉగ్రరూపంలో మూసీ ముంచేత్తింది. మూసీ నది పరివహక ప్రాంతాల్లోని సుమారు 1200 మంది నిర్వాసితులను జిహెచ్‌ఎంసి యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించిన విషయం తెల్సిందే. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి కలిపి 4,847 క్యూసెక్కుల నీటిని మూసీలోకి అధికారులు విడుదల చేస్తున్నారు. శుక్రవారం రాత్రి అత్యధికంగా జంట జలాశయాల నుంచి 36 వేల క్యూసెక్కుల నీటిని మూసీలోకి విడుదల చేశారు. జంట జలాశయాలకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గడంతో అవుట్ ఫ్లోను అధికారులు తగ్గించారు. ఉస్మాన్ సాగర్‌కు 1100 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఇక్కడి నుంచి 884 క్యూసెక్కుల నీటిని మూసీకి విడుదల చేస్తున్నారు. హిమాయత్ సాగర్‌కు 4 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఇక్కడి నుంచి 3,963 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జంట జలాశయాల నుంచి విడుదలవుతున్న అవుట్ ఫ్లో తగ్గడంతో మూసీ పరివాహక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

**ఒకేసారి పోటెత్తిన వరద..**

శనివారం కురిసిన వర్షానికి మూసీకి ఒకేసారి వరద పోటెత్తింది. 35 వేల క్యూసెక్కుల వరద రావడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమన్నారు. ఈసీ, మూసీకి వరద తాకిడి పెరగడంతో జలమండలి అధికారులు అప్రమత్తమై ఉస్మాన్‌సాగర్ 12, హిమాయత్‌సాగర్ 9 గేట్లను ఎత్తి 35 వేల క్యూసెక్కులకు పైగా నీరు మూసీ నదిలోకి విడుదల చేశారు. ఒకేసారి అంత పెద్ద మొత్తంలో నదిలోకి ప్రవాహం పోటెత్తడంతో పరివాహక ప్రాంతాల్లోని రోడ్లు, వంతెనలు, కాలనీలు నీట మునిగాయి. ఈ ప్రభావం బాపూఘాట్ నుంచి మూసారాంబాగ్ వరకు తీవ్రంగా కనిపించింది. మూసానగర్, రసూల్‌పురా, వినాయక వీధి, శంకర్‌నగర్ లలో వందల ఇళ్లు నీట మునిగాయి. మూసీ వరదల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న సుమారు 1200 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ వంతెనలపై వాహన రాకపోకలను నిలిపేశారు. మూసీ బ్రిడ్జిలను తాకుతూ వరద ప్రవహించింది. బ్రిడ్జిపై స్లాబ్ వేసేందుకు ఏర్పాటు చేసిన ఇనుప సెంట్రిగ్ భారీ శబ్ధాలతో కొట్టుకుపోయింది. సుమారు రూ.కోటిన్నర నష్టం వాటిల్లిందని బ్రిడ్జి నిర్మాణ సూపర్‌వైజర్ తెలిపారు.

**ఎంజిబిఎస్ నుంచి ఆర్‌టిసి బస్సులు ప్రారంభం..**

మూసీ నదికి వరద ఉద్ధృతి తగ్గింది. దీంతో మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజిబిఎస్) నుంచి బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. శనివారం కురిసిన వర్షానికి ఎంజిబిఎస్‌లో పేరుకుపోయిన బురదను ఆదివారం ఉదయం నుంచి సిబ్బంది తొలగించారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు వెళ్లాల్సిన బస్సులను అధికారులు అందుబాటులో ఉంచారు. అంతర్ రాష్ట్ర సర్వీసులు కూడా ప్రారంభమయ్యాయి. బస్టాండ్‌లో వరద కారణంగా శనివారం ఊర్లకు వెళ్లలేకపోయిన ప్రయాణికులు, తాజాగా సర్వీసులు ప్రారంభం కావడంతో బయలు దేరుతున్నారు. ప్రస్తుతం బస్టాండ్ ప్రయాణికులతో కళకళలాడుతోంది.

## ఎన్‌కౌంటర్
(మొదటి పేజీ తరువాయి)

ఇందిరా కళ్యాణ్ ఎలెసెలా పిటిఐకి తెలిపారు. కాంకేర్, గరియాబంద్ నుండి రాష్ట్ర పోలీసు యూనిట్ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) మరియు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్‌ఎఫ్) సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఆయన చెప్పారు. ఒక మహిళా కేడర్‌తో సహా ముగ్గురు నక్సలైట్ల మృతదేహాలను ఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. మృతులను ప్రాథమికంగా గుర్తించినట్లు మావోయిస్టుల సీతానది/రావస్ ఏరియా కమిటీ కార్యదర్శి సర్వన్ మడ్కం అలియాస్ విశ్వనాథ్, నగరి ఏరియా కమిటీ సభ్యుడు రాజేష్ అలియాస్ రాకేష్ హేమ్లా, మెయిన్‌పూర్‌ను వాపాడ రక్షణ బృందం సభ్యుడు బసంతి కుంజ్జామ్ అలియాస్ హిడ్మేగా ఆయన తెలిపారు. మడ్కం, హేమ్లా వరుసగా రూ. 8 లక్షలు, రూ. 5 లక్షల రివార్డును కలిగి ఉండగా, కుంజమ్ లక్ష రివార్డును కలిగి ఉన్నటుల అధికారి తెలిపారు. భౌగోళిక పరిస్థితులు, కఠినమైన వాతావరణం సవాలుగా ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో మోహరించిన పోలీసులు, భద్రతా దళాలు ప్రభుత్వం, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రాణాలను, ఆస్తులను రక్షించడానికి పూర్తి అంకితభావంతో పనిచేస్తున్నాయని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పి అన్నారు. మావోయిజం అంతరించిపోయే దశలో ఉందనే వాస్తవాన్ని మావోయిస్టు కార్యకర్తలు అంగీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకుని హింస మార్గాన్ని విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాల్సిన సమయం ఆసన్నమైందని సీనియర్ అధికారి తెలిపారు. వారు చట్టవిరుద్ధమైన మరియు హింసాత్మక కార్యకలాపాలను కొనసాగిస్తే, వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన అన్నారు. తాజా చర్యతో, ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ప్రత్యేక ఎన్‌కౌంటర్లలో 252 మంది నక్సలైట్లను కాల్చి చంపారు. వారిలో 223 మంది కాంకర్‌తో సహా ఏడు జిల్లాలను కలిగి ఉన్న బస్తర్ డివిజన్‌లో, 27 మంది రాయ్‌పూర్ డివిజన్‌లోని గరియాబంద్‌లో హతమయ్యారు. దుర్గ్ డివిజన్‌లోని మోహ్లామన్‌పూర్–అంబాఘర్ చౌకి జిల్లాలో మరో ఇద్దరు నక్సలైట్లు హతమయ్యారు.

**ఎన్‌కౌంటర్‌లో నలుగురు దోపిడీదొంగలు హతం**

అసోంలోని గోల్‌పారా జిల్లాలో ఆదివారం పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు దోపిడీ దొంగలు మృతి చెందారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున గిలాదుబి ప్రాంతంలో జరిగింది. మేఘాలయతో అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతంలో సాయుధ నేరస్థుల ముఠా ఉనికి గురించి గత కొన్ని రోజులుగా తమకు సమాచారం అందిందని, దీంతో తాము గాలింపు చర్యలు చేపట్టినట్లు గోల్‌పారా సీనియర్ పోలీస్ సూపరింటెండెంట్ నబనీత్ మహంత చెప్పారు. ఈ ముఠా కిడ్నాప్ లేదా ఇతర నేర కార్యకలాపాలను నిర్వహించడానికి ప్రయత్నిస్తుందని, ఆదివారం ఉదయం ఒక నిర్దిష్ట సమాచారం అందిందని, తదనుగుణంగా పోలీసులు సమన్వయంతో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారని ఆయన చెప్పారు. ఘిలాదుబి ప్రాంతంలో చెక్‌పోస్టులలో ఒకదాన్ని గుర్తించిన నేరస్థులు పారిపోవడానికి ప్రయత్నించగా అది కుదరకపోవడంతో పోలీసు బృందంపై కాల్పులు జరిపారని, దీనితో పోలీసు సిబ్బంది ఎదురు కాల్పులు జరిపినట్లు మహంత చెప్పారు. ఈ కాల్పుల్లో కారులో ఉన్న నలుగురు నేరస్థులు గాయపడిగా సమీపంలోని ఆసుపత్రికి తరలించామి, వారు ఆసుపత్రిలోనే చనిపోయారని ఎస్ఎస్‌పి తెలిపారు. దోపిడీ దొంగలు ఉపయోగించిన వాహనం నుండి నాలుగు పిస్టళ్లు, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు వాకీటాకీ సెట్లు, కార్ట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు.

## భవిష్యత్ తరాలకోసమే
(మొదటి పేజీ తరువాయి)

రావిర్యాల నుంచి అమనగల్ వరకు నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్1 నిర్మాణానికి కూడా సిఎం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిఎం ప్రసంగిస్తూ ఆనాడు కులీకుతుబ్ షాహీలు హైదరాబాద్ నగరానికి అంకురార్పణ చేశారని, నిజాం కాలంలో సికింద్రాబాద్‌ను అభివృద్ధి చేశారని, ఆ తరువాత ఉమ్మడి రాష్ట్రంలోని పాలకులు సైబరాబాద్, సిలికాన్ వ్యాలీ అభివృద్ధి చేశారని, అందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్ పోర్టు, ఓఆర్ఆర్ వచ్చాయన్నారు. గతం నుంచి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉందని, మన భవిష్యత్ తరాల కోసం ఫ్యూచర్ సిటీని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**పదేళ్లు అవకాశం ఇవ్వండి.. న్యూయార్క్, దుబాయ్‌లతో పోటీ పడేలా చేస్తా**

''చాలా మంది విదేశాలకు వెళ్లి వచ్చి అద్భుతంగా ఉన్నాయని చెబుతున్నారు. ఎన్నాళ్లు న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ గురించి చెప్పుకొంటాం. మనం కూడా అలా తయారు కావాలి కదా. నాకు పదేళ్లు సమయం ఇవ్వండి. న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతాను'' అని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రపంచ నగరాలు భారత్ ఫ్యూచర్ సిటీ గురించి చర్చించుకునేలా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఒక గొప్ప నగరాన్ని నిర్మించడానికి ఉండాల్సిన అర్హతలన్నీ భారత్ ఫ్యూచర్ సిటీకి ఉన్నాయన్నారు. దక్షిణ భారతదేశంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని, ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీ పట్నం పోర్టు వరకు 12 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మించనున్నామన్నారు. తెలంగాణ కోసం ఒక డ్రై పోర్ట్ ను కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రానున్న పదేళ్లలో ప్రపంచంలో ఉండే ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఈ భారత్ ఫ్యూచర్ సిటీలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫ్యూచర్ సిటీని ఒక గొప్ప నగరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోందన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రజలందరి సహకారం ఉండాలని, ఫ్యూచర్ సిటీ విషయంలో చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరించుకుందామని, ఈ విషయాలకు కోర్టులకు వెళ్లి ఇబ్బంది పడవద్దని సిఎం సూచించారు. అభివృద్ధి పనుల వల్ల నష్టపోయేవారిని అన్నివిధాలా ఆదుకుంటామని, ప్రభుత్వం ఉదారంగా మిమ్మల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని, తాను స్వయంగా సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని సిఎం స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.



**రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టులకు వెళ్లి నష్టపోవద్దు**

రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టులకు వెళ్లి నష్టపోవద్దని సిఎం స్థానికులను కోరారు. ఫ్యూచర్ సిటి కోసం భూమి ఇచ్చిన రైతులు, ఇతరుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను సిఎం ఆదేశించారు. అందరికీ న్యాయం చేయాలనేదే ప్రభుత్వ ప్రయత్నమన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ, స్కిల్ వర్సిటీలను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. డిసెంబర్ నుంచి ముఖ్యమైన కార్యక్రమాలను ఎఫ్‌సిడిఎ నుంచే చేపడతామన్నారు. సింగరేణికి పదెకరాల భూమి ఫ్యూచర్ సిటీలో కేటాయిస్తాం. ఏడాది తిరిగే లోగా సింగరేణి కార్యాలయం నిర్మాణం పూర్తి కావాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. డిసెంబర్ నెల లోపుగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ భవనం, స్కిల్ యూనివర్సిటీని పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రపంచంలో ఎవరు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చినా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలోనే కూర్చుని మాట్లాడుతామని, ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తామని సిఎం చెప్పారు.

**దిగ్గజ కంపెనీలు తెలంగాణ వైపు చూసేలా**

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ..దిగ్గజ కంపెనీలు తెలంగాణ వైపు చూసేలా ప్రపంచంలోని ఇతర నగరాలకు రోల్ మోడల్ గా నిలిచేలా భారత్ ఫ్యూచర్ సిటి ని అభివృద్ధి చేయాలన్నదే మా ప్రభుత్వ సంకల్పమని.ఇప్పుడు ప్రణాళికా బద్ధమైన నగరం అనగానే అందరికీ చండీఘర్ గుర్తుకొస్తుందని, రాబోయే రోజుల్లో ప్రణాళికాబద్ధమైన నగరం అంటే భారత్ ఫ్యూచర్ సిటీ గుర్తుకొస్తుందని అన్నారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి**

రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ లివ్‌లెర్న్ వర్క్‌ప్లే అనే కాన్సెప్ట్ తో పరిశ్రమలు,ఆసుపత్రులు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్ అన్ని ఒకే చోట ఉండేలా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేయబోతున్నాం. భావి తరాల కోసం, మన బిడ్డల కోసం, వారి బంగారు భవిష్యత్తు కోసం ఈ రోజు మనందరం కలిసి వేస్తున్న పునాదే ఈ భారత్ ఫ్యూచర్ సిటీ అని తెలిపారు. ఇది (నెట్ జీరో కార్బన్ సిటీ'. ఇక్కడ పచ్చదనం ఉంటుంది, కాలుష్యం ఉండదు. పరిశ్రమలు వస్తాయి, కానీ పర్యావరణానికి ఎలాంటి హాని జరగదు. రేపటి తరాల కోసం తెలంగాణ కోసం చిత్తశుద్ధితో నిరంతరం కృషి చేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వంతో కలిసి నడవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. మమ్మల్ని ఆశీర్వదించాలని కోరుతున్నా. భారత్ ఫ్యూచర్ సిటి నిర్మాణంలో పాలు పంచుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మన్, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, టియుఎఫ్ఐ డిసి చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంక, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులు, వివిధ సంస్థల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

# 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం
### నగరం వరదలతో మునిగిపోతున్నా పట్టించుకోరా : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తు తం నగరం వరదలతో మునుగుతుంటే, దోమలతో జనం ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తామని సిఎం రేవంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. తెలంగాణ భవిష్యత్ తరాలే ఫ్యూచర్ సిటీని అద్భుతంగా నిర్మించుకుంటారన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని షేక్‌పేట, సమత కాలనీలో ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్, బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి కెటిఆర్ ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులకు 'కాంగ్రెస్ బకాయి కార్డు'లను అందజేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రజలను దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పే అద్భుత అవకాశం జూబ్లీహిల్స్ ప్రజలకు వచ్చిందన్నారు. బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను ఆశీర్వదించాలని కోరారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ మంత్రులంతా టూరిస్టులేనని, ఎన్నికలు పూర్తికాగానే వారంతా వెళ్లిపోతారన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయలేదని, దీంతో ఇప్పటి వరకు ప్రజలకు పడిన బకాయిలను 'బాకీ కార్డు' ఉద్యమంతో గుర్తు చేస్తామని కెటిఆర్ అన్నారు. 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి 700 రోజులైనా ఒక్కటీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు.



**పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇంటిపై 'ఈడి దాడి'కి ఏడాది...**

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇంటిపైన ఈడి దాడి చేసి ఒక ఏడాది పూర్తవుతున్నప్పటికీ ఆ దాడుల్లో ఏం దొరికింది?, ఏమైందనేది పెద్ద రహస్యంగా మారిందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. ఈ మేరకు కెటిఆర్ తన్న ట్విట్టర్‌లో ఆదివారం పోస్ట్ చేశారు. ఈ విషయంలో ఈడి, బిజెపి, సదరు మంత్రి కూడా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సరూర్‌నగర్ స్టేడియం వైపు ప్రపంచ చూపు

### నేడే బతుకమ్మ ఉత్సవం.. ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ సర్కార్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో భారీ ఏర్పాట్లు చేసింది. ప్రపంచ చూపు అంతా సోమవారం జరిగే బతుకమ్మ ఉత్సవాలపైనే ఉంటుంది. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో బతుకమ్మ పండుగను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు సిద్ధమైంది. ప్రపంచం మొత్తం దృష్టిని ఆకర్షించేలా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నెల 29న హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో పదివేల మంది మహిళల సమక్షంలో అతి భారీ స్థాయిలో బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లను ఆదివారం రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వెల్లూరు క్రాంతితో పాటు ఉపేందర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఇతర పర్యాటక అధికారులు పర్యవేక్షించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిపిఐ
# శ్రేణులు సిద్ధం కండి


### ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చూడాలి
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కరీంనగర్ జిల్లాలో కైవసం చేసుకోవడం కోసం సిపిఐ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఎన్నికలు ప్రభుత్వం నిర్వహించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీలకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యదర్శుల సంయుక్త సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగెల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచ్ ఎంపిటిసి స్థానాల పదవీకాలం ముగిసి దాదాపుగా 20 నెలలు అవుతుందని, 73,74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని చట్టం ఆమోదించినప్పటికీ ఎన్నికలు నిర్వహించకపోవడం మూలంగా గ్రామాలు అభివృద్ధికి నోచుకోక కుంటుపడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వేల కోట్ల రూపాయల నిధులు నిలిచిపోయాయని అన్నారు. స్థానిక సంస్థలకు సంబంధించిన పూర్వపరాలను, విధివిధానాలను, పరిపాలనను, అభివృద్ధిని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక కమిటీ బృందాన్ని కేరళ రాష్ట్రానికి పంపించి అధ్యయనం చేయించాలని సూచించారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 28 అంశాలు పంచాయతీరాజ్‌కు అప్పగించాలని, 18 అంశాలు మున్సిపాలిటీలకు అప్పగించాలన్నారు. స్థానిక సంస్థలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చిన తరుణంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించడం సంతోషకరమైనదేనని, ఎస్సీఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. స్వపరిపాలనలో అధికారులు స్పెషల్ ఆఫీసర్ల పాలనకు, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల పరిపాలనకు తేడా ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులు ఉంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. దేశానికే పట్టుకొమ్మలు గ్రామాలని మహాత్మాగాంధీ కలలు గన్నారని, దానిని నిజం చేసేందుకు పరిపాలకులు ముందుండాలని అన్నారు. కరీంనగర్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు యావత్తు సిపిఐ శ్రేణులు సిద్ధమై అత్యధికంగా ఎంపిటిసి, సర్పంచ్ స్థానాలను గెలుచుకునేందుకు ఇప్పటి నుంచి అన్ని గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు, ఎన్నికల కార్యచరణను రూపొందించుకుని ముందుకు పోవాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, వివిధ మండలాల కార్యదర్శులు బండ రాజిరెడ్డి, చొక్కల్ల శ్రీశైలం, లంకదాసరి కల్యాణ్, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి తదితరులున్నారు.

## మోదీ ప్రభుత్వానికి అడ్డుకట్ట వేయడమే
# వామపక్ష పార్టీల లక్ష్యం

### బిసిల 42 శాతం రిజర్వేషన్లకు సిపిఐ సంపూర్ణ మద్దతు: సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/చిట్యాల :** దేశంలో కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను చేస్తూ ప్రజా, కార్మిక, కర్షక, రాజ్యాంగ పరిరక్షణ, వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వానికి అడ్డుకట్ట వేయడమే లౌకిక ప్రజాతంత్ర వామపక్ష శక్తులని లక్ష్యం అని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు. జాతీయ కార్యదర్శిగా పల్లా వెంకట రెడ్డి ఎన్నికై చిట్యాల మండలనికి తొలిసారి వచ్చిన సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు మునుకుంట్ల నాగయ్య నివాసంలో శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం పల్లా వెంకటరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సిపిఐ జాతీయ మహాసభలు ఈనెల 21 నుండి 25 వరకు చండీగఢ్‌లో నిర్వహించడం జరిగిందని మహాసభలో దేశ రాజకీయాలు కేంద్రంలో మతోన్మాద ప్రభుత్వం అవలంభిస్తున్న పాలనపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం జరిగిందని తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రమాదకరమైన నిర్ణయాలను అడ్డుకునేందుకు గత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్ష పార్టీలతో పాటు బిజెపి హేతర పార్టీలు ఇండియా కూటమిగా ఎన్నికలలో పోటీచేయడం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి రాకపోయినప్పటికీ బిజెపికి సీట్ల సంఖ్య తగ్గించడంలో విజయం సాధించడం జరిగిందని గుర్తు. బిజెపి ఇతర పార్టీల మద్దతు అధికారంలో ఉండి అన్ని ప్రభుత్వ వ్యవస్థలను తన ఆధీనంలోకి తీసుకొని ఎన్నికల కమిషన్ ద్వారా బీహార్ రాష్ట్రంలో ఇతర దేశాల నుండి చొరబాటుదారులు వస్తున్నారని సాక్ చూపి బిజెపి హేతర ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బిసిల జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు అనుకూలం అని స్పష్టంగా చెప్పినప్పటికీ రిజర్వేషన్లుకు వ్యతిరేకంగా కోర్టు పోవడం అవివేకం అన్నారు. ఇప్పటికైనా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని కోరారు.

**కెమికల్ ఫార్మా కంపెనీల మేలు కోసమే ట్రిబుల్ ఆర్ రోడ్ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ట్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణం కెమికల్, ఫార్మా కంపెనీల భూములకు నష్టం కలగకుండా చిన్న కారు, సన్న కారు రైతులతో పాటు పేద ప్రజల భూములకు నష్టం కలిగే విధంగా ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఆరోపించారు. మూడుసార్లు అలైన్మెంట్ చేసిన భూములు కోల్పోతున్నా బాధితులకు బహిరంగ మార్కెట్ ప్రకారం నష్టపరిహారం ఇవ్వకపోవడం వల్ల బాధితులకు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా కేంద్రం చుట్టూ వేస్తున్న ఔటర్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న వారికీ సరైన నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. చిట్యాల మండలంలో వెల్మినేడు గ్రామపంచాయతీ పరిధిలో మైనింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. మట్టి తరలింపుకు ప్రభుత్వ భూములు, గుట్టలను సైతం వదలడం లేదని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, యాదాద్రి భువనగిరి మాజీ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, జిల్లా నాయకులు ఏశాల అశోక్, మండల కార్యదర్శి ఎండి అక్బర్, నాయకులు బొడిగె సైదులు, జిల్లా సత్యం, ఎస్‌కె షరీఫ్, జిల్లా యాదయ్య, మునుకుంట్ల నాగయ్య, బాలరాజు, బొల్లూరి లింగయ్య, తదితరులు ఉన్నారు.

## గురుకుల కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించండి
### హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గురుకులాలకు నిత్యావసరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్ల బిల్లులను వెంటనే చెల్లించాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల బిల్లులు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉంటే, గురుకులకు ఆహార పదార్థాలు ఎలా సరఫరా చేస్తారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్తీ ఆహారంతో గురుకుల విద్యార్థులు ఆసుపత్రుల పాలై ప్రాణాలు వదులుతుంటే, ప్రభుత్వానికి పట్టింపు లేకపోవడం శోచనీయమన్నారు. గురుకుల విద్యార్థులు పస్తులు ఉండకూడదన్న బాధ్యతతో కాంట్రాక్టర్లు అప్పులు తీసుకొచ్చి మరీ భోజనాలు పెడుతున్నారని చెప్పారు.

## గ్రూప్–2 ఫలితాలు విడుదల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిపిఎస్‌సి గ్రూప్–2 ఫలితాలు విడుదలయ్యాయి. గ్రూప్–2 పోస్టులకు ఎంపికైన జాబితాను టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్ర వెంకటేశం ఆదివారం వెల్లడించారు. 18 రకాల గ్రూప్–2 ఉద్యోగాలకు ఎంపికైన జాబితాను విడుదల చేశారు. 2022 డిసెంబర్‌లో గ్రూప్ 2 పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్‌ను టిజిపిఎస్‌సి విడుదల చేసిన విషయం తెలిసిందే. 783 పోస్టులకు గతేడాది నవంబర్‌లో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు నిర్వహించింది. 783 పోస్టులకు గానూ 782 పోస్టులకు ఎంపికైన వారి జాబితాను ప్రకటించింది. ఒక్క పోస్టు ఫలితాన్ని మాత్రం టిజిపిఎస్‌సి పెండింగ్‌లో పెట్టింది.

## కేంద్రం వద్దకు అఖిలపక్షం : జాగృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కేంద్ర ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లాలని, కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ధర్నాలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల అంశాన్ని షెడ్యూల్ 9 లో చేర్చి, రాజ్యాంగ పరమైన రక్షణ కల్పించాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గవర్నర్, రాష్ట్రపతి వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో జిఒను కోర్టు కొట్టివేసే ఆస్కారం ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పని చేయకుండా రిజర్వేషన్ల విషయంలో ఎవ్వరూ కోర్టు వెళ్లవద్దని మంత్రి చెబితే వెళ్లకుండా ఉంటారా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి సీనియర్ నాయకులు రూప్ సింగ్, బిసి జాగృతి అధ్యక్షుడు ఎత్తరి మారయ్య, ఎంబిసి జాగృతి అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ బురద రాజకీయాలు మానుకోవాలి
### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** ప్రకృతి వైపరీత్యాన్ని సైతం రాజకీయం చేయడం బీఆర్‌ఎస్ పార్టీకి అలవాటు ఉందని, పదేండ్ల పాటు మంత్రిగా చేసిన కేటీఆర్‌కు కొంచెమైనా తెలి ఉందనుకున్నానని, కాని లేదని తేలిపోయిందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఇకనైనా బురద రాజకీయాలు మానుకోని ప్రజా సంక్షేమం కోసం ఆలోచించాలన్నారు. పదేండ్ల పాటు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ ఎలాంటి అవగాహన లేకుండా మూసీ గేట్లు ఎత్తామని పేర్కొనడం ఆయన విజ్ఞతకు, అవగాహన రాహిత్యానికి నిదర్శనమన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరద ప్రవాహం పోటెత్తిన సందర్భంలో ప్రజలను అప్రమత్తం చేసి పునరావా కేంద్రాలను ఏర్పాటు చసి ప్రజలను తరలించిన తరువాతనే గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయడం జరిగిందన్నారు. ఊహించని వరదతో ఆర్టీసీ బస్టాండ్ నీటి ప్రవాహంలో మునిగినప్పటికీ యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దామన్నారు. క్లౌబ్ బరస్ట్‌లు జరుగుతూ ఆపత్కాలంలో ఉన్న ప్రజలను ఆందోళనకు గురి చేయడం పద్దతి కాదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై మాట్లాడుతూ ఎవరికెంతో వారికంత రాహుల్‌గాంధీ నినాదంతో అన్ని పక్షాల ఆమోదంతో రిజర్వేషన్లు అమలు చేస్తున్నామన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అన్ని పక్షల మద్దతు ఉందని స్పష్టం చేశారు. ఇందులో ఏ ఒక్కరి ప్రయోజనం లేదన్నారు. దీనిపై కొందరు కేసులు వేసినప్పటికీ కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు చిరుమర్రి కృష్ణయ్య, మైబెల్లి, కాంగ్రెస్ పార్టీ జిల్లా స్టార్ క్యాంపెయిన్ ఛైర్మన్ పోలగాని వెంకటేష్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తలకొప్పుల సైదులు, జిల్లా నాయకులు చిలుకూరు బాలు తదితరులు ఉన్నారు.

**సొంతూర్లకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంతూర్లకు వెళ్లే ప్రజలకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆదివారం మంత్రి ఆర్‌టిసి ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్‌లో ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎల్‌బి నగర్, ఆరాంఘర్ తదితర కేంద్రాల్లో ప్రయాణికులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించాలని మంత్రి సూచించారు. ప్రతి బస్ స్టేషన్‌లో ప్రత్యేక అధికారిని నియమించి, రద్దీని బట్టి ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకరావాలన్నారు. ఆర్‌ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డిఎంలతో పాటు ఉన్నతాధికారులందరూ క్షేత్రస్థాయిలో సమన్వయం చేస్తూ 97 డిపోలు, 340 బస్ స్టేషన్‌ల ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా చూడాలని మంత్రి ఆదేశించారు. దసరా నేపథ్యంపై రాష్ట్రవ్యాప్తంగా 7,754 స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు అధికారులు మంత్రికి తెలిపారు. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబర్ 2న జరగనున్నందున, ఈ శనివారం నుంచే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకే ప్రత్యేక బస్సులను ముందుగానే సిద్ధం చేశామని అధికారులు చెప్పారు.

## సిఆర్ ఫౌండేషన్ సందర్శించిన కె.రామకృష్ణ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** ఇటీవల చండీఘర్‌లో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ 25వ మహాసభలో జాతీయ కార్యవర్గ ఆహ్వానితునిగా ఎన్నికైన కె.రామకృష్ణ, సతీమణి సుజాత, కుమార్తె సాయి, కుమారుడు హర్షలతో కలసి కుటుంబ సమేతంగా హైదరాబాద్ విచ్చేసిన సందర్భంగా మొదటగా చంద్ర రాజేశ్వర్‌రావు ఫౌండేషన్ సందర్శించి ఫౌండేషన్ హోమ్ ఫర్ ఏజ్‌లో నివసిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ వృద్ధ నాయకులు ఐదుకల్లు అరుణకుమారి, ఐఎస్ రాజు, ఝాన్సీ దంపతులు, సీనియర్ పాత్రికేయుడు ఏబికే ప్రసాద్, వెలుగోలు సాంబశివరావు తదితరులను పరామర్శించి వారి అభినందనలు పొందారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ ఆహ్వానితులుగా ఎన్నికై మొదటిసారిగా సిఆర్ ఫౌండేషన్ సందర్శించిన కె.రామకృష్ణ దంపతులను సిఆర్ ఫౌండేషన్ డైరెక్టర్, కోశాధికారి చెన్నకేశ్వర్‌రావు శాలువా కప్పి సత్కరించారు. తదుపరి చెన్నకేశ్వర్‌రావు మాట్లాడుతూ రామకృష్ణ సిఆర్ ఫౌండేషన్ సభ్యునిగా కొనసాగుతున్నారని ఈయనకు జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఎన్నికవడం సంతోషంగా ఉందని ఆయన మరిన్ని పదవులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు తమ్మారెడ్డి తాన్యా, డాక్టర్ గోపిచెంద్, ఎన్.రాజేందర్‌రావు, హోం మేనేజర్ శ్రీనివాస్ ఆశ్రమవాసులు పాల్గొన్నారు.

## రైతులకు శ్రీరామరక్షగా
# మనీ లెండింగ్ యాక్ట్
### రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుండి రైతులను కాపాడడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన మనీ లెండింగ్ యాక్ట్ శ్రీరామరక్ష కానుందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని తీవ్రంగా నష్టపోయి వాటిని కట్టలేని పరిస్థితుల్లో కొంత మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మనీ లెండింగ్ యాక్ట్ 1349 అమలు కావడం లేదని, ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గత రెండు నెలల క్రితం ప్రభుత్వానికి ఆధారాలతో రైతు కమిషన్ లేఖ రాసిందని తెలిపారు. రైతు కమిషన్ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం మనీ లెండింగ్ యాక్ట్ 1349 ను పకడ్బందీగా అమలు చేయాలని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ప్రధానంగా సన్న చిన్న కారు రైతులు, కౌలు రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల చేతులో మోసపోయారని ఇక నుండి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల ఆటలు సాగవని స్పష్టం చేశారు.

## భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశం కోసం తృణః ప్రాయంగా ప్రాణాలను అర్పించిన షహీద్ భగత్ సింగ్ బాటలో నేటి యువత నడవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. షహీద్ భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ భగత్ సింగ్ కటౌట్‌కు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదన్నారు. 12 ఏళ్ళ అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ళ యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్ సింగ్ అని వారు కొనియాడారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్‌కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలోఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సల్మాన్ బేగ్, హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, ఉపాధ్యక్షులు హేమంత్, శబుద్దీన్, మహేష్, అనీల్ కుమార్, విజయ్, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు
# బాంబు బెదిరింపు
### ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ అలర్ట్... ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచన




**ప్రజాపక్షం/శంషాబాద్:** శంషాబాద్ ఎయిర్ పోర్టుకు ఆదివారం దుండగులు బాంబు ఉందని బెదిరింపు ఇచ్చారు. ఎయిర్ పోర్టుకు పంపిన ఈమెయిల్‌లో దుండగులు ఈ విషయం వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సెక్యూరిటీ సిబ్బంది ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనంతరం ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ప్రయాణికులను అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రయాణికులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కూడా అధికారులు హెచ్చరించారు. ఇప్పటివరకు, పలు రాష్ట్రాల ఎయిర్‌పోర్టులకు మెయిల్, కాల్స్ ద్వారా బెదిరింపులు రావడం పాలన, భద్రతా సమస్యలుగా మారింది. కేంద్ర ఇంటెలిజెన్స్ అధికారులు ఇప్పటికే అలర్ట్ అయ్యి, కాల్స్ ఎవరిచే జరుగుతున్నాయో పరిశీలిస్తున్నారు. ప్రజలు భయాందోళనలో ఉన్న నేపథ్యంలో, అధికారులు సౌకర్యవంతమైన, పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని పలు వర్గాలు కోరుతున్నారు.

# సమతుల్యమైన పర్యావరణ వ్యవస్థను కాపాడుకోవాలి




కేంద్ర పర్యావరణ, ఆటవీ, వాతావరణ మార్పు శాఖల మంత్రి భూపేందర్ యాదవ్

**ప్రజాపక్షం/కొత్తూరు:** సమతుల్యమైన పర్యావరణ వ్యవస్థలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కేంద్ర పర్యావరణ, ఆటవీ వాతావరణ మార్పు శాఖల మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూరు సమీపంలో ఉన్న కన్హాశాంతి వనంలోని హార్ట్‌ఫుల్‌నెస్ ప్రధాన కార్యాలయంలో దాజీ 70వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శకులు, రామచంద్రమిషన్ అధ్యక్షులు దాజీ 70వ జన్మదినోత్సవానికి భారతదేశ మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షించేందుకు మానవ జీవకోటి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. దాజీ మహత్తరమైన విప్లవాన్ని తీసుకువచ్చారని, విద్య, ఆరోగ్యం, లింగ న్యాయం, సమానత్వం, వనరుల లభ్యత వంటివి ఎంతో ముఖ్యమైనవని వివరించారు. ప్రతి ఒక్కరు ఆనందాన్ని వెతుకుకుంటారని, కానీ ఆనందం కేవలం బౌతిక విజయాల ద్వారానే వస్తే అభివృద్ధి చెందిన దేశాలలో నిరాశ అనే సమస్య ఉండేది కాదని తెలిపారు. భారతీయ యోగాసన విధానాలు ప్రకృతితో అనుసంధానమై ఉన్నాయని, మన ఆయుర్వేదం కూడా పంచభూతాలతో ముడిపడి ఉంటుందని వివరించారు. యోగా, ధ్యానం ద్వారా మనం ఏకత్వాన్ని పొందుతాం, ధ్యానం అనేది ఆ ఏకత్వానికి మార్గం, హార్ట్‌ఫుల్‌నెస్ ఆత్మ, ప్రకృతికి మధ్య సమగ్రతను కలిపే అంతిమ ఉదాహరణ అని పేర్కొన్నారు. పర్యావరణాన్ని రక్షించడానికి శక్తిని సంరక్షించడానికి జోక్యం కల్పించుకునే విధానమైందని అన్నారు. భారతీ సంస్కృతికి మూలమైన విలువ ప్రకృతితో సహజీవనం అనేది హార్ట్‌ఫుల్‌నెస్ అద్భుతంగా ఆచరిస్తుందని వివరించారు. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ జీవించి ఉన్న గురువు మీకు దైవానికి మధ్య వారధి, వారి మార్గదర్శకత్వం అంతర్గత పరివర్తనకు ప్రపంచం పర్యావరణంతో పరస్పర చర్యకు దారి తీస్తుందని వివరించారు. గుజరాత్‌లో ఫారెస్ట్స్ బై హార్ట్‌ఫుల్‌నెస్ చేస్తున్న అద్భుతమైన పనిని ప్రశంసించారు. ప్రకృతి, మనుషులు కలిసి స్వస్థత పొందగల మార్గం ఏమిటో స్పష్టంగా వివరించారు. భారతదేశం యొక్క జ్ఞానం, కరుణ మానవాళికి సేవ చేయడం యొక్క సజీవ స్ఫూర్తికి మనం దాజీ పుట్టిన రోజు జరుపుకోవడమేనని పేర్కొన్నారు. అనంతరం అభ్యాసకులతో ధ్యానం, యోగా చేశారు.

## ఎన్ఆర్ఎస్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



ప్రజాపక్షం/కోదాడ: కోదాడ పట్టణంలోని ఎన్ఆర్ఎస్ కళాశాలలో ఆదివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలను పేర్చి వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ ఆడుతూ ఆట పాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వద్దే రాజేష్‌చౌదరి, డైరెక్టర్ మనోహర్ రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాల్, అకాడమిక్ అడ్వైజర్ మైనం రామయ్య, వైస్ ప్రిన్సిపాల్ జివి పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన ఎస్ఐ నాగరాజు



ప్రజాపక్షం/రామన్నపేట : ఈనెల 27న నల్లగొండ ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా 69వ ఎస్‌జీఎఫ్ తైక్వాండో పోటీల్లో బాలబాలికల సెలక్షన్స్ జరగగా మండలానికి చెందిన ఎండి.ఉమర్ అండర్14 బాలుర విభాగంలో బ్రాంజ్ మెండల్, మినుమలు అభినయ్ అండర్17 బాలుర విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను ఎస్ఐ డి.నాగరాజు మెడల్స్ అందించి అభినందించార. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ ఫణింద్రకుమార్‌లు పాల్గొన్నారు.



## పిల్లలమర్రి ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తా

### ప్రొఫెసర్ అర్జునరావు కుతాడి

ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్ : పిల్లలమర్రి ఆలయాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు ప్రొఫెసర్ అర్జునరావు కుతాడి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాలోని పిల్లలమర్రి గ్రామంలో ఉన్న రాష్ట్ర రక్షిత కట్టడాలైన నామేశ్వర ఆలయం, ఎరికేశ్వర దేవాలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఆలయాల స్థితిగతులను పరిశీలించిన అనంతరం వాటి అభివృద్ధి కోసం పురావస్తు శాఖ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు, పర్యాటకులకు ఆలయాల చరిత్ర తెలిసే విధంగా సైన్ బోర్డులు, వివరణాత్మక బోర్డులు ఏర్పాటు చేయాలని అదేశించారు. ఆలయ గోడలపై ఉన్న వైట్‌వాస్‌ను వెంటనే రసాయనిక శుద్ధి చేసి, శిల్ప సంపదను, చరిత్రను భక్తులకు, పర్యాటకులకు స్పష్టంగా చూడగలిగేలా చేయాలని అదేశించారు. ఆలయంలో ఉన్న శాసనాల వివరాలను కూడా బోర్డుల రూపంలో ప్రదర్శించి చరిత్రకారులకు, పర్యాటకులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పర్యాటకులకు ఆలయ చరిత్ర వివరించడానికి ఒక టూరిస్టు గైడ్‌ను నియమించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంచాలకులతో పాటు ఉప సంచాలకులు డాక్టర్ పి.నాగరాజు, ఎన్.నర్సింగ్ నాయక్, మహాత్మాగాంధీ యూనివర్శిటికి చెందిన చరిత్రకారులు డాక్టర్ ఎండి షరిఫ్, డాక్టర్ పి.రామకృష్ణ, డాక్టర్ కిషోర్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.



## దేవీ నవరాత్రి ఉత్సవాలలో మహా అన్నదానం

ప్రజాపక్షం/కోదాడ: పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో ఉన్న శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి ఆలయం వద్ద దేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో8వ రోజు కావడంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఎర్నేని వెంకటరత్నంబాబు, కోదాడ మాజీ సర్పంచ్ పార సీతయ్య, సింగిల్ విండో చైర్మన్ తోటజ్యోతి శ్రీను, నెమ్మాది రత్తయ్యదేవమణిలు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా దేవి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే ప్రతి రోజు అమ్మవారు వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిస్తుందని తెలిపారు. ఎక్కడ లేని విధంగా శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి ఆలయం కోదాడలోని అంబేద్కర్ కాలనీలో మాత్రమే ఉన్నదని ఈ ఆలయానికి దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



## సద్దుల బతుకమ్మ ఏర్పాట్లలో సూర్యాపేట మున్సిపాలిటీ

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: సూర్యాపేట పట్టణంలోని సోమవారం రోజున సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని బతుకమ్మ ఆడు మహిళల సౌకర్యార్థం పట్టణంలోని విలీన గ్రామాలలో మొత్తం 44 ప్రాంతాలలో, 33 నిమజ్జన ప్రాంతాలలో లైటింగ్, బారీ కేడింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి అన్నారు. మొదటి బతుకమ్మ రోజే బతుకమ్మ ఆడు ప్రాంతాలలో క్రషర్ పౌడర్ పోయించడం జరిగిందని, సద్దుల చెర్వు కట్టపై 7 ప్రాంతాలలో విలీన గ్రామాలలో బతుకమ్మలను నిమజ్జనం చేయుటకు గానూ 220 మంది సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు ఎవరు కూడా చెరువులోకి దిగవద్దని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.



## నూతన గృహప్రవేశం కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే

ప్రజాపక్షం/తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి నరసింహ రెడ్డి నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆదివారం ఆలేరు మాజీ ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శాగర్ల పరమేష్ యాదవ్, గోవింద చారి, నల్ల శ్రీకాంత్, పాండు, తాటికొండ నరసింహులు, పిడిశెట్టి భాస్కర్, గ్రామస్తులు రామ్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎక్సైజ్ ఉద్యోగానికి ఎంపిక

ప్రజాపక్షం/మోతె : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన గ్రూప్2 ఫలితాలలో మండల పరిధిలోని సిరికొండ గ్రామానికి చెందిన గునగంటి సతీష్ ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. మొదటగా గ్రూప్4లో ఉద్యోగం సాధించి ప్రస్తుతం సూర్యాపేట జిల్లా మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం నిర్వహిస్తూ ఇటీవల ప్రకటించిన గ్రూప్2లో ఎక్సైజ్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. దీంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు హార్షం వ్యక్తం చేశారు.

# ఆలయాలలో చరిత్ర సైన్‌బోర్డులు

### రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు అర్జునరావు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : భక్తులకు, పర్యాటకులకు ఆలయాల చరిత్ర తెలియజేసే విధంగా సైన్‌బోర్డులు, వివరణాత్మక బోర్డులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు, ప్రొఫసర్ అర్జునరావు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17న రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులుగా ప్రొఫసర్ అర్జునరావు కుతాడిని నియమించింది. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన ఆదివారం నల్లగొండ పట్టణంలోని పానగల్‌లో ఉన్న రాష్ట్ర రక్షిత కట్టడాలైన పచ్చల సోమేశ్వర ఆలయం, ఛాయా సోమేశ్వర దేవాలయం జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాల స్థితిగతులను పరిశీలించిన అనంతరం,వాటి అభివృద్ధి కోసం పురావస్తు శాఖ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు పర్యాటకులకు ఆలయాల చరిత్ర తెలియజేసే విధంగా సైన్‌బోర్డులు,వివరణాత్మక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.అదేవిధంగా,ఆలయ గోడలపై ఉన్న వైట్ వాష్‌ను వెంటనే రసాయనిక శుద్ధి కెమికల్ క్లీనింగ్ చేసి, శిల్ప సంపదను చరిత్రను భక్తులు, పర్యాటకులు స్పష్టంగా చూడగలిగేలా చేయాలని ఆదేశించారు. ఆలయంలో ఉన్న శాసనాల వివరాలను కూడా బోర్డుల రూపంలో ప్రదర్శించి చరిత్రకారులకు, పర్యాటకులకు అందుబాటులో ఉంచాలనిసూచించారు. పర్యాటకులకు ఆలయ చరిత్ర వివరించడానికి ఒక టూరిస్ట్ గైడ్‌ను కూడా నియమించాలని ఆయన పేర్కొన్నారు.

పచ్చల సోమేశ్వర, ఛాయా సోమేశ్వర ఆలయంలో సంరక్షణ పనులు చేపట్టాలని సూచించారు. సంచాలకులు పురావస్తు శాఖ సిబ్బంది తయారుచేసిన అంచనాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఈ అంచనాలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు డాక్టర్ పి.నాగరాజు, ఎన్.నర్సింగ్ నాయక్, మహాత్మాగాంధీ యూనివర్సిటీకి చెందిన చరిత్రకారులు డాక్టర్ హమ్మద్ షరీఫ్, డాక్టర్ కిషోర్, పాల్ రెడ్డి వెంకట్ రెడ్డి, గుండగోని యాదయ్య, కొడిదల ఎల్లయ్య, గుండగోని శ్రీనివాస్, పురావస్తు ప్రదర్శనశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆల్మట్టి పెంపును అడ్డుకుంటాం

### కాంగ్రెస్ మోసాలపై బిఆర్ఎస్ సైన్యం కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ :మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ : ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుతో నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాలకు మరణ శాసనం రాసినట్లు అవుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. అధికారం కోసం హామీలిచ్చి, గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బిఆర్ఎస్ తీసుకొచ్చిన కాంగ్రెస్ బాకీ కార్డును ఆదివారం తిప్పర్తి మండల కేంద్రంలో ప్రతి ఇంటికీ అందచేసి అనంతరం జగదీశ్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే కృష్ణ బేసిన్‌లో ఆలస్యంగా నీళ్లు వస్తున్నాయని ఆల్మట్టి ఎత్తు పెంచితే ఇక్కడున్న భూములు పడావ పడతాయన్నారు. ఇక్కడున్న అధికార కాంగ్రెస్ పార్టీకి సోయి లేదని, ఇది దద్దమ్మ ప్రభుత్వం అని, ఏదీ పట్టించుకోవట్లేదని విమర్శించారు. ఆల్మట్టి పెంపుగాని జరిగితే ఇక్కడ పొలాలన్నీ ఎడారిగా మారాల్సిందే అన్నారు. అందుకే బిఆర్ఎస్ తరపున నల్లగొండ జిల్లా రైతులతో కలిసి ఛలో ఆల్మట్టి కార్యక్రమాన్ని చేపడతున్నామని తెలిపారు. ఆల్మట్టి వద్ద జరుగుతున్న కుట్రను బహిరంగంగా ఎండగడతాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంతసేపు కమిషన్లు, పంపకాలు తప్పితే తెలంగాణ రైతాంగ సమస్యల గురించి అవగాహన లేదన్నారు. కెసిఆర్ నాయకత్వంలో చలో ఆల్మట్టి కార్యక్రమం చేపట్టి ఆల్మట్టి వద్ద పెంపును అడ్డుకుంటాం అన్నారు

**మాజీ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డికి పరామర్శ**

ఇటీవల గుండె సంబంధిత వ్యాధి ఇబ్బందితో యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందిన నల్లగొండ మున్సిపాల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డిని ఆదివారం నల్లగొండలోని తన నివాసంలో జగదీశ్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి,గాదరి కిషోర్ కుమార్, బిఆర్ఎస్‌నాయకులు పెద్ది శ్రీనివాస్ గౌడ్, రేగట్టే మల్లికార్జున రెడ్డి,మరగొని గణేష్, బొజ్జ వెంకన్న ఊట్కూరు సందీప్ రెడ్డి, కారింగు జానయ్య,దొడ్డి రమేష్,గాదె వివేక్ రెడ్డి ఉన్నారు.

**చివ్వెంల :** 22నెలల కాంగ్రెస్ పాలనలో గ్యారెంటీల జాడేలేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం చివ్వెంల మండలం ఉండ్రుగొండ గ్రామంలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, రైతు రుణమాఫీ డిసెంబర్ 9లోపే చేస్తామని చెప్పి, హామీలే కాదు ఇంటింటికీ గ్యారెంటీ కార్డు కూడా స్వయంగా వాళ్లే పంచారని తెలిపారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు జూలకంటి జీవన్‌రెడ్డి, రౌతు నర్సింహరావు, ధరావత్‌బాబునాయక్, జూలకంటి సుధాకర్ రెడ్డి, పల్లేటి నాగయ్య, యలగబోయిన శ్రీరాములు, నాగార్జున, రాజు, వెంకటయ్య ఉన్నారు.



## బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట : సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా సూర్యాపేట బతుకమ్మ ఘాట్ (మినిట్యాంక్ బండ్) వద్ద జరుగుతున్న ఏర్పాట్లను తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో తెలుగు ప్రజల అతిపెద్ద పండుగ, రాష్ట్ర పండుగ బతుకమ్మ పండుగ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం 9 రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తోందని, రేపు జరగబోయే సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. అన్ని పనులు పూర్తి కాగా ఇంకొన్ని చిన్న పనులు జరుగుతున్నాయని, రేపు మహిళలు ఆటపాటలతో ఆడుకునే విధంగా ప్రత్యేకంగా డిజె సౌండ్ సిస్టమ్, లైటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. అదనంగా ఈ సారి 200 నుండి 300 వరకు దుర్గమాత విగ్రహాలను ప్రతిష్ఠించినట్లు కమిషనర్ తెలిపారు. పోలీసులతో కలిసి ప్రత్యేకంగా నిమజ్జనాల కోసం ఒక క్రేన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆడపడుచులకు పటేల్ రమేష్‌రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## దత్తాయపల్లి రోడ్డుకు మరమ్మతులు

### త్వరలో రోడ్డు నిర్మాణం వేయిస్తానని ఎమ్మెల్యే హామీ

ప్రజాపక్షం/తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలోని దత్తాయపల్లి గ్రామంలో ఇబ్రాహింపురం వెళ్లే రూట్ రోడ్డు మొత్తం ఇటీవల కురిసిన బారి వర్షాలకు పూర్తిగా దెబ్బతిని, గ్రామ ప్రజలు ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్న సమస్యను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వెంటనే స్పందించి తాత్కాలికంగా గుంతలను పూడ్పించారని, త్వరలో పూర్తి స్థాయిలో రోడ్డు వేయిస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. అప్పటి కప్పుడు టిప్పర్లు, డోజర్ తో కంకర, డస్ట్ కుప్పలను నేర్పించారని తెలిపారు. గ్రామ ప్రజలు ప్రయాణికులతో పాటు ఈరోడ్డు గుండా ప్రయాణించే ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేసి, ఎమ్మెల్యేకు ధన్యవాదములు తెలిపారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దత్తాయపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు దేవరుప్పల మల్లేష్, ఓబీసీ సెల్ జిల్లా కో ఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు దానబోయిన బొందయ్య, యువజన కాంగ్రెస్ మండలనాయకులు, జిట్ట కిషన్ యాదవ్ తదితరులు ఉన్నారు.





## రైస్ మిల్లర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

### అధ్యక్షుడిగా గౌరు శ్రీనివాస్, కార్యదర్శిగా వెంకటరమణచౌదరి



ప్రజాపక్షం/మిర్యాలగూడ : మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం 2025–27 ఎన్నిక ఆదివారం పట్టణంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగాయి. ఎన్నికల అధికారిగా రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పందిరి రవీందర్ వ్యవహరించారు. మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా గౌరు శ్రీనివాస్, కార్యదర్శి1గా వెంకటరమణచౌదరి(బాబి), కార్యదర్శిగా2 పొలిశెట్టి ధనుంజయలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో మొత్తం 90ఓటర్లు కాగా ఉపాధ్యక్ష పదవి కోసం మాశెట్టి శ్రీనివాస్, గోళ్ల రామశేఖర్‌లు పోటీపడగా జరిగిన ఎన్నికల్లో మాశెట్టి శ్రీనివాస్‌కు 15ఓట్లు, రామశేఖర్‌కు 69 ఓట్లు రాగా రామశేఖర్ విజయం సాధించారు. కోశాధికారి పదవికి జరిగిన ఎన్నికల్లో చిల్లంచర్ల శ్రీనివాస్, గందె రాము పోటీ పడగా శ్రీనివాస్‌కు 42 ఓట్లు, రాముకు 44 ఓట్లు వచ్చాయి. దీంతో రాము కోశాధికారిగా విజయం సాధించినట్లు ప్రకటించారు. పది డైరెక్టర్ల పదవి కోసం 30 నామినేషన్లు రాగా డ్రా పద్ధతిలో పది మందిని ఎంపిక చేశారు. డైరెక్టర్లుగా గౌరు శంకర్, నీలా పాపారావు, పోతుగంటి గోపి, ఆతుకూరి గురునాధం, గుర్రం వెంకటరత్నం, శ్రీరంగం నర్సయ్యలు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి రవీందర్ ప్రకటించారు. నూతన పాలకవర్గానికి పలువురు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, గుడిపాటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు చిల్లంచర్ల విజయ్‌కుమార్, మంచుకొండ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్ పాల్గొన్నారు.



## ఇందిరా భవన్‌లో మంత్రి ప్రజా దర్బార్

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం అయ్యే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినీమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయం ఇందిరా భవన్‌లో ప్రజా దర్బార్ నిర్వహించారు.ఉదయం నుండి మంత్రి ఇందిరా భవన్‌లో ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఈ సందర్భంగా బాధితులు తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన వారితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పలువురు వృద్ధులు,మహిళలు, తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పలు వినతులు స్వీకరించి ఆమోదయోగ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని వారికి భరోసా కల్పించారు.



## ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరకిశోరం షాహిద్ భగత్‌సింగ్ ఆశయ సాధన కోసం యువత ఉద్యమించాలని గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 118వ జయంతిని పురస్కరించుకోని ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో నూనుగు మీసాల వయస్సులోనే భగత్‌సింగ్ ఉరికంబాన్ని ముద్దాడిన విషయాన్ని గుర్తు చేశారు. యువత దేశ సంపద అని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై కుటుంబాలకు భారంగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి.సయీద్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వల్లంపట్ల వెంకన్న, ఐఎన్ఏఎస్ఏఎఫ్ జిల్లా నాయకులు సమీఖాద్రి, శ్రీను, సైదులు, శ్రవణ్, వెంకటేశ్వర్లు, నాగరాజు, లలిత, మంగమ్మ పాల్గొన్నారు.

# జిల్లాపరిషత్ చైర్మన్ రేసులో బీర్ల అనిత?

### జడ్‌పిటిసిగా బరిలో నిలిపేందుకు సన్నాహాలు
### మోటకొండూరు చుట్టూ అలుముకున్న జిల్లా రాజకీయం




ప్రజాపక్షం/మోటకొండూరు : యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ చైర్మన్ బిసి మహిళగా రిజర్వేషన్ ఖరారు కావడంతో మోటకొండూరు మండలం చుట్టూ జిల్లా రాజకీయం తిరుతున్నది. మోటకొండూరు మండల జెడ్పిటిసి జనరల్ మహిళగా రిజర్వేషన్ ఖరారు కావడమే ఇందుకు కారణమైంది. జిల్లా రాజకీయాలలో తనదైన శైలిలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దూసుకుపోతున్నారు. ఇప్పటికీ ఆలేరు నియోజకవర్గంలో తన అనుచరులకు పదవులను కట్టబెట్టడంలో సక్సెస్ అయినటువంటి అయిలయ్య తన సతీమణి అనితను మోటకొండూరు మండల జెడ్పిటిసి బరిలో నిలిపి, గెలిపించి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిలో కూర్చోబెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. సొంత మండలం అయిన యాదగిరిగుట్ట జడ్పిటిసి జనరల్ రిజర్వు ఖరారు కావడంతో మోటకొండూర్ జడ్పిటిసి జనరల్ మహిళా రిజర్వేషన్ స్థానంలో పోటీలో నిలపాలని వ్యూహాలు రచిస్తున్నట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన 42 శాతం బిసి రిజర్వేషన్ సాధనలో కీలక భూమిక పోషించిన అయిలయ్య నియోజకవర్గంలో కూడా బిసి నినాదాన్ని ముందుకు తీసుకు వెళుతున్నారు. మోటకొండూరు మండలంలో బిసిల ఓట్లు ఎక్కువగా ఉండటంతో పాటు ఆయన సామాజిక వర్గానికి చెందిన ఓట్లు కూడా పెద్ద సంఖ్యలో ఉండటం వల్ల యాదగిరిగుట్టలో కంటే ఇక్కడి నుంచే పోటీ చేస్తే విజయం నల్లేరుపై నడకగా సాగుతుందన్న అభిప్రాయంతో మోటకొండూరు నుంచి తన సతీమణిని బరిలోకి నిలిపేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తున్నది. మోటకొండూరు మండల కాంగ్రెస్ నాయకులు కూడా అనిత ను మండలం నుంచి జెడ్పిటిసిగా బరిలో నిలపాలని ఇప్పటికే అయిలయ్యకు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. తన సతీమణి రాజకీయాల్లోకి తీసుకురావాలని ముందస్తు వ్యూహంతోనే ఉన్నటువంటి అయిలయ్య ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే బీర్ల ఫౌండేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేసి ఫౌండేషన్ చైర్మన్ బాధ్యతలను సతీమణి అనితకు అప్పగించారు అప్పటి నుంచి ఆమె యాదగిరిగుట్ట, మోటకొండూరు మండలాల్లో ప్రజలకు దగ్గర కావడానికి అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలో కాంగ్రెస్ కుటుంబాలలో జరిగేటువంటి శుభకార్యాలయాలకు హాజరవుతూ కార్యకర్తలను ఆకట్టుకున్నారు. సేవా కార్యక్రమాల్లో ప్రజలతో మమేకమవుతూ ప్రజల్లో ఆదరణ పొందారు. శుక్రవారం రిజర్వేషన్ల ప్రకటన బహిర్గతం కావడంతో మోటకొండూరు జడ్పిటిసి స్థానానికి అనిత పోటీ చేస్తున్నదన్న ప్రచారం జోరందుకోవడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనబడుతున్నది.

గత జెడ్పిటిసి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన యెల్లంల సంజీవరెడ్డి ఈ సారి జరిగే ఎన్నికలలో జెడ్పిటిసి పోటీ చేసి జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాన్ని అదిరోహించాలనే పట్టుదలతో గుడులకు, బడులకు, మసీదులకు ఆర్థిక సహకారంతో పాటు బదుగు బలహీన వర్గాలకు ఆర్థిక సహకారం అందిస్తూ ప్రజలతో మమేకమై ప్రజలను ఆకట్టుకున్నారు.

**బిఆర్ఎస్‌లో డైలమా!**

జెడ్పిటిసి స్థానం జనరల్ అయితే బిఆర్ఎస్ నుండి మదర్ డైరీ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్ రెడ్డి బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబరిచారు. రిజర్వేషన్లు ఖరారు ప్రకటనకు ముందు నుంచే మండలంలో పర్యటనలు చేపడుతూ ఆయన ప్రజలకు దగ్గరకు వెళ్లారు. కానీ జెడ్పిటిసి స్థానం మహిళా జనరల్ కావడంతో ఇప్పుడు ఆయన పోటీ చేసే అవకాశం లేనందున ఆయన సతీమణిని బరిలో దింపుతారా లేక ఇప్పటి వరకు ఎంపీపీగా కొనసాగిన పైళ్ల ఇందిర సత్యనారాయణ రెడ్డి బరిలోకి దిగుతారా అన్నది బిఆర్ఎస్ లో డైలామా కొనసాగుతున్నది. వీరిద్దరూ ఆసక్తి చూపనియెడల కొత్త మహిళలను బరిలో నిలిపే అవకాశాలు ఉన్నాయి.

బిజెపి నుండి పన్నాల స్వప్న చంద్రశేఖర్ రెడ్డి లేదా యెల్లంల స్వప్న శ్రీదర్ రెడ్డి బరిలో నిలిచే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఏది ఏమైనా గ్రామాలలో రిజర్వేషన్ల ప్రక్రియ వెలుగులోకి వచ్చేసరికి ఆశావాహులు అనేక మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి రెడీ అవుతున్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## లడాఖ్ ప్రజలు, సంస్కృతి, సంప్రదాయాలపై బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడి

**న్యూఢిల్లీ :** లడాఖ్ ప్రజలు, సంస్కృతి, సంప్రదాయాలపై బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. గత వారం లేహ్‌లో జరిగిన హింసాకాండలో భద్రతా దళాల కాల్పుల్లో నలుగురు మరణించగా, అనేక మంది గాయపడిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అల్లర్లకు పాల్పడినందుకు ఇప్పటికి వరకు 50 మందిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. లడాఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్ వెనుక ప్రధాన గొంతుకగా నిలిచిన పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం కింద నిర్బంధించి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైలులో ఉంచారు. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందిస్తూ లడాఖ్‌లోని అద్భుతమైన ప్రజలు, సంస్కృతి, సంప్రదాయాలపై బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయని ఎక్స్‌లో పోస్టు చేశారు. లడాఖ్ ప్రజలు తమ గళాన్ని విప్పాలని చూస్తే బిజెపి నలుగురు యువకుల ప్రాణాలుతీసి, సోనమ్ వాంగ్‌చుక్‌ను జైలులో పెట్టడం ద్వా రా స్పందించిందని ఆరోపించారు. హత్యలు, హింస, బెదిరింపులు ఆపాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

## ఐదవరోజూ కర్ఫ్యూ నీడలో లేహ్

**లేహ్ :** హింసాకాండతో అల్లకల్లోలంగా మారిన లేహ్ పట్టణంలో ఆదివారం వరుసగా ఐదవ రోజు కర్ఫ్యూ కొనసాగింది. ఆంక్షల సడలింపుపై నిర్ణయం తీసుకోవడానికి లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర హోదా, లడాఖ్‌ను ఆరవ షెడ్యూల్‌లో చేర్చడం డిమాండ్లపై కేంద్రంతో చర్చలు జరపడానికి లే అపెక్స్ బాడీ (ఎల్ఎబి) పిలుపునిచ్చిన బంద్ సందర్భంగా విస్తృత నిరసనల నేపథ్యంలో బుధవారం సాయంత్రం కర్ఫ్యూ విధించారు. శనివారం పట్టణంలో దశలవారీగా నాలుగు గంటలు సడలించడంతో సడలింపు కాలం ప్రశాంతంగా ముగిసింది. బుధవారం జరిగిన హింసలో నలుగురు మరణించగా, డజన్ల కొద్దీ ఇతరులు గాయపడ్డారు. అల్లర్లకు పాల్పడినట్లు ఆరోపిస్తూ 50 మందికి పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను కూడా జాతీయ భద్రతా చట్టం కింద అదుపులోకి తీసుకుని రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైలులో ఉంచారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరిస్థితి సాధారణంగానే ఉంది. లెఫ్టినెంట్ గవర్నర్ త్వరలో రాజ్ భవన్‌లో భద్రతా సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించనున్నారు. పగటిపూట ఆంక్షల సడలింపుపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఒక అధికారి తెలిపారు. ఇక లేహ్ పట్టణంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. కార్గిల్‌తో సహా కేంద్రపాలిత ప్రాంతంలోని ఇతర ప్రధాన ప్రాంతాలలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు సమావేశమవడాన్ని నిషేధించే నిషేధ ఉత్తర్వులు కూడా అమలులో ఉన్నాయని ఆయన అన్నారు. కర్ఫ్యూ విధించిన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో అల్లర్ల సామాగ్రితో పోలీసులు, సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని మోహరించారు. ఐటిబిపి సిబ్బంది కూడా గస్తీ తిరిగారు. లేహ్ హింస తర్వాత పోలీసు ఎఫ్ఐఆర్‌లలో పేరున్న అనేక మందిలో ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా ఉన్నారు. వారు శనివారం స్థానిక కోర్టులో లొంగిపోయారు. పోలీసులు ఈ నలుగురు వ్యక్తుల కస్టడీని మాత్రమే కోరారని, మిగిలిన వారిని న్యాయస్థాన కస్టడీకి పంపారని, వీరిలో లేహ్ అపెక్స్ బాడీ, లడాఖ్ బౌద్ధ సంఘం యువ నాయకులు, విద్యార్థులు కూడా ఉన్నారని ఆయన అన్నారు. బార్ అసోసియేషన్ అన్ని కేసులను ప్రో బోనోగా స్వీకరించింది. వివిధ సెక్షన్ల కింద ఆరోపణలు ఎదుర్కొంటున్న అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని కోరుతోంది.

## బిహార్, మరో 7 రాష్ట్రాలకు 470 మంది పరిశీలకులు

**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, మరో ఏడు అసెంబ్లీ ఉప ఎన్నికలకు జనరల్, పోలీస్, వ్యయ పరిశీలకులుగా 470 మంది అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదివారంనాడు నియమించింది. ఎన్నికలు సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేలా అధికారులు తమ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. 470 మంది అధికారుల్లో 320 మంది ఐఎఎస్‌లు, 60 మంది ఐపిఎస్‌లు, 90 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఎఎస్, ఐసిఎఎస్ సర్వీసులకు చెందిన వారు ఉన్నారు. ఎన్నికల పరిశీలకులు బిహార్‌లోని నియోజకవర్గాలతో పాటు బుద్గాం, నగ్రోటా (జమ్ముకశ్మీర్), అంతా (రాజస్థాన్) ఘాట్‌సిలా (జార్ఖాండ, జూబ్లీహిల్స్ (తెలంగాణ), తరన్ తారన్ (పంజాబ్), డంపా (జార్ఖండ్, నువాపడా (ఒడిశా)లో మోహరిస్తారు. రాజ్యాంగ నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు పరిశీలకులు సహకరిస్తారని, ఎప్పటికప్పుడు కమిషన్‌కు రిపోర్ట్ చేస్తుంటారని ఎలక్షన్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులలో తమకున్న సీనియారిటీ, సుదీర్ఘ అనుభవంతో ఎన్నికల సజావుగా జరిగేందుకు వీరంతా ఈసీకి సహకరిస్తారని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను నియమించామని పేర్కొంది. రాజ్యాంగంలోని 324వ నిబంధన, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 20బి కింద తమకు లభించిన ప్లీనరీ పవర్స్‌తో పరిశీలకులను నియమించినట్టు ఇసి తెలిపింది. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ ఇసి పర్యవేక్షణ, క్రమశిక్షణ కింద వీరు పనిచేస్తారని వివరించింది.

## కుప్వారాలో చొరబాటు యత్నం భగ్నం..

ఇద్దరు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భద్రతా బలగాలు ఆదివారం నాడు భగ్నం చేశాయి. పాకిస్థాన్ ఆక్రమిత భాగం నుంచి భారత భూభాగంలోకి అడుగుపెట్టేందుకు ఉగ్రవాదులు ప్రయత్నించడంతో అప్రమత్తంగా ఉన్న భద్రతా బలగాలు కాల్పులు ప్రారంభించాయి. ఇరువైపులా హోరాహోరీ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను బలగాలు హతమార్చాయి. కాగా, కెరాన్ సెక్టార్‌లో కాల్పులు కొనసాగుతుండటం, ఎల్ఓసి వెంబడి వాతావరణ ప్రతికూలతల కారణంగా మృతదేహాలను ఇంకా స్వాధీనం చేసుకోలేదని తెలుస్తోంది. మిలిటెంట్లు ఎవ్వరూ తప్పించుకుపోకుండా బలగాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. బోర్డర్ బెల్ట్ వెంబడి తప్పించుకునేందుకు అవకాశమున్న అన్ని మార్గాలను సీల్ చేసేందుకు అదనపు బలగాలను మోహరించారు. అతి సున్నితమైన చొరబాట్ల జోన్‌గా కెరాన్ సెక్టార్‌కు పేరుంది. శీతాకాలానికి ముందు రెండు నెలలూ ఉగ్రవాదులు ఈ జోన్ నుంచి చొరబాటు యత్నాలకు పాల్పడుతుంటారు. దీంతో క్రాస్‌బోర్డర్ టెర్రరిజాన్ని నిరోధించేందుకు భద్రతా బలగాలు నిఘా ముమ్మరం చేస్తుంటాయి.

# 40కి చేరిన తొక్కిసలాట మృతులు

● బాధితులకు అండగా ఉంటామని సిఎం స్టాలిన్ హామీ ● మృతుల కుటుంబాలకు రూ.20లక్షలు ఇస్తామని ప్రకటించిన టివికె వ్యవస్థాపకుడు విజయన్ ప్రకటన



**న్యూఢిల్లీ :** తమిళనాడు కరూర్ జిల్లా వేలుచామిపురంలో టివికె వ్యవస్థాపకుడు విజయ్ శనివారం రాత్రి నిర్వహించిన ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య 40కి చేరింది. మృతుల్లో 9 మంది చిన్నారులు ఉన్నారు. ఈ ఘటన విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం పార్టీ సభ్యులను దిగ్భ్రాంతికి గురిచేసింది. నమక్కల్ జిల్లా నుండి విజయ్ రావడం గంటలకొద్ది ఆలస్యం కావడంతో జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారాంతంలో జరిగిన రాజకీయ ర్యాలీలో ఏర్పాట్లు సరిగా లేకపోవడంపై నూతన పార్టీపై అనేక వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. చివరకు ఆయన సాయంత్రం 7 గంటల ప్రాంతంలో వేదిక వద్దకు చేరుకున్నప్పుడు విషాదం జరిగింది. తొక్కిసలాటను అడ్డుకోవడంలో, సరైన ఏర్పాటు ద్వారా విషాదాన్ని నివారించడంలో పోలీసులను, అధికారులను మాజీ ముఖ్యమంత్రి, ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె పళనిస్వామి ఆరోపించారు. అయితే నటుడిని చూడటానికి ఊహించిన దానికంటే చాలా ఎక్కువ సంఖ్యలో ప్రజలు గుమిగూడడంతో పరిస్థితి అదుపు తప్పిందని పోలీసులు పేర్కొన్నారు.

### బాధితులను పరామర్శించిన సిఎం స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్ చెన్నై నుండి కరూర్‌కు చేరుకుని బాధిత ప్రజలకు అందిస్తున్న చికిత్సపై వైద్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. తొక్కిసలాటలో మరణించిన వారి సంఖ్య 40కి చేరుకుందని ఆరోగ్య అధికారి ఆదివారం తెలిపారు. మృతుల సంఖ్య పెరగడంతో కరూర్ తొక్కిసలాటపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ టివికె మదురైలోని మద్రాస్ హైకోర్టు బెంచ్‌ను ఆశ్రయించింది. ఈ సంఘటనలో కుట్ర జరిగిందని ఆరోపించకుండా, టివికె డిప్యూటీ జనరల్ సెక్రటరీ నిర్మల్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు కోసం పార్టీ హైకోర్టు బెంచ్‌ను ఆశ్రయించిందని అన్నారు. సోమవారం మధ్యాహ్నం 2.15 గంటలకు కేసును విచారించడానికి న్యాయమూర్తి అంగీకరించారని, ఆ తర్వాత తాము అధికారికంగా ప్రకటన చేస్తామన్నారు. అంతకు ముందు ఈ దురదృష్టకర సంఘటనలో 39 మంది మరణించినట్లు తమిళనాడు ఆరోగ్య కార్యదర్శి పి. సెంథిల్ కుమార్ తెలిపారు. వీరిలో 17 మంది మహిళలు, 13 మంది పురుషులు, 4 మంది మగ పిల్లలు, 5 మంది ఆడ పిల్లలు ఉన్నారన్నారు.

### రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

ఈ దురదృష్టకర సంఘటనలో మరణించిన ప్రతి ఒక్కరికీ పిఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 50,000 ఇస్తామని ఆయన 'ఎక్స్'లో పోస్ట్‌లో తెలిపారు. విజయ్ వేదిక వద్దకు సాయంత్రం 7.40 గంటలకు చేరుకున్నారని తమిళనాడు డిజిపి జి. వెంకటరామన్ తెలిపారు. ఎండలో వేచి ఉన్న ప్రజలకు తగినంత ఆహారం, నీరు అందించలేదని, నిర్వాహకులు అంచనా వేసిన సంఖ్య 10,000 అని చెప్పినప్పటికీ, నటుడిని చూడటానికి దాదాపు 27,000 మంది వచ్చారని ఆయన చెప్పారు. తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు చేయడానికి రిటైర్డ్ జడ్జి అరుణ జగదీసన్ నేతృత్వంలోని కమిషన్ కరూర్‌కు వస్తుందని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. ప్యానెల్ సమర్పించిన నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకుంటారని ఆయన అన్నారు. తన విదేశీ పర్యటనను ముగించుకున్న ఉదయనిధి, మృతులకు నివాళులర్పించి, ఆసుపత్రిలో గాయపడిన వారిని పరామర్శించారు. ఆయనతో పాటు ఆరోగ్య మంత్రి మా సుబ్రమణియన్ సహా మంత్రివర్గ సహచరులు కూడా ఉన్నారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.20 లక్షలు ఇస్తామని విజయ్ ప్రకటించాడు. ఈ సంఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశాడు. గాయపడిన వారికి రూ.2 లక్షలు ఇస్తామని ఆయన ప్రకటించారు.

### ఘటనాస్థలిలో చెప్పుల గుట్టలు, పిండిచేసిన నీటి సీసాలు

బూట్లు, చెప్పుల గుట్టలు, పిండిచేసిన నీటి సీసాలు, చిరిగిన పార్టీ జెండాలు, బట్టలు ముక్కలు, విరిగిన స్తంభాలు, పార్టీ పోపర్ల నుండి స్ప్రే చేయబడిన కాగితపు ముక్కలు , వివిధ రకాల చెత్త, వేదిక వద్ద విషాద ఘటనను గుర్తుకు తెస్తున్నాయి. తొక్కిసలాట జరిగిన ప్రదేశంలో జనసమూహంలో ఉన్న ఒక యువకుడు సురక్షితంగా బయటపడగలిగాడు. అనేక మంది రోడ్డు మార్జిన్‌కు దగ్గరగా ఉన్న లోతట్టు మురుగునీటి కాలువలోకి నెట్టబడ్డారని, అదే సమయంలో చాలా మంది బయటకు రావడానికి ప్రయత్నించారని అతను పేర్కొన్నాడు. అభిమానులు విజయ్ పేరును జపిస్తుండగా తొక్కిసలాట జరిగి ప్రజలు కింద పడిపోయారని చాలామంది గ్రహించలేదు. పడిపోయిన వ్యక్తులపై కాళ్ళు పెట్టిన చాలా మంది కూడా జారి పడి పడిపోయారని ఆయన విలేకరులతో అన్నారు. తొక్కిసలాటకు కారణం గురించి చాలా మందికి పలురకాల వాదనలు వినిపిస్తున్నారు. వేదిక వద్ద బారికేడ్లు, ఆవరణను తయారు చేయడానికి ఉపయోగించిన టిన్ షీట్లను ప్రజలు దూరంగా నెట్టారు. సమీపంలోని గడ్డిపైకి ఎక్కిన చాలామంది కిందపడి గాయపడ్డారు. దాదాపు అదే సమయంలో పరిస్థితిని నియంత్రించడానికి పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అయితే, జనసమూహంలో చిక్కుకుని కిందపడిపోయిన పిల్లలతో సహా ప్రజలు ఏమి జరుగుతుందో అర్థం చేసుకోలేకపోయారు. ఒక రాజకీయ పార్టీ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో ఇంత మంది చనిపోవడాన్ని తాను ఎప్పుడూ చూడలేదని 70 ఏళ్ల వయసున్న ఒక వృద్ధుడు చెప్పాడు. ఆ నటుడిని ఎలాగైనా చూడాలనే ఆందోళనకు యువకులే కారణమని నిందించాడు. గాయపడిన వారిని తీసుకువచ్చే అంబులెన్స్‌ల నిరంతర సైరన్‌తో కరూర్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది కూడా ఉలిక్కిపడ్డారు. చలనం లేని తన పిల్లలను పట్టుకుని యువకులు, మహిళలు ఏడుస్తున్న దృశ్యాలు హృదయాలను కదిలించాయి. తొక్కిసలాట జరిగిన దాదాపు గంట తర్వాత పోలీసులు లాఠీచార్జ్ చేస్తూ మిగిలిన జనసమూహం వేదిక నుండి తరిమేశారు. తొక్కిసలాట తర్వాత, విజయ్ వేదిక నుండి బయలుదేరాడు.

# ఆర్టికల్స్‌లోని అన్ని అభిప్రాయాలు తప్పక పంచుకునే అవసరంలేదు

అధికారిక త్రైమాసిక మ్యాగజైన్ 'రాజహంస్' ప్రారంభ ఎడిషన్‌ను విడుదలచేసిన కేరళ సిఎం విజయన్





**తిరువనంతపురం :** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రాజ్‌భవన్‌లో అధికారిక త్రైమాసిక మ్యాగజైన్ 'రాజహంస్' ప్రారంభ ఎడిషన్‌ను ఆదివారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వ్యాసాలలో అన్ని అభిప్రాయాలను తప్పకుండా పంచుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యతిరేక అభిప్రాయాలు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టవని, భిన్నస్వరాలు, అభిప్రాయాలను అనుమతించే అనుమతించే ప్రజాస్వామ్య స్థలాన్ని నిర్వహించడం యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సమక్షంలో రాజ్‌భవన్‌లో జరిగే సమావేశాలు, చర్చలను ఈ త్రైమాసిక మాగ్యజైన్ వివరిస్తుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు. సమాజం చర్చకు ఒక స్థలమని, అందువల్ల భిన్నమైన లేదా విరుద్ధమైన అభిప్రాయాలను అందించే కథనాలు పత్రికల్లో వచ్చి ఉండవచ్చని ఆయన అన్నారు. 'ఆర్టికల్ 200 మరియు రాజ్యాంగం చిక్కుముడి' అని పత్రికలో వచ్చిన ఒక కథనాన్ని ఉటంకిస్తూ గవర్నర్, శాసనసభ అధికారాలపై రచయిత అభిప్రాయాన్ని ప్రభుత్వం పంచుకోదని అన్నారు. అది రచయిత వ్యక్తిగత అభిప్రాయం కావచ్చని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. 'రాజ్‌భవన్ యొక్క అధికారిక జర్నల్‌లో కనిపించినంత మాత్రాన ప్రభుత్వం అన్ని అభిప్రాయాలను పంచుకుంటుందని ఎవరూ భావించకూడదు' అని విజయన్ చెప్పారు. రాజ్‌భవన్ అనేక చారిత్రక సంఘటనలకు సాక్ష్యంగా నిలిచిందని, భవిష్యత్తులో అలాంటి సంఘటనలు సరిగ్గా నమోదు చేసేలా 'రాజహంస్'నిర్ధారిస్తుందన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్ గవర్నర్ అర్లేకర్‌ను ప్రశంసల్లో ముంచెత్తారు. కేరళ రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో నిలపడంలో అర్లేకర్ తీసుకున్న చొరవ ఫలితంగా ఈ త్రైమాసిక పత్రిక వచ్చిందన్నారు. తన విద్యార్థి దశ నుంచే కేరళ రాష్ట్రం తనను ఆకర్షిస్తోందని విజయన్ గుర్తు చేసుకున్నా రు. 'రాజహంస్' మొదటి కాపీని సీనియర్ కాం గ్రెస్ నాయకుడు, తిరువనంతపురం ఎంపి శశిథరూర్ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఇటీవల రాజ్‌భవన్‌లో ప్రదర్శించబడిన భారతమాత చిత్రపటం పెద్ద రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ సారి భారతమాత చిత్రప టం కార్యక్రమంలో కనిపించలేదు.రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో ఛాన్స్‌లర్ల నియామ కం సహా వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాలు ఉన్నందున, పుస్తక విడుదల కోసం ముఖ్యమంత్రి పినరయి విజయన్ రాజ్‌భవన్‌కు రావడం ప్రాముఖ్యతను సంతరించుకుంది.

## వ్యాన్-బస్సు ఢీ... పసిబిడ్డ సహా ఐదుగురు మృతి

**లఖింపూర్ ఖేరీ (యుపి) :** యుపిలోని లఖింపూర్ ఖేరీలో బస్సును వ్యాన్ ఢీకొనడంతో రెండేళ్ల చిన్నారితో సహా కనీసం ఐదుగురు మృతి చెందగా, పది మంది తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఖేరీ పట్టణంలో సుమారు 15 మంది ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్ ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మరణించిన వారిలో ఇద్దరు వ్యాన్ డ్రైవర్, పిపారియా గ్రామ నివాసి సునీల్ (25), దటేలి గ్రామానికి చెందిన రెండేళ్ల బాలుడు సరఫ్రాజ్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు బుధ్రామ్, రామ శంకర్‌గా గుర్తించగా, ఐదవ మృతుడి గుర్తింపు ఇంకా నిర్ధారించలేదు. తీవ్రంగా గాయపడిన ఏడుగురిని లక్నోకు తరలించగా, మిగిలిన ముగ్గురు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను పరామర్శించిన తర్వాత ఖేరీ డిఎం దుర్గా శక్తి నాగ్‌పాల్ జిల్లా ఆసుపత్రిలో విలేకరులతో మాట్లాడారు. ప్రమాదం ఓయెల్ మలుపు (లఖింపూర్–సీతాపూర్ హైవేపై) వద్ద జరిగిందని, మరో లేన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నందున ఇరువైపుల నుండి ట్రాఫిక్‌ను ఒకే లేన్‌కు మార్చామని చెప్పారు. గాయపడిన వారికి ఉత్తమ చికిత్స అందించాలని వైద్యులతో మాట్లాడానని, బాధిత కుటుంబాలకు గరిష్ట పరిహారం అందేలా చూస్తానని ఖేరీ డిఎం చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు నివారించడానికి చర్యలు తీసుకోవడానికి తాను ప్రమాద స్థలాన్ని సందర్శిస్తానని కూడా ఆమె చెప్పారు.

# స్వామి చైతన్యానంద అరెస్టు

● ఐదు రోజులు పోలీస్ రిమాండ్
● 17 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులు ● రూ.8 కోట్ల నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల స్తంభన● ఎన్నో మారుపేర్లు, నకిలీ విజిటింగ్ కార్డులు



**న్యూఢిల్లీ:** లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న ఆరోపణలపై ఢిల్లీకి చెందిన స్వామి చైతన్యానంద సరస్వతి (62)ని పోలీసులు అరెస్టు చేశారు. ప్రశ్నించి వివరాలు రాబట్టేందుకు వీలుగా ఐదు రోజులు ఆయనను రిమాండ్‌లో ఉంచాలని ఢిల్లీ కోర్టు డ్యూటీ మెజిస్ట్రేట్ రవి పోలీసులకు ఆదేశించారు. స్వామీజీకి సంబంధించి వివిధ బ్యాంకు అకౌంట్లలో ఉన్న రూ.8 కోట్ల నగదు, ఫిక్స్‌డ్ డిపాజిట్లను లావాదేవీలకు అవకాశం లేకుండా స్తంభింపజేశారు. తనకు తానుగా స్వామీజీగా ప్రకటించుకున్న చైతన్యానంద సరస్వతి గతంలో ఢిల్లీ నైరుతీ ప్రాంతంలో ఉన్న మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. రాత్రిపొద్దుపోయాక తన నివాసానికి రావాలని మహిళా విద్యార్థినులను బలవంతం చేసేవాడు. అర్ధరాత్రివేళల్లో అసభ్యకరమైన సందేశాలు ఫోన్‌ద్వారా పంపేవాడు. అనేక బ్యాంకు అకౌంట్లు నిర్వహించేందుకు వేరు వేరు పేర్లు ఉపయోగించినట్లు ఆయన విచారణలో వెల్లడించారు. ఆయనపై ఎఫ్ఐఆర్ దాఖలైన తర్వాత కూడా రూ.50 లక్షలు బ్యాంక్ అకౌంట్ నుండి విత్‌డ్రా చేశారు. ఐక్య రాజ్యసమితితో, బ్రిక్స్ ఫోరంతో సంబంధాలు ఉన్నట్లుగా పేర్కొనే నకిలీ విజిటింగ్ కార్డులను కూడా పోలీసులు ఆయన నుండి స్వాధీనం చేసుకున్నారు. 17 మంది విద్యార్థినులను స్వామీజీ లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ విద్యార్థినులందరూ ఢిల్లీలోని ఒక ప్రైవేటు విద్యాసంస్థలో చదువుకుంటున్నారు. వారందరూ ఆగ్రాలోని ఒక హోటల్‌లో ఉండగా ఆదివారం ఉదయం కనుగొన్నారు. స్వామీజీ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాధిత విద్యార్థినులందరూ ధృవీకరించారు. దీంతో పోలీసులు స్వామీజీని సాయంత్రం 3.40 గంటలకు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. అనేకమంది మహిళలను లైంగికంగా స్వామీజీ వేధించారని న్యాయమూర్తి ఎదుట ప్రాసిక్యూషన్ ఆరోపించింది. ఈ సందర్భంగా సాక్ష్యులు ఈ ఆరోపణలను ధృవీకరించారు. 'ఆయన బెదిరింపులకు గురిచేశారు, వారి అన్ని కదలికలను గమనించేందుకు సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేశారు. కొన్ని సిసిటివిలను బాత్‌రూములలో కూడా ఏర్పాటు చేశారు. దాదాపు 16 మంది బాలికలు ఈ ఫిర్యాదులు చేశారు, వీరంతా 16–20 మధ్య వయసుగలవారే. ఇంకా చాలా ఆరోపణలు ఆయనపై ఉన్నాయి, వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది'' అని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది ఢిల్లీకోర్టులో డ్యూటీ న్యాయమూర్తి ఎదుట తన వాదన వినిపించారు. ''మీరు ఇప్పటికే నా ఫోన్లు, ఒక ఐపాడ్, నా మొత్తం సామాను అంతటినీ కూడా స్వాధీనం చేసుకున్నారు, నేను మధుమేహవ్యాధిగ్రస్తుణ్ణి, ఉద్రేక పడితే సమస్యలు వస్తాయి, నా కాషా య దుస్తులను కూడా మీరు లాగేసుకున్నారు, కాషాయ దుస్తులు వేసుకోవడానికి మీరు నన్ను అనుమతించడం లేదు, వేధించడంకోసం మాత్రమే న న్ను పోలీసు కస్టడీలోకి తీసుకోవాలనుకుంటున్నా రు, ఒకవేళ మీరు అదే అనుకుంటే జ్యుడీషియల్ కస్టడీలోకి తీసుకోండి'' అని స్వామీజీ తరపున ఆ యన న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. బాధితులు చేసిన ఆరోపణలతో నిందితుడు విభేదిస్తున్నందువల్ల ఆయనను కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రాసిక్యూషన్ వాదించింది. ఐతే ప్రాసిక్యూషన్ బూటకపు ఆరోపణలు చేస్తోందని స్వామీజీ తరపు న్యాయవాది వాదించారు. ఫిర్యా దు చేయడానికి ధైర్యం చేస్తే తనను ఉండనివ్వరని ఒక సాక్షి చెప్పినట్లు ప్రాసిక్యూషన్ పేర్కొంది. అదేవిధంగా స్వామీజీపై మోసంచేశారన్న ఆరోపణపై మరో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు. ఈ కేసు లో ఆయనకు కోర్టు బెయిలు తిరస్కరించింది. నిం దితుడు దర్యాప్తుకు సహకరించడంలేదని, ఆయన ఐపాడ్ పాస్‌వర్డ్, ఐక్లౌడ్ పాస్‌వర్డ్ ఇవ్వడంలేదని న్యాయవాది కోర్టుకు తెలియజేశారు. స్వామీజీ త రపు న్యాయవాది కూడా కోర్టులో వాదనలు వినిపి స్తూ, స్వామీజీ వ్యక్తిత్వానికీ, ఈ కేసులో ఆయనపై చేసిన ఆరోపణలకు ఎలాంటి సంబంధం లేదని చాలా విరుద్ధమైన ఆరోపణలు ఆయనపై చేశారని అన్నారు. 40 సిసిటివి కెమెరాలలో ఉన్న డేటా వివరాలను పోలీసు కస్టడీలో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

# 'నేషనల్ లిటిగేషన్ పాలసీ' ఆలోచన విరమించుకున్న కేంద్రం

కోర్టు కేసులను తగ్గించే మార్గాలపై మంత్రిత్వ శాఖలకు ఆదేశాలు జారీ




న్యూఢిల్లీ : సంవత్సరాలతరబడి పనిచేస్తున్న నేషనల్ లిటిగేషన్ పాలసీ (ఎన్ఎల్‌పి)ని తీసుకురావాలనే ఆలోచనను ప్రభుత్వం పక్కనబెట్టింది.బదులుగా కొన్ని కేసులు తగ్గించే మార్గాలపై కేంద్ర మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌లు, పిఎస్‌యులకు ఆదేశాలు జారీచేసింది.అతి పెద్ద లిటిటెంట్ అనే ట్యాగ్‌ను తొలగించుకోవడానికి ప్రయత్నిస్తూ కేంద్ర ప్రభుత్వం దాని డిపార్ట్‌మెంట్‌లు, పిఎస్‌యులు పార్టీగా ఉన్న కేసులను తగ్గించడానికి ఒక సమగ్ర విధానాన్ని రూపొందించే పనిలో ఉంది. కానీ లోతుగా ఆలోచించిన తర్వాత కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ నేషనల్ లిటిగేషన్ పాలసీని తీసుకురావాలనే ప్రణాళికలను పూర్తిగా విరమించుకుంది. ఎందుకంటే ప్రభుత్వానికి లిటిగేషన్లను అరికట్టే పాలసీ లేదని, ప్రజలు కేసులు దాఖలు చేయకుండా ఆపలేరనే ఆలోచన ప్రబలంగా ఉంది. 'పాలసీ అనే పదం కేవలం ప్రభుత్వం దాని మంత్రిత్వశాఖలు, డిపార్ట్‌మెంట్‌లకు మాత్రమే వర్తిస్తే దానిని ఉపయోగించలేం. ప్రైవేట్ లిటిగేషన్లకు వర్తించకపోతే సార్వత్రికంగా వర్తించని దానిని పాలసీ అని చెప్పలేం. ప్రభుత్వ లిటిగేషన్లను అరికట్టడం అనేది చాలా అంతర్‌దృష్టితో చూసే చర్య' అని మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'పిటిఐ'కి చెప్పారు. ఆదేశం అనే పదానికి 'శక్తి భావన' కలిగిఉందని, 'మార్గదర్శకం' వంటి పదాలను నివారించామని అధికారి ఒకరు చెప్పారు. ఎందుకంటే అవి సాధారణ స్వభావం కలిగిఉంటాయని పాలసీని తీసుకురాకపోవడానికి మరో ముఖ్య కారణం.అంతేకాకుండా దానికి కేంద్ర కేబినెట్ ఆమోదంకూడా తప్పనిసరిగా ఉంటుంది. దానిలో ఏవైనా మార్పులు చేయాలంటే కేంద్ర కేబినెట్ ఆమోదం అవసరం అవుతుంది.న్యాయమంత్రిత్వ శాఖలోని లీగల్ వ్యవహారాల విభాగం 'భారత ప్రభుత్వం ద్వారా జారీచేసిన లిటిగేషన్లను సమర్థవంతంగానిర్వహించడానికి ఆదేశం' కార్యదర్శుల కమిటీ ద్వారా ఆమోదించబడింది. ఇది సాధించిన పురోగతి, అవసరమైన మార్పుల కోసం ప్రతీ ఏటా సమీక్షిస్తోంది. ఏప్రిల్‌లో జారీ చేసిన ఆదేశం ప్రకారం వివిధ నిర్ణయాలు, చర్యల లక్ష్యం ప్రజా శ్రేయస్సును, మెరుగైన పాలనను ప్రోత్సహించడం. కొన్నిసార్లు వాటి అసమర్థ పాలనకు దారితీయవచ్చు. ఉద్దేశించిన లబ్ధిదారులను లేదా ప్రయోజనం పొందుతున్న ఊహించని వారిని మినహాయించడం. కొన్ని సందర్భాలలో ప్రభావితపక్షాలు కొన్ని నిర్ణయాలను అన్యాయంగా భావించి లిటిగేషన్ల ద్వారా చట్టపరమైన సహాయం తీసుకోవచ్చు. కేంద్ర మంత్రిత్వ శాఖలు, డిపార్ట్‌మెంట్‌లు, పిఎస్‌యుల నిర్ణయాలను సమర్థవంతంగా అమలుచేయడం యొక్క ప్రాముఖ్యతను ఇది హైలెట్ చేస్తుం ది, అధికారిక డేటా ప్రకారం.. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న దాదాపు 7 లక్షల కేసుల్లో కేంద్ర ప్రభుత్వం ఒక పార్టీగా ఉంది. కోర్టుల్లో అనవసరమై న అప్పీళ్లను తగ్గించడం, కేసుల తగ్గింపునకు దారితీసే నోటిఫికేషన్లు, ఆదాయాలలో అసమానతలను పరిష్కరించడం మంత్రిత్వ శాఖ ప్రతిపాదించిన కీలక చర్యలుగా ఉన్నాయి. యుపిఎ2 ప్రభుత్వ హయాంలో అప్పటి న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ నేషనల్ లిటిగేషన్ పాలసీని రూపొందించారు. కానీ అది ఎప్పుడూ ముందుకు సాగలేదు. మొయిలీ ఈ విధానాన్ని రూపొందించినప్పటికీ ఆయన దానిని కేంద్ర మంత్రివర్గం ఆమోదం కోసం పంపలేదు. ఆ తర్వాత కొంతకాలానికి ఆ పత్రం క్యాబినెట్‌కు వెళ్లినప్పటికీ దానిపైన ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. అధికారిక ప్రకటన ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2010 జూన్ 23న నేషనల్ లిటిగేషన్ పాలసీని ఏర్పాటు చేసింది. నేషనల్ లీగల్ మిషన్ కింద భారతదేశంలోని వివిధ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులను తగ్గించడానికి కేంద్రం ఈ ఎన్ఎల్‌పిని రూపొందించింది. ఇది సగటు పెండింగ్ సమయాన్ని 15సంవత్సరాల నుండి 3 సంవత్సరాలకు తగ్గించింది.

# సాహితీ విహారి

## సాహితీ ప్రపంచాన్ని ఏకం చేస్తున్న 'అనువాదం'

ప్రపంచంలో ఎన్నో భాషలు.. ఎన్నో సాహితీ ప్రక్రియలు.. లక్షలాది రచనలు... ఒక భాషా సాహిత్యాన్ని మరో భాషా పాఠకులకు చేర్చే వారధే అనువాదం. సాహిత్యం మానవ అనుభవాల, భావోద్వేగాల, ఆలోచనల ప్రతిబింబం. అది ఒక భాష, ఒక సంస్కృతికి మాత్రమే పరిమితం కాకుండా విశ్వవ్యాప్తమైంది. ఈ విశ్వవ్యాప్తతను సాధ్యంచేసిన ప్ర ధాన వంతెన అనువాదం. అనువాద సాహిత్యం అనేది ఒక భాషలో రాసిన రచనను మరో భాషలోకి మార్చడం.... వివిధ సంస్కృతుల మధ్య సంభాషణ, ఆలోచనా మార్పిడి, అనుభవాల పంచుకోవడం. అనువాద సాహి త్యం ద్వారా ఒక భాషలోని ప్రతిభ, సాంస్కృతిక మూలాలు, జీవన విధానం ఇతర భాషాభిమానులకు అందుబాటులోకి వస్తాయి. విలియం షేక్స్‌పియర్ లేదా జాన్ కీట్స్... లియో టాల్‌స్టాయ్ లేదా వాల్ట్ విట్‌మన్.. ఇలా ఎంతో మంది ప్రముఖుల రచనలు తెలుగుతోసహా మన దేశంలోని దాదాపు అన్ని భాషల వారికీ పరిచయం అయ్యాయంటే, అందుకు కారణం అనుమాద సాహిత్యమే. దీని వల్ల మానవతా విలువలు, సామాజిక సమస్యలు, తాత్విక ఆలోచనలు ఒక సమాజానికే పరిమితం కాకుండా విశ్వవ్యాప్తం అవుతాయి. తమ లోతులు తెలుసుకోమంటాయి. గ్రీకు, లాటిన్, అరబిక్, సంస్కృత భాషల్లోని క్లాసిక్ రచనలు అనువాదం వల్లనే ఆధునిక ప్రపంచానికి చేరుకున్నాయి. చాలా మంది అనువాదాన్ని యాంత్రిక ప్రక్రియగా భావిస్తారు. కానీ వాస్తవానికి అది ఒక సృజనాత్మక శ్రమ. మూల రచనలోని భావం, కవిత్వం, లయ, శైలి లక్ష్యభాషలో కూడా పాఠకుడిని అలరించేలా మలచడానికి అనువాదకుడికి అపారమైన నైపుణ్యం ఉండాలి. పదాలను ఉన్నవి ఉన్నట్టు యాంత్రికంగా రాస్తే, అలాంటి అనువాదం మూల సాహిత్య భావాన్ని చంపేస్తుంది. కాబ ట్టి, మంచి అనువాదకుడు అర్థానువాదం, భావానువాదం రెండింటి మధ్య సమతౌల్యం పాటించాలి. అనువాదంలో ఇదొక్కటే సమస్య కాదు.. ఇంకా అనేక ప్రతిబంధకాలు ఉన్నాయి. ఎందుకంటే, ప్రతి భాషకు తన కంటూ ఒక శబ్దకోశం, నుడికారాలు, వ్యాకరణ శైలి ఉంటుంది. వీటిని లక్ష్యభాషలో ప్రతిబింబించడం కష్టతరం. ఒక భాషలోని సామెతలను లేదా జాతీయాలను మరో భాషలోకి తర్జుమా చేస్తే, అందులో భావం లేదా అర్థం కొరవడుతుంది. కాబట్టి, దానికి సరిపడే సమానార్థక నుడికారం ఆ భాషలో కనుగొనాలి. అంతేకాదు, మూలభాష సంస్కృతి, ఆచారాలు, చారిత్రక నేపథ్యం పాఠకుడికి పూర్తిగా తెలియకపోవచ్చు. ఈ లోటును భర్తీ చేయాల్సిన బాధ్యత కూడా అనువాదకుడిపైనే ఉంటుంది. సాంస్కృతిక విశేషాలను తు.చ తప్పకుండా అనువదిస్తే, విదేశీభావం చొచ్చుకొచ్చి, ఇతర భాషా పాఠకులకు కొంత వింతగానూ, మరికొంత సంక్లిష్టంగా నూ మారవచ్చు. అలాగని మారిస్తే, మూల సారం కోల్పోతుంది. అనువాదడుకు ఈ రెంటిమధ్య అత్యంత సున్నితమైన వ్యత్యాసాన్ని గుర్తించి, తగిన నిర్ణయం తీసుకోవాలి. అక్కడే అతని విజ్ఞత బయటపడుతుంది. రచయిత ఆలోచనలు.. భావనలను ఏ రకంగా ఆవిష్కరించాలి? స్వరాన్ని ఎంత వరకు కాపాడాలి? అనువాదకుడి వ్యక్తిగత దృక్ప థం ఎంతవరకు ప్రతిఫలించాలి? అనే ప్రశ్నలు శతాబ్దాలుగా చర్చనీయాంశాలుగానే ఉన్నాయి. అందరికీ ఆమోదయోగ్యమైన సమాధానాలు ఇప్పటి వరకూ రాలేదు. ఎవరి దృక్పథం వారిది.. ఎవరి ఆలోచన వారిది.. ఎవరి వాదన వారిది... 'సంపూర్ణత' ఎప్పటికీ అసాధ్యమే. అంతమాత్రాన అనువాద సాహిత్యాన్ని తేలిగ్గా చూడడానికి విల్లేదు. ఇది వివిధ దేశాల లేదా సమాజాల లేదా భాషల సాంస్కృతిక వేదిక. వివిధ ప్రాంతాల సాహిత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల పాఠకులకు చేరుస్తుంది. అ నువాద సాహిత్యం కారణంగానే ప్రతి భాషా సాహిత్యం ప్రపంచ సాహిత్య నిధిలో ఒక భాగం అవుతుంది. గుర్తిం పు సంపాదిస్తుంది. అనువాదాలే లేకపోతే, ఎన్నో ప్రపంచ మేటి రచనలు అనామకంగా ఉండిపోతాయి. అనువాద సాహిత్యం వల్ల వివిధ దేశాలు లేదా ప్రాంతాల సామాజిక, రాజకీయ చైతన్యంపై అవగాహన లభిస్తుంది. ఇతర దేశాల అనుభవాలు, పోరాటాలు తెలుసుకోవడం ద్వారా స్థానిక సమాజంలో కొత్త ఆలోచనలు ఉద్భవిస్తాయి. అనువాద సాహిత్యం వల్ల తాత్విక, శాస్త్రీయ, సాహిత్య సంబంధిత పాఠ్యాలు విద్యార్థులకు సులభంగా అందుబాటులోకి వస్తాయి. ఆధునిక గ్లోబలైజేషన్ యుగంలో అనువాద సా హిత్యం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. డిజిటల్ సాంకేతికత వల్ల యాంత్రిక అనువాదాలు పెరిగినా, సాహిత్యంలో మానవ అనువాదకుని సున్నితమైన స్పర్శ తప్పనిసరి. ఒక భాష, ఒక సంస్కృతి, ఒక సమాజం మా త్రమే కాకుండా మొత్తం మానవజాతి మనస్తత్వాన్ని ప్రతిబింబించే శక్తి సాహిత్యానికి ఉంది. ఈ విశ్వవ్యాప్తతను సాధ్యం చేసినది అనువాద సాహిత్యం. భాషల మధ్య, సంస్కృతుల మధ్య, సమాజాల మధ్య సేతు వహించే ప్రక్రియే అనువాదం. అనువాదం అనేది ఒక భాషలోని జీవన అనుభవాన్ని మరొక భాషలో తిరిగి పుట్టించడం అనే మాట యాదృచ్ఛికం కాదు. అనువాదం లేకపోతే ప్రపంచ సాహిత్యం ఎవరూ ఆస్వాదించని లేదా ఎవరికీ అర్థంకాని ఒక ప్రహేళికగా నిలిచిపోతుంది. మూల రచనలోని భావం, భాషా సౌందర్యం, శైలి, లయలను యథాతథంగా నిలుపుతూ కొత్త భాషలో అదే అనుభూతిని కలిగించడం అనువాద లక్ష్యం కావాలి. అప్పుడే అది పదికాలలపాటు నిలబడుతుంది. పాఠకులకు గొప్ప రచనను చదివామనే అనుభూతిని మిగిలిస్తుంది. కవిత్వం, కథలు, నవలలు, నాటకాతోపాటు, శాస్త్రీయ గ్రంథాలు, తాత్విక గ్రంథాలు, మతపరమైన పాఠ్యాలు కూడా అనువాద సాహిత్యంలో భాగమే. నిజానికి అనువాద ప్రక్రియ నిన్నమొన్నటిది కాదు. భాషలతోపాటు... వివిధ భాషా సాహిత్యంతోపాటు నిరంతరం వృద్ధి చెందుతునే ఉంది. ప్రాచీన కాలంలో గ్రీకు రచనలు అరబిక్‌లోకి, ఆపై లాటిన్‌లోకి అనువాదమయ్యాయి. వీటి ద్వారానే ఐరోపాలో పునరుజ్జీవన ఉద్యమం బలపడింది. భారతదేశం: సంస్కృతంలో ఉన్న వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలు ప్రాంతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. మధ్యయుగం విషయానికి వస్తే, ఇస్లామిక్ గోల్డెన్ ఏజ్‌లో గ్రీకు శాస్త్రం, తాత్విక గ్రంథాలను అరబిక్‌లోకి అనువదించారు. 19వ శతాబ్దంలో యూరోపియన్ సాహిత్యం భారతీయ భాషల్లోకి అనువాదమైంది. రష్యన్ సాహిత్యం, ఇంగ్లీష్ నవలలు, ఫ్రెంచ్ తాత్విక రచనలు భారతీయ పాఠకులను ప్రభావితం చేశాయి. అనువాదాన్ని కొంతమంది పదాల మార్పుగా పేర్కొంటారు. కానీ వాస్తవానికి అదో అద్భుత కళ. పదాలను యథాతథంగా మార్చడం కన్నా, భావాన్ని పాఠకుడికి చేరేలా చేయడం ముఖ్యమన్నది అనువాద సాహిత్య ప్రధాన సూత్రం. ప్రతి రచయితకు ఒక ప్రత్యేక శైలి ఉంటుంది. అనువాదకుడు దానిని గౌరవిస్తూ కొత్త భాషలో తిరిగి పునఃసృష్టించాలి. లయ, ఛందస్సు, యమకాలు మరో భాషలో అదే స్థాయిలో ప్రతిబింబించడం చాలా క్లిష్టం. అందుకే కవిత్వం అనువాదం లో నశిస్తుంది అని కొందరు విమర్శకులు అంటారు. ఈ విమర్శ లో నిజం లేకపోలేదు. కానీ, ఆ ఒక్క కారణంగా అనువాదాలు జరగకపోతే, అద్భుతమైన ఎన్నో రచనలు అనామకంగా మరుగునపడతాయి. అనువాదం అనేది కేవలం పదాల మార్పిడి కాదని, అది ఒక సంస్కృతిని మరో సంస్కృతిలో పునరావిష్కరించే సృజనాత్మక ప్రక్రియ అని తెలుసుకున్నప్పుడే, దాని విలువ అర్థమవుతుంది. అనువాద సాహిత్యం విశ్వ సాహిత్యానికి ఆధారమని గ్రహించగలుతారు.

**– సత్య శ్రీ**




సెప్టెంబర్ 30న అంతర్జాతీయ అనువాద దినోత్సవం

సాహితీ అనువాదం మూల రచనను నిశితంగా పరిశీలిస్తుంది. అందులోని సారాంశాన్ని ప్రతిబింబిస్తుంది. అయితే, ఈ ప్రక్రియలో భావ సౌందర్యం తగ్గుతుంది. ఇక స్వేచ్ఛానువాదం లేదా భావానువాదం సహజత్వానికి చాలా దగ్గరగా ఉంటుంది. కానీ, మూల రచనలోని శైలిని కోల్పోయే ప్రమాదం ఉంది. సాంస్కృతిక అనువాదం ఆయా రచనలను స్థానిక సంస్కృతికి అనుగుణంగా భావాన్ని మార్చి, పాఠకులకు చేరువ చేస్తుంది. సృజనాత్మక అనువాదం అనేది కేవలం పదాలను మరో భాషలోకి మార్చడం కాకుండా, దానిని పునర్నిర్మిస్తుంది. అనువాదకుడి సాహిత్య ప్రతిభ ఇక్కడ ప్రధాన పాత్ర పోషిస్తుంది. అయితే, ఆధునిక కాలంలో అనువాదం ఒక ప్రహసనంగా మారింది. కృత్రిమ మేధస్సు (ఎఐ) అందుబాటులోకి వచ్చి, వివిధ అనువాద టూల్స్ అందుబాటులోకి రావడంతో, భాషా సూత్రాలు ఆరిరవుతున్నాయి. పదబంధాలు సహజత్వాన్ని కోల్పోతున్నాయి. గూగుల్ ట్రాన్స్‌లేట్ వంటి సాంకేతికతను వాడడం వల్ల అనువాదం అత్యంత వేగంగా పూర్తవుతుంది. కానీ, సరైన అనువాదం కాకుండా, పదాల మార్పుతో, విచిత్రమైన వాక్యాల నిర్మాణాలు చదువరులను గందరగోళానికి గురి చేస్తాయి. చాలా సందర్భాల్లో అసలు విషయం ఏమిటో అర్థంగాక, పాఠకుడు తెల్లముఖం వేయాల్సి వస్తుంది. ఈ ఒరవడి నేపథ్యంలో, మంచి అనువాదాలు వెలువడినా వాటికి మార్కెట్‌లో తగిన ప్రాధాన్యం దొరకడం లేదు. అనువాదంలో మౌలిక హక్కుల సమస్యలు పెరగడం సమర్థులైన అనువాదకులను కూడా వెనుకడుగు వేయిస్తున్నది. విశ్వవిద్యాలయాలలో అనువాదాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేసే ప్రయత్నాలు పరిమితంగానే ఉండడం అనువాద సాహిత్యాన్ని వెక్కిరిస్తున్న మరో సమస్య. ఏదిఏమైనా, నిజమైన అనువాదం అనేదిక ఒక సంప్రదాయం. ఒక సహజసిద్ధమైన సాంస్కృతిక యాత్ర. సమకాలీన సవాళ్లు ఉన్నప్పటికీ, అనువాద సాహిత్యం భవిష్యత్తులో మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకోవడం ఖాయంగా కనిపిస్తున్నది.


> కొంత మంది విమర్శకులు అనువాదాన్ని 'ద్రోహం'గా పేర్కొంటారు. మూలభాష సౌందర్యం పూర్తిగా ప్రతిబింబించబడదనేది అభిప్రాయం. అయితే, మరికొందరు దీన్ని సృజనాత్మక పునరావిష్కరణ)గా చూస్తారు. ప్రతి అనువాదం కొత్త దృష్టికోణాన్ని తెస్తుందని వారి వాదన. నిజానికి ఈ రెండూ ఆలోచనలు లేదా పార్శ్వాలూ సరైనవే. ఒక రకంగా చెప్పాలంటే, ఈ రెంటి మేళవింపే అనువాద సాహిత్యం. అది మూల భావానికి ఎలాంటి నష్టం లేకుండా, కొత్త భాషలో, కొత్త జీవితాన్ని పొందుతుంది. ఆంగ్ల భాషలో 'Lost in Translation' అనే నానుడి బహుళ ప్రచారంలో ఉంది. పదాలు మారితే భావం తప్పిపోతుందనే అర్థంలో దీనిని వాడతారు. అయితే, ఒక భాషకు పరిమితమైన భావన మరొక భాషలో కొత్త జీవం పొందుతుందనడానికి ప్రతీకగా 'Gained in Translation' అనే అభిప్రాయం కూడా విస్తృత ప్రచారంలో ఉంది. ఇక్కడ కూడా రెండూ అభిప్రాయాలు, ఆయా కోణాల్లో సరైనవే. అయితే, భావాన్ని పాఠకుడికి అర్థమయ్యేలా మార్చడం. ఇది ఎక్కువగా విజయవంతమవుతుంది. రచయిత చెప్పదలచుకున్న విషయాన్ని పక్కదారి పట్టించడం లేదా తనకు నచ్చని కొన్ని అంశాలను వక్రీకరించడం అనువాద సాహిత్యం అనిపించుకోదు. అనువాదంలో అనువాదకుడి వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేదు. మూల రచయిత ఎంచుకున్న విషయాలను, అదే చిత్తశుద్ధితో ఇతర భాషా పాఠకులకు అందించడం అనువాదకుడి కర్తవ్యం. రచయిత స్వరాన్ని కాపాడుతూ అనువాదకుడు తన భాషలో సహజంగా అనిపించేలా ఎలా మార్చాలి అన్నది పెద్ద సవాలు. ఆ సవాలును స్వీకరించి న్యాయం చేయడంలోనే అనువాదకుడి సామర్థ్యం బహిర్గతమవుతుంది. అనువాదకుడు ఒక దూత. అతను రెండు భాషలకూ న్యాయం చేయాలి. మూల భావాన్ని వక్రీకరించకుండా పాఠకుల భాషలో సహజంగా వ్యక్తపరచాలి. సంస్కృతి ప్రత్యేకతలను వివరించాలి. రచనలోని కవిత్వం, రసాన్ని ఎంత మాత్రం తగ్గించకూడదు

## చదవాల్సిన పుస్తకం

### గోలకొండ పత్రిక అనువాద కథలు–3




గోలకొండ పత్రిక కథల సంకలనాలు రెండు ఉన్నాయి. పలువురు పేరుమోసిన రచయితల అద్భుత కథానికలు పాఠకులను ఆకట్టుకుంటాయి. ఈ రెండు తెలుగు కథల సంకలనాలుకాగా, మూడో సంకలనం అనువాద కథలు. సేకరణ, కూర్పు యామిజాల ఆనంద్, డాక్టర్ వివి వేంకటరమణ. 'అనువాదం అనేది ఒక కళ. అంతేకాదు, అది ఒక శాస్త్రం. ఇంకా చెప్పాలంటే అదొక కళాత్మక శాస్త్రం. శాస్త్రీయమైన కళ' అంటారు నిఘంటు నిర్మాత, ప్రముఖ సాహితీ విమర్శకుడు డాక్టర్ నలిమెల భాస్కర్ ఈ పుస్తకానికి రానిన ముందు మాటలో. ఇందులోని కథలను 'గోలకొండ తవ్వకాల్లో బయటపడ్డ పరభాషా రత్నాలు'గా కూర్పరుల మాటగా యామిజాల ఆనంద్, వెంకటరమణ అభివర్ణించారు. ప్రేమ్‌చంద్, సజ్జాద్ హైదర్ యల్దరమ్ వంటి ప్రముఖుల కలాల నుంచి జాలువారిన 26 కథలు ఈ పుస్తకంలో ఉన్నాయి. వీటిని సేకరించడానికి, ఒక పుస్తక రూపంలోకి తీసుకురావడానికి కూర్పరులు ఎంత కష్టపడ్డారో ఊహించుకోవచ్చు. వారు చెప్పినట్టు ఈ కథలు అక్షరాలా తవ్వకాల్లో బయటపడిన ఆణిముత్యాలే. ఇందులోని కొన్ని కథలను ఎవరు అనువదించారో కూడా తెలియరాలేదని వారు తమ మాటగా చెప్పుకొన్నారు. 1930, 1940 దశకాలకు చెందిన అనువాద కథలు కాబట్టి, నాటి పరిస్థితులు, భాష పరిమితులను బట్టి కొన్ని కథల్లో భాష ఉన్నప్పటికీ, ప్రతి కథా ఆకట్టుకుంటుంది. ఆలోచింప చేస్తుంది. అత్యాశకు పోయి, ఉన్నది కూడా పోగొట్టుకునేవాడు 'మూర్ఖుడు'గాక ఎవరుంటారు? న్యాయవాది మిస్ మోహిని వద్ద పనిచేస్తున్న సరళుడు ఆమె ఎవరితోనో సన్నిహితంగా ఉండడాన్ని చూసి, తానూ ఆమె పొందు కోరుకుంటాడు. ఆమె తిరస్కారానికి గురికావడమేకాదు... ఉద్యోగాన్ని కూడా పోగొట్టుకునే 'మూర్ఖుడు' సరళుడు.




హిందూ–ముస్లిం ఘర్షణలను, మారణహోమాన్ని కళ్లకు కడుతుంది అబ్బాస్ రచించిన 'ఇది మన నాగరికత'. నరసింహమూర్తి అనువాదం చేసిన ఈ కథలో, రచయితే కథకుడు. హిందు పేటలో రెండిళ్లను దగ్ధం చేయడం, ఎవరితోనూ మాట్లాడి కూడా ఎరుగని ఓ అమాయకుడి కుటుంబాన్ని హత్య చేయడం, తాను ఎంతో ఇష్టపడిన 'పుష్ప'ను కాపాడాలనుకున్నా, మిగతా వారు అంగీకరించకపోవడంతో మిన్నకుండడం ఈ కథలో ముఖ్యాంశాలు. ఈ మారణకాండను పూర్తి చేసుకొని ఇంటికి చేరుకున్నప్పుడు ముస్లిం పేటపై కొంత మంది హిందువులు దాడి, విధ్వంసం కనిపిస్తాయి. కథకుడు తన భార్యాపిల్లల్ని కోల్పోతాడు. మనసును హత్తుకునే కథనం, అద్భుతమైన అనువాదం ఈ కథకు ప్రాణం. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఈ పుస్తకంలోని ప్రతి కథా పాఠకుడిని ఆసాంతం చదివిస్తుంది. ఒక గొప్ప కథను చదివామనే అనుభూతిని కలిగిస్తుంది.


#### పుస్తకం పేరు

**గోలకొండ పత్రిక అనువాద కథలు–3**
**సేకరణ, కూర్పు: యామిజాల ఆనంద్, డాక్టర్ వివి వేంకటరమణ**
**వెల: రూ. 140**

ప్రతులకు


**నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).**

## 'ఆంగ్ల సాహిత్య పితామహుడు' చాసర్



జెఫ్రీ చాసర్‌ను 'ఆంగ్ల సాహిత్య పితామహుడు'గా పేర్కొంటారు. 14వ శతాబ్దంలో చాలా మంది లాటిన్ లేదా ఫ్రెంచ్ భాషలో రచనలు చేశారు. ఆ సమయంలో చాసర్ మాత్రం 'మిడిల్ ఇంగ్లిష్'లోనే రచనలు ప్రారంభించాడు. దాంతో ఆ భాష నిర్మాణం, సంపద, శబ్దసౌందర్యం ప్రసిద్ధి చెందింది. 'లండన్ డయాలెక్ట్'ను ఆయనే మెరుగుపరిచి, తర్వాత స్వయంగా ప్రామాణిక ఇంగ్లీష్‌గా అభివృద్ధి చెందడంలో ముఖ్య పాత్ర పోషించాడు. కవిత్వ నిర్మాణం విషయంలోనూ చాసర్ తనదైన అడుగు వేయగలిగాడు. ఆయనే మొదటిగా ఐయాంబిక పెంటమీటర్, రైమ్డ్ కప్లెట్లు వాడటం ద్వారా, శైలీకి కొత్త ఊపు ఇచ్చాడు. ఈ విధానాలను తర్వాత వాల్యూమ్ పెరిగినందునే కాకుండా, తర్వాతి శతాబ్దాల్లో శేక్స్‌పియర్, స్పెన్సర్, డ్రైడెన్ లాంటి మహనీయులు కూడా ఆచరిస్తూ వచ్చిన సందర్భాలు ఉన్నాయి. 'కాంటర్బరీ కాంటర్బరీ పాత్రలు సామాజ మార్గాలన్నింటినీ ప్రతిబింబించేవిగా ఉంటాయి. సాంప్రదాయాన్ని తల్లడిల్లకుండా, అన్ని వర్గాల ప్రజలు మాట్లాడే ప్రాకృత స్వరంలో కథలు చెప్పిన విధానం ద్వారా, వాస్తవికతకు ప్రాధాన్యతనిచ్చాడు. చాసర్ కథల్లో మానవ స్వభావం, ప్రేమ, నైతికత, లోభం, అవినీతి, ఆధ్యాత్మిక విశ్వాసం వంటి ఎన్నో పునాది అంశాలను ఉల్లేఖిస్తూ, వాటిని తాను మేళవించి, కాలాను కాలానికి అప్రమేయంగా తీర్చిదిద్దగలిగాడు. ఈమాటలు నేడు కూడా అచ్చంగా వర్తించగా ఉంటాయి. చాసర్ సాహిత్యంపై ప్రభావం చూపిన కవితా నిర్మాణానికి, నూతన ఆలోచనలకు ప్రేరణగా నిలిచాడు. తరువాతి తరాల సాహిత్యదిగ్గజాలు ఇంగ్లీష్‌లో తమ కవిత్వ శైలిని పునర్నిర్మించుకోవడానికి చాసర్‌కు ప్రేరణగా నిలుస్తాడు. ఆయన సేవలకు గౌరవార్థం వెస్ట్‌మినిస్టర్ అబ్బేలోని 'పోయెట్స్ కార్నర్'లో తొలి స్థానంలో అంత్యక్రియలు జరిపారు. ఆ తర్వాత అనేక ఇతర ఇంగ్లీష్ కవులు ఈ సంప్రదాయాన్ని కొనసాగించారు. ఒక్క మాటలో చెప్పాలంటే, చాసర్ ఇంగ్లీష్ భాషకు అసలైన స్వరాన్ని ఇచ్చాడు. ఆయన సృష్టించిన పాత్రలు, స్పృశించిన అంశాలు సమకాలీన సాహిత్యానికేగాక, భవిష్యత్తులోనూ మార్గదర్శకంగా నిలిచాయి. ఇంగ్లీష్ సాహిత్య మహోదయమైన దివ్య నవచేతనను మొదలుపెట్టిన చాసర్ దేనని అనడంలో తప్పులేదు. అందుకే అతను 'ఆంగ్ల సాహిత్య పితామహుడు'గా వెలుగొందుతున్నాడు.

## అరుదైన ఫొటో



కాలహారి ఎడారి ప్రాంతంలో నివాసం ఉండే ఓ గిరిజనుడితో ఫిలిప్పోలిస్ (దక్షిణాఫ్రికా)కు చెందిన ప్రఖ్యాత రచయిత లారెన్స్ వాన్ డెర్ పోస్ట్ (1906 డిసెంబర్ 13– 1996 డిసెంబర్ 15). నిజానికి లారెన్స్ కేవలం రచయిత మాత్రమేకా దు... ఒక రైతు.. ఒక సైనికుడు.. ఒక విద్యావేత్త.. ఒక జర్నలి స్టు.. ఒక మానవతావాది.. ఒక ప్రకృతి ప్రేమికుడు.. ఒక పరిశోధకుడు.. ఇలా చెప్తూపోతే, లారెన్స్ పేరు వినిపించని రంగం అంటూ ఉండదేమో! అంతటి ప్రతిభావంతుడిని సదరు గిరిజనుడు వింతగా చూడడాన్ని ఈ ఫొటోలో గమనించవచ్చు. తమ మధ్య జరిగిన సంభాణను లారెన్స్ ప్రపంచానికి తెలిపినప్పుడు, నాగరికత పేరుతో మనం ఏమి కోల్పోతున్నామన్నది స్పష్టమవుతుంది. 'మీరు ప్రకృతికి దగ్గరగా జీవిస్తున్నారా? మీరు నక్షత్రా లు మాట్లాడుకోవడాన్ని వినగలుగుతారా?' అని ఆ గిరిజనుడు లారెన్స్‌ను ప్రశ్నించాడు. తాను ప్రకృతితో మేమేకం కాలేదని సమాధానమిచ్చిన లారెన్స్, నక్షత్రాలు మాట్లాడుకోవడం ఏమిటని అడిగాడు. అతని సమాధానం విని ఆశ్చర్యపోవడం గిరిజనుడి వంతైంది. 'ప్రకృతి స్వరాన్ని వినలేకపోవడం ఏమిటి' అంటూ అతను లారెన్స్‌ను నిలదీశాడు. 'మనం ప్రకృతిలో భాగమైనప్పుడు... ప్రకృతితో కలిసిమెలిసి ఉండకుండా ఏం చేస్తున్నా రు?' అంటూ ప్రశ్నలు సంధించాడు. అతను కేవలం లారెన్స్‌ను మాత్రమేకాదు.. యావత్ మానవాళికి వేసిన ప్రశ్న ఇది. గమనించాలేగానీ, చెట్లు, పుట్టలు, కొండలు, గుట్టలు, నదులు, వా గులు, వంకలు.. ఇలా ప్రకృతిలో అన్నింటిలోనూ స్పందనలను చూడవచ్చు. అప్పుడు నక్షత్రాలు మాట్లాడుకుంటున్న దృశ్యం మన కళ్ల ముందు సాక్షాత్కారమవుతుంది. మనం అనాగరికులుగా పిలుస్తున్న వారే నిజమైన నాగరికులని, మనమే నిజమైన అనాగరికులమని అంటాడు లారెన్స్.

### ఈ వారం కవితలు

#### కవి కలం కన్నీరొలికింది..!

కవి కలం కన్నీరొలికింది..!
కవిలోని బాధ సిరా చుక్కలై
అక్షరాలు వాక్యాలుగా మారి
కవనాలుగా ఒలికిపోయాయి
కావ్యాలుగా ఒదిగిపోయాయి

కాల గతుల విగతులు
ఎత్తుకు పై ఎత్తుల జిత్తులు
కరకత్తులు చేసే కసరత్తులు
విపత్తుల్లోను గమ్మత్తులు
జిలుగుల వెలుగులై జిమ్మిక్కులు
లోకంలో అర్థం కాని ఉలుకలుకలు
సమాజానికెందుకో పకపకలు

కవి కలం గళం విప్పింది
అన్నింటినీ చూస్తూ రాస్తూ
కవి చేతి కలం కంపిస్తోంది
కవి కంట కన్నీరు కారుతోంది

పేదల కంట కన్నీటి చారలు
కర్షకుని వెంట కరువు ఛాయలు
ఎండిన ప్రకృతి వికృతి రూపాలు
విధి విధానాలకు ఎన్నో విపత్కాలు
చిత్ర విచిత్రపు కొలమానాలు
కడగళ్ళ కాలంలో పల్లె సీమలు
ధన దర్పంతో ధనస్వామ్యాలు
విపరీత వైపరిత్యపు ఆకర్షణలు

విభిన్న దారుల్లో రాజకీయాలు
స్వార్థపు ఇకిలింపుల ధోరణీలు
మోసపూరిత మోహరింపులు
వీటన్నింటినీ కలుపుకుపోతూ
మెరుపుల కాగితం పైన మెల్లగా
అక్షరాలుగా మలచడానికి
కవి కంట కన్నీరు ధారలైంది
కవి చేతి కలం విలపించింది
నీతి సంరక్షణకే శిక్షలు
వినూత్న జ్ఞానంతో పైపై జిగేలు
ఉరుకు పరుగుల దినసరులు
ఊహకందని ఉత్కంఠాలు
నవ్వుల్లోను పగ పొగల సెగలు

మాటల తీరులో ఇంద్రజాలాలు
నడతల్లో కనివిని ఎరుగని నటనలు
అన్నింటినీ కవనాలుగా తీర్చలేక
కవి కంట కన్నీరొలికింది
కవి చేతి కలం గళం విప్పింది

**– రాజారెడ్డి**

#### విశ్వనరుడు

'వడగాల్పు నా జీవితమైతే
వెన్నెల నా కవిత్వమంటూ' ప్రకటించి,
కవిత్వాన్నే ఆయుధంగా మలచుకొని,
దాని కేంద్రబిందువుగా స్త్రీని చేసుకొని,
వారి మూకీ భాష్పాలకు నోరిచ్చి,
రచ్చకెక్కించి, ఖడ్గాలుగా మార్చి
మూఢాచారాలపై తిరగబడి,
కవిత్వానికి ఒక తత్వముండాలి,
దానికొక అర్థముండాలంటూ

కావ్యశిల్పం కన్నా అభిప్రాయ ప్రకటననే పరమావధిగా చేసుకొని,
సంఘ సంస్కరణ కావ్య లక్షణంగా,
మానవత్వం, హేతువాద, కరుణరసాలు
కవితావస్తువులుగా కలిగి,
సామాజిక ప్రయోజనం ఆశించి
తన ఆవేదనల్ని, అనుభవసంవేదనల్ని
కవిత్వంగా రంగరించిన
సహనశీలి, శాంతమూర్తి,
మధుర శ్రీనాథ 'జాషువా' కవితామాధుర్యం
ఆస్వాదించాలంటే,

ఆ మందాకినిలో మునకలేయాల్సిందే, అనుభవించాల్సిందే. పేదరికం,కులమతభేదాల్ని గురువులుగా, సౌర్యం, స్థైర్యం, ఆత్మాభిమానం
సొత్తులుగా కలిగి,
ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలొంది
సాహితీ అపరబ్రహ్మగా పేరొంది,
ఆచరణలో నాస్తికుడుగా దృగ్గోచరమైనా
కావ్య రచనలో ఆస్తికుడుగా దర్శనమిచ్చి,
పరిణామదశలో 'విశ్వనరుడైన'
'గుర్రం జాషువా'ఎందరో కవులకు
'దివిటీ' 'బావుటా'.

**– బక్కారెడ్డి పటోళ్ల**

#### సంబరాలు

మది జల్లనే మధురభావనలు ఇచ్చి
మనసును మైమరపించే,
మధురానుభూతుల ఆశీస్సులందించే,
సకలజనావళి రాదారుల్లో
వెన్నెల పూలు పరిచే, దుష్ట శిక్షణకు,శిష్టరక్షణకు ప్రతీక అయిన
మనదైన గొప్ప భారతీయ సంస
కృతీ,సంప్రదాయాల పరంపర
'దసరా' రానే వచ్చింది.

బంధాలు,అనుబంధాలు
ఆత్మీయతా వల్లరుల సౌభాగ్యాలు
ఇవి కదా మానవాళి ఆద్యంతాలు తెలియని
మహిమాన్వితమైన కాలగమనంలో
నిత్యం నెమరేసుకోవాల్సిన మాధుర్యాలు.వాటి కోసమేగా
పండుగల పేరుతో ఈ సంబరాలు.

**– వేమూరి శ్రీనివాస్**

#### నిండని సముద్రం

ఇది కనిపించని సముద్రం
ఇది పరికించిన తలపించును
సముద్రమని ! సముద్రంలో ఉన్నట్లే
వాయుగుండాలు ఉప్పెనలు
ఆకలి అలల ఆటుపోట్లుంటాయి
చంద్రుని ఆకర్షణ వలన కాదు
కనిపించే ఆకర్షణల వలన
బడబాగ్నులను మించిన
రగిలే జఠర,తుష్ణాగ్నులుంటాయి!
ఈ సముద్రం ఎంత నింపినా
ఎప్పుడు ఖాళీ ఖాళీయే !
ఈ సముద్రంలో మునుగుడే
తేలుడు ఉండదు!
ఇదో వింత సముద్రం !
ఇది మహా సముద్రాలను మించిన
తీరని ఆకలి,ఆశల కుక్షి
ఇది నిండని సముద్రం !

**– పిబిఆర్**

# ఆకాశానంటిన గునుగు పువ్వు రేటు

**ప్రజాపక్షం/ ములుగు :** తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్దదైన బతుకమ్మ పండుగ సందర్భంగా గత వారం రోజులుగా వర్షం పడటం వల్ల ఏ పువ్వు దొరకకుండా వుంది ఇన్ని వర్షాలు పడినప్పటికి కొంతమంది గ్రామస్తులు మారుమూల ప్రాంతం నుండి గునుగు పువ్వు తంగేడు పువ్వు బంతి పువ్వులు ఈ పువ్వులు రేటు ఆకాశాన్నింటీనప్పటీకీ తెలంగాణ రాష్ట్రం లో అతి పెద్దదైనా బతుకమ్మ పండుగ విజయవంతం చేయాలని మహిళలు సంతోషంగా ఎంత రేటైనా సరే బతుకమ్మ సంబరాలు జరగలని మహిళలు అతి ఉత్సహంగా పువ్వులు కోంటున్నారు కానీ పూలు అమ్మేవారు ఇదే అస రగా చూసి ఇష్టం వచ్చిన రేట్లకు అమ్ముతూ మహిళలను నిరుత్సాహ పడేలా అమ్ముతున్నారు అయినప్పటికీ నిరు పేదలైన మహిళలు కూడా ఎక్కువ మెత్తంలో కొని పువ్వులు కొద్దివరకు కొని బతుకమ్మ పండుగ సంబరాల్లో ఉండాలని ఉత్సహంగా పువ్వులనుకొంటున్నారు.

# నేటి నుండి అక్టోబర్ 4వ వరకు మార్కెట్‌కు సెలవు

**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 29 నుండి అక్టోబర్ 04వ తేది వరకు సెలవు ప్రకటించడం జరిగింది, తిరిగి అక్టోబర్ 05నుండి తిరిగి వ్యవసాయ మార్కెట్ యధావిధిగా కొనసాగుతుందని వ్యవసాయ మార్కెట్ కమిట చైర్మన్ పాలాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29న సద్దుల బతుకమ్మ, 30న మంగళవారం వారాంతపు సెలవు, అక్టోబర్ 01న మహార్ నవమి, 02న దసరా,గాంధీ జయంతి, 03.10.2025 దసరా మరుసటి రోజు, అర్థి వ్యాపారుల కోరిక మేరకు 04 సెలవులను ప్రకటించడం జరిగిందన్నారు. వరుసగాఆరు రోజులసెలవులు ఉన్నాయని, తిరిగి ఈనెల05న వ్యవసాయ మార్కెట్ పునఃప్రారంభం కావడం జరుగుతుందని కావున రైతు సోదరులు గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను బంద్ రోజులలో కాకుండా మార్కెట్ నడిచే రోజులలో మార్కెట్ నకు తరలించాలన్నారు.

## పండగ రోజు సైతం తప్పని యూరియా తిప్పలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** పండగ వాతావరణంలో సైతం యూరియా కోసం తెల్లవారు జామునే వచ్చి క్యూలైన్ల నిలబడి మనోవేదనకు గురికావాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు యూరియా కోసం ఉదయం నుండి బారులు తీరిన విషయం తెలుసుకున్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి తెలుసుకొని పిఎసిఎస్ చైర్మన్ మేకల సంపత్ తో మాట్లాడి కొరతకు కారణం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, జంగేడు పిఎసిఎస్ సెంటర్లో 500 వందల బస్తాల యూరి యా వస్తే రైతులు 1000 మందికి పైగా ఇక్కడ వేచియున్నారన్నారని అన్నారు. క్లస్టర్ల వారిగా యూరియా సరఫరా చేయాలని సూచించారు. ప్రతి రోజు ఇదే పరిస్థితి ఉందని రైతులు బాధపడుతున్నారని తెలిపారు. వరి పండిస్తున్న వారి వివరాల ప్రకారం యూరియా ఆయా రైతులకు నేరుగా ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించారు. అవగాహన రాహిత్యంతో సరిపోయేంత స్టాక్ ఉన్న ప్రభుత్వాన్నికి దూరదృష్టి లేకపోవడంతో సరైన సమయంలో యూరియా తెప్పించకపోవడం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యారని అన్నారు. ఇప్పటికే సీజన్ సమయం ముగుస్తున్న తరుణంలో అందరికీ ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, మాజీ మున్సిపల్ మాజీ చైర్మన్ వెంకటరాణి సిద్దు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ తల్లి ఆశీస్సులు అందరిపైనా ఉండాలి: ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/రాయపర్తి:** దుర్గమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం రాయపర్తిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఏర్పాటుచేసిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారిని భర్త రాజారామ్మోహన్ రెడ్డితో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో పాటు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. దేవిశరన్నవరాత్రి ఉత్సవలను ప్రతీ ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మునావత్ హమ్యానాయక్, టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్‌రెడ్డి, వర్ధన్నపేట మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మెర కల్యాణ్, పాల్వంచ కోటేశ్వర్, కుంట రమేశ్, గారె బిక్షపతి, మచ్చ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల వెంట కుప్పలుగా ఉల్లిగడ్డల వ్యర్థాలు



**ప్రజాపక్షం/రాయపర్తి:** మండల కేంద్రంలోని వరంగల్..ఖమ్మం జాతీయ రహదారికి ఇరువైపులా ఉల్లిగడ్డల వ్యాపారులు ఉల్లిగడ్డల వ్యర్థాలను బస్తాల్లో కుప్పలు కుప్పలుగా పడవేస్తున్నారు. దీంతో వాటి కోసం వస్తున్న కోతులు పంట పొలాల్లోకి లాక్కెళ్లి తమ పంటను నాశం చేశాని రైతు ఫిరోజ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఎప్పటికైనా అధికారులు స్పందించి ఉల్లి గడ్డల వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## భారీ వర్షానికి కూలిన ఇల్లు.. ప్రభుత్వం ఆదుకోవాలన్న బాధిత కుటుంబం



**ప్రజాపక్షం/సంగెం** గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం రోజున సంగెం మండల పరిధిలోని నర్సనగర్ గ్రామంలోని జాటోత్ తండాకు చెందిన జాటోత్ బూలి భర్త శంకర్ నాయక్‌కి చెందిన ఇల్లు వర్షం ధాటికి కూలిపోయింది. వర్షం కారణంగా ఇల్లు కురవడంతో మరో ఇంట్లో ఆ కుటుంబం తల దాచుకుంటున్నారు. దీంతో ఇల్లు కూలడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా బాధితుడు శంకర్ నాయక్ మాట్లాడుతూ.. నా ఇల్లు పాతది కావడంతో వర్షానికి నీరు ఇంట్లోకి వస్తుంది. అందులో ఉండేందుకు వీలులేక మరో ఇంట్లో తల దాచుకున్నాను. నేడు పడ్డ భారీ వర్షానికి నా ఇల్లు కూలిపోయింది. నా ఆర్థిక పరిస్థితి బాగోలేదు,నాకు ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సహాయం అందించాలి అని కోరారు.

# ‘స్థానిక’ ఎన్నికల్లో సిపిఐ గెలుపునకు కృషి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ సమితి సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటీవల చండీగఢ్ లో జరిగిన సీపీఐ 25వ జాతీయ మహాసభలలో మూడవ సారి జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలలో పార్టీ అభ్యర్థులను పోటీ చేయించి వారి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. త్యాగాలకు, పోరాటాలకు నిలయం కమ్యూనిస్టు పార్టీ అని, అందుకే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉందన్నారు. ఎన్నికలు ధన ప్రవాహంగా మారిపోయినా, మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్నా వాటికి ఎదురొడ్డి సీపీఐ నిలబడిందన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం నుండి సెక్యులర్, సోషలిజం పదాలను తొలగిస్తూ ఈసీ, సీబీఐ లాంటి సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకుని ప్రశ్నించే వారిని అణిచివేసే చర్యలు చేపడుతున్నదని అన్నారు.మనువాద భావజాలాన్ని ప్రజలపై రుద్దుతున్న బీజేపీని తరిమికొట్టేందుకు అందరం కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్పరేట్ వర్గాల కోసమే పనిచేస్తున్న దని అన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడించి లౌకిక, ప్రజాతంత్ర శక్తుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మ ణ్, ఉట్కూరి రాములు, మునిగాల బిక్షపతి, బత్తుల సదానందం, ఎదునూరి వెంకట్రాజం,నేదునూరి రాజమౌళి, యేషబోయిన శ్రీనివాస్, కొట్టెపాక రవి, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, డాక్టర్ పల్లేరు వీరస్వామి, బాషబోయిన సంతోష్, మాలోతు శంకర్ నాయక్,మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, నిమ్మల మనోహర్, యాళ్ల సంజయ్, అలువాల రాజు, గోకల రాజయ్య,బొజ్జు జ్యోతి, సునీల్ పాల్గొన్నారు.

## రేబీస్ వ్యాధి వ్యాక్సిన్ ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ పర్యవేక్షణలో బాలసముద్రంలోని పెట్ పార్క్ లో డాగ్స్ బ్రీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ రేబిస్ దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొని రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రజలలో పశు ప్రేమ, పశు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించాలన్న ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధులపై ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడం ద్వారా తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు,అధికారులు,అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## పదోన్నతులతో పాటు బాధ్యతలూ పెరుగుతాయి: సిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన యం. సాంబ రెడ్డి, పి. జైపాల్, పి. లక్ష్మి రెడ్డి, డి. వెంకటేశ్వర్లు, యం. సాంబయ్య, కె. వెంకన్న, డి. సమ్మిరెడ్డి, యం. లక్ష్మి నారాయణ, పి. శ్రీనివాస్ రాజు, ఎస్. సదయ్య లు అదివారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ సందర్భంగా కు పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలియజేసారు అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు పోలీసుల పట్ల భరోసా నమ్మకాన్ని కలిగించడంతో పాటు, నిరుపేద ప్రజలకు పోలీస్ అధికారులు అండగా నిలవాలని ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పదోన్నతి పొందిన ఎస్ఐలకు సూచించారు.

# ‘ప్రజల మనిషి’ పుసులూరు రంగయ్య

### సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) బయ్యారం మండలం మాజీ కార్యదర్శి పుసులూరి రంగయ్య ప్రజల మనిషని, ఆయన సేవలు మురువలేనివని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి కొనియాడారు. రంగయ్య అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందడంతో ఆయన భౌతిక కాయానికి నివిళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొని పాడిమోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బయ్యారం ఉక్కు పరిశ్రమ స్థాపనకు అనేక పోరాటాల్లో పాలుపంచుకుని ముందుకు వెళ్ళిన నాయకుడు రంగయ్య అని అన్నారు. బయ్యారం మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడే వారన్నారు. కార్మికుల ఉద్యోగస్తుల ప్రజల పేదల పక్షాన నిలబడి బయ్యారం మండలంంఓ తనదైన చెరగని ముద్ర వేశాడన్నారు. అనునిత్యం పేదల పక్షాన పోరాటాలు సల్పిన వ్యక్తి అని పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ప్రారంభించాలని అనేక కార్యక్రమాలు నిర్వహించి పోరాడాడన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతామని విజయసారథి అన్నారు. రంగయ్య అంతిమయాత్రలో ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టబోయిన శ్రీనివాస్, కె.సారయ్య, చిన్న చంద్రన్న, జగ్గన్న, నాగయ్య, సారిక శ్రీను, జంపాల వెంకన్న, నాదెండ్ల పద్మ, పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబ లక్ష్మి, నెల్లూరి నాగేశ్వరావు, కర్ణం రాజన్న, తండా సందీప్, తురక రమేష్, కళింగరెడ్డి, రాజు, శ్రీను, సూర్యం, రమేష్, బిక్షం పాల్గొన్నారు.

# పువ్వులను దేవతలుగా పూజించే గొప్ప పండుగ బతుకమ్మ

### లెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో తీరక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను తీసుకొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు అత్యంత వేడుకగా మహిళల ఆటపాటలతో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఐఏఎస్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఆర్ఓ వైవి గణేష్ ,జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు హాజరైనారు.జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ దేవీ నవరాత్రుల్లో భాగంగా మహిళలను శక్తి రూపంగా పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదని, పువ్వులని దేవుళ్ళుగా పూజించే పండుగ ప్రపంచంలో ఒక బతుకమ్మ పండుగ మాత్రమే అని పేర్కొన్నారు. జిల్లాలోని మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ పండుగ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషాన్ని ఇస్తున్నదని పేర్కొన్నారు. గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆకవరపు శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే పండుగ బతుకమ్మ అని పేర్కొంటూ హనుమకొండ జిల్లా కలెక్టరేట్లో ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలను జరపడం ఆనవాయితీగా వస్తున్నదని బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉద్యోగినులకు వారి కుటుంబ సభ్యులకు జిల్లా అధికారులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాస్య నాయక్, జిల్లా ఉద్యోగ సంఘాల నేతలు బైరీ సోమయ్య, డాక్టర్ ప్రవీణ్, పుల్లూరు వేణుగోపాల్, పనికెల రాజేష్, శ్యామ్ సుందర్, మాధవ రెడ్డి, వాసం శ్రీనివాస్, రాజ్యలక్ష్మి, బోనాల మాధవి, మల్లారం అరుణ, పావని, జ్యోత్స్న, రజిత, సరస్వతి, శ్రీలత, రాజమణి, యమున, ఇందిరా ప్రియ దర్శిని, విజయ ల, కత్తి రమేష్, రాము నాయక్, లక్ష్మి ప్రసాద్,రాజీవ్, అనూప్ , ప్రణయ్, పృథ్వి, నిఖిల్ , అనిల్ రెడ్డి,రాజమణి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్గూర్ రంగంపేట్ రహదారి గుంతల మయం

### ప్రజలు ఆగ్రహం



**ప్రజాపక్షం/సంగెం:** మండలంలోని ఎల్గూర్ రంగంపేట్ గ్రామంలోని బొడ్రాయి సెంటర్ నుండి పెద్దమ్మ గుడి వరకు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయమై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. వర్షాకాలం కారణంగా గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రహదారి పూర్తిగా చెదిరిపోయి, ప్రజల కష్టాలు మరింత ఎక్కువయ్యాయి.ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు ఈ మార్గాన్ని ప్రక్క గ్రామాల ప్రజలు కూడా తరచుగా వినియోగిస్తున్నారు. అయితే గుంతల లోతు అర్థం కాక బైక్‌పై వెళుతున్న వారు పలుమార్లు ప్రమాదాలకు గురవుతున్నట్లు గ్రామస్థులు వెల్లడించారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రోజూ ఈ దారిన ప్రయాణించాల్సి రావడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల వేదన గ్రామ ప్రజలు పెద్దగోని వేణు, రావుల స్వరూప, బోనాల పద్మలు మాట్లాడుతూ ఈ రహదారి పరిస్థితి దయనీయంగా మారింది. పిల్లలు స్కూల్‌కి వెళ్లడమే కష్టమైంది. వృద్ధులు, రోగులు, గర్భిణీలు ఆసుపత్రులకు చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం విచారకరం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై నిలదీస్తూ ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రతి ఎన్నికల సమయంలో రహదారి పనులు చేస్తామని హామీలు ఇస్తున్నారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడితే బాధ్యత ఎవరిది? ఇకపై కాలయాపన వద్దు. వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టి, శాశ్వతంగా కొత్త రహదారి నిర్మించాలి అని డిమాండ్ చేశారు.

**అధికారులు స్పందించాలంటూ డిమాండ్**

గ్రామస్థులు తమ సమస్యలను పలుమార్లు తెలియజేసినా స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆగ్రహం మరింత పెరిగేలోపు అధికారులు ప్రత్యక్షంగా వచ్చి పరిస్థితిని గమనించి, తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే గండ్ర



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ప్రజలందరికీ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి మీడియాకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. గ్రామాలల్లో నిండిన చెరువులు, పచ్చని పంట పొలాల పక్కన ప్రకృతితో మమేకమై, తొమ్మిది రోజుల పాటు సాగిన ఆడబిడ్డల ఆటాపాటలతో పల్లెలు, పట్టణాలు ప్రత్యేక సాంస్కృతిక వాతావరణాన్ని సంతరించుకున్నాయన్నారు. ఈ సందర్భంగా విజయాలను అందించే విజయదశమిని స్వాగతిస్తూ, తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన పనులు పూర్తయ్యాయని ఎమ్మెల్యే ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లేలా, ప్రజలంతా సుఖశాంతులతో జీవించి, దినదినాభివృద్ధి పొందేలా దీవించాలని అమ్మవారిని ఎమ్మెల్యే ప్రార్థించారు.

# సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాట్లు

### ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్ పూర్ కల్లు మండవ జంక్షన్ వద్ద సొంత నిధులతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటు కోసం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ “ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారు తెలంగాణ గర్వకారణమైన వ్యక్తి అని, పాపన్న గౌడ్ సామాజిక న్యాయం, స్వాభిమానం, సమానత్వం కోసం పోరాడిన గొప్ప యోధుడు. ఆయన అడుగుజాడల్లో నడిచి మన సమాజాన్ని ముందుకు తీసుకెళ్లడం మనందరి బాధ్యత అన్నారు. గోపాల్ పూర్ కల్లుమండవ జంక్షన్ వద్ద ఏర్పాటు చేస్తున్న ఈ విగ్రహం తరతరాలకు ప్రేరణగా నిలుస్తుందని, యువతరం ఆయన ఆలోచనలతో ముందుకు సాగితేనే నిజమైన గౌరవం చూపినట్టవుతుందన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు ఈ విగ్రహ నిర్మాణం చేపడుతున్నాము. విగ్రహం చుట్టుపక్కల అందమైన పార్క్, సౌకర్యాలతో కలిపి అభివృద్ధి చేస్తాం. పాపన్న గౌడ్ స్ఫూర్తితో సమాజంలో సమానత్వం, ఐక్యత, సాహసస్ఫూర్తి పెంపొందేలా కృషి చేస్తాం” అని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు సేవ చేయడం, సామాజిక న్యాయం కోసం నిలబడడం అనే పాపన్న మార్గంలోనే మనం నడవాలి. ఈ విగ్రహం మనకు ఎప్పటికీ స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి అడుగులోను ప్రజలతో పాటు ఉంటాను” అని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్స్ సిరంగి సునీల్, హరిబాబు, శివరాం ప్రసాద్, యాదగిరి, రమేష్, అనిత గౌడ్, సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** అంగరంగ వైభవంగా దుర్గామాత నవరాత్రి వేడుకలను పురస్కరించుకోని పట్టణంలోని ఘనంగా నిర్వహించారు. ఆరవ రోజు మహాచండి దేవి అలంకరణలో పోచమ్మ తల్లి ఆలయంలో ఏర్పాటుచేసిన దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాత అమ్మవారిని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మాట్లాడుతూ దుర్గామాత తల్లి ఆశీస్సులతో నర్సంపేట నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండేవిధంగా తల్లి ఆశీస్సులు ఉండాలని కోరారు. మహాచండి దేవి అలంకరణలో భక్తిశ్రద్ధలతో నిర్దిష్టమైన ప్రత్యేక పూజలు నిర్వహించారు, వార్డులోని మహిళలందరి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో వార్డులోని దేవండ్ల మౌనికరాంబాబు, కొలువుల వెంకటేశ్వర్లుపద్మ, ఆరేపల్లి వైడూర్యంబాబు, బోళ్ల సుమలత అశోక్, చెన్నారపు నీరజమహేందర్, తవటం వెన్నెలనిశాంత్, ఆరెపెల్లి అంజలిపృధ్వి, కోళ్ల పద్మ సంపత్, గద్దె శ్రీనివాస్‌కోటేశ్వరి, హనుమకొండ సంజీవమరియా, వలస ఆదినారాయణకవిత, వలస శారద సత్యం, లక్క శ్రీకాంత్ మౌనిక, మామిడాల అనూష, మిడిదొడ్డి రాధ బిక్షపతి, గొడిశాల లత కాంతయ్య, రాళ్ల బండి రాజేందర్‌త్రివేణి, రాళ్లబండి సరోజ, దేవండ్ల అంజమ్మ అశోక్, వంగాల కరుణ గోవర్ధన్ రెడ్డి, కోరే సునీతరమేష్, ఆవుల విజయ, లక్క శ్రీలత రాజు తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల ఖరారుతో కాంగ్రెస్‌లో పెరుగుతున్న పోటీ

**ప్రజాపక్షం/వైరా:** స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు వేసవ్యంలో వైరా మండలంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్పిటిసిగా పోటీ చేసేందుకు ఆశా వాహులు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీలో పోటీ చేసేందుకు పెద్ద ఎత్తున పోటీపడుతున్నారు. సర్పంచ్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నేతలకు పోటీపడే కాంగ్రెస్ నేతలతో పెద్ద ఇబ్బందే కలగవచ్చునని చెప్పవచ్చును. ఇప్పటికే పలువురు నేతలు పోటీ చేసేందుకు ఆసక్తితో ఉన్నవారు పోటీ చేసేందుకు ముందుకు రావడంతో గ్రామాల్లో కాంగ్రెస్ మధ్యనే అధికార వర్గపోరు పెద్దదే ప్రమాదం పొంచి ఉంది. మండలంలో 22 గ్రామపంచాయతీల సర్పంచ్ ఎన్నికలు ఎంపిటిసి ఎన్నికలు జెడ్పిటిసి ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నేతల్లో రిజర్వేషన్ల నియామకం తర్వాత గ్రూపు రాజకీయాలు ఊపందుకున్నాయి. పార్టీ ఏదైనా గెలిచి తీర్పాల్సిందనే వాదన వారిలో బలంగా నాటుకు పోతూ ఉంది.

## అన్నదానం అభినందనీయం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** అన్నిదానాల్లోకెల్లా అన్నదానం ఎంతోగొప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. భక్తిశ్రద్ధలతో దుర్గామాతలను ఏర్పాటు చేసుకొని అన్నదానం చేయడం అభినందనీయమ అన్నారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. అలాగే ఏదులాపురం, వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని డిసిసి బంక్ బ్యాక్‌సైడ్‌లోని దుర్గామాతల మండపాల వద్ద ఆయా కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఓరుగంటి శేషగిరి, మామిడి శంకర్‌రెడ్డి, పేరాల నరేందర్, ఎం నాగరాజు, దుర్గారావు, యుగేందర్, వినయ్ రెడ్డి, పొన్నం ఉమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో గల కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవకు ఆదర్శం తులసీదాస్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు తులసి దాస్ ఆదర్శంగా నిలిచారని ఎస్‌జిపిటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, విశ్రాంత పోలీస్ సంఘం నాయకులు వెంకట నారాయణ లు తెలిపారు. ఆదివారం కృషి భవన్‌లో పోలీస్ శాఖలో విశ్రాంత అడ్మినిస్ట్రేషన్ అధికారి జి. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జెట్టి శ్రీకృష్ణ తులసిదాస్ అభినందన సభ కార్యక్రమం జరిగింది. సామాజిక, ఆధ్యాత్మిక రంగంలో తులసిదాస్ చేసిన సేవలు ఎనలేనివన్నారు. తులసిదాస్ సేవలను గుర్తించి ఇటీవల కీర్తిచక్ర పురస్కారంతో సన్మానించారని పోలీస్ అధికారుల సంఘం నాయకులు వెంకటనారాయణ తెలిపారు. ఎస్‌జిపిటి జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, విశ్రాంత పోలీస్ అధికారులు రాంప్రసాద్‌రావు, జనార్ధన్, చలపతిరావు, అక్షరప్రసాదరావు, వెంకటనర్సయ్య, బెల్లం రాధాకృష్ణ, కోట్యా, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అజ్ఞానాన్ని తొలగించుకోవడమే దైవత్వం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అజ్ఞానాన్ని తొలగించుకుని అన్యాయంపై పోరాడటమే దైవత్వమని పల్లె ప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. ఆదివారం బోనకల్ సిపిఎం కార్యాలయంలో జరిగిన స్టడీ సర్కిల్‌లో ఎవరు దేవుడు అనే అంశంపై బోధించారు. సాయం చేసిన మనుషుల గురించి దేవుడులా వచ్చావని అంటుంటారని ఈ లెక్కన ఆపదలో ఉన్న వారికి సహాయపడే గుణమున్న ప్రతి ఒక్కరూ దేవుడేనన్నారు. ప్రతి ఒక్కరూ ఎదుటి వారిని ద్వేషించడం, దోచుకోవడం అనే దానికి స్వస్తి పలకాలని ప్రేమించడం, సహాయ పడటం నేర్చుకోవాలన్నారు. ఉన్మాదం మనిషిలోని రాక్షసత్వాన్ని పెంపొందిస్తుందని దానిని వీడినాడటమే గొప్ప లక్షణమన్నారు. సిపిఎం డివిజన్ నాయకులు శ్రీను అధ్యక్షతన జరిగిన స్టడీ సర్కిల్‌లో సిపిఎం జిల్లా నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు జొన్నలగడ్డ సునీత, కృష్ణవేణి, అప్పారావు, అప్పాచారి, మురళీ, బోయనపల్లి పున్నయ్య, చలమల కిషన్ రావు, అజయ్, నరేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజ మార్పుపై సాహిత్యం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** వికాస సాహిత్య వేదిక సమాజ మార్పుపై సాహిత్యమనే నినాదంతో పదేళ్లుగా కృషి చేస్తుందని ఒక పక్క సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తూ మరో పక్క సామాజిక చైతన్యానికి కృషి చేస్తున్నదని సంస్థ బాధ్యులు నామవరపు కాంతేశ్వరరావు తెలిపారు. రానున్న కాలంలో ప్రత్యేక సంచికలు, వర్ధమాన కవుల పరిచయం, ప్రముఖుల వ్యాసాలను పొందుపరుస్తూ సాహిత్య సభలు, సమావేశాలు నిర్వహించాలని సంస్థ భావిస్తుందన్నారు. అధ్యక్షులుగా గాజుల భారతి శ్రీనివాస్, కార్యదర్శిగా తిరునగరి శ్రీనివాసరావు, కోశాధికారిగా సునీత, గౌరవాధ్యక్షులుగా తులసి దాస్, ఉపాధ్యక్షులుగా మలిశెట్టి కృష్ణమూర్తి ఐలయ్య, నాగేశ్వర రావు, సహాయ కార్యదర్శులుగా కట్టేకోల చిన్న నర్సయ్య, నల్ల కృష్ణ, శైలజ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కమిటీని సాధనాల వెంకట స్వామినాయుడు, శంకర్‌రెడ్డి, వెంకటకృష్ణ, వీరభద్రం తదితరులు అభినందించారు.

## దసరా సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** దసరా పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం చేస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. దసరా అంటే దశ అంటే పది అని రా అంటే నశింపజేయడం అని ఐదు కర్మేంద్రియాలను, ఐదు జ్ఞానేంద్రియాలను యోగ మార్గంలో నశింపజేయడం అంటే జయించడమే దసరా అని కమిటీ అధ్యక్షులు సత్యం తెలిపారు. భగవద్గీత ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమితి బాధ్యులు విజయ, సుజాత, ఉమేష్, వినురాధ, అరుణ, జయశ్రీ, మమత, దివ్య, శ్రీను, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# దేశం కోసం ఉరికంభం ఎక్కిన యోధుడు భగత్ సింగ్

### సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** దేశం కోసం, దేశ స్వాతంత్రం కోసం అతి చిన్న వయసులోనే ఉరితాడును ముద్దాడిన యోధుడు భగత్ సింగ్ అని, ఆయన ఆశయాన్ని కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నివాళని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్ట రాగమయి దయానంద్ అన్నారు. దేశంలో మతోన్మాదులు బిజెపి, ఆర్‌ఎస్ఎస్ పెట్రేగిపోతున్నారని మొత్తం కులం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు పాల్పడుతున్నారని, అట్టి కుట్రలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాడటమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆదినారాయణ అన్నారు. సిపిఐ భగత్ సింగ్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సత్తుపల్లి మున్సిపాలిటీ ఆఫీస్ దగ్గర భగత్ సింగ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సభలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భగత్ సింగ్ కలలుగన్న సమసమాజ స్థాపన కోసం, అంతరాలేని సమాజం కోసం, లౌకిక భారతదేశ రక్షణ కోసం ప్రజాస్వామ్యం రాజ్యాంగాన్ని కాపాడుకునే దానికోసం ప్రతి ఒక్కరూ పోరాడవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నకేశవ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నరసింహారావు, చల్లగండ్ల కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పింగళి సామేలు, సిపిఐ టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, రజక సంఘం అధ్యక్షులు విరివాడ నాగభూషణం, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్కే రంజాన్ బి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు, కిషోర్, దొడ్డా గోపాల్ రావు, నాయకులు హమీద్, అజయ్ పాల్గొన్నారు.

# 'స్థానిక' ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### ఎఎంసి చైర్మన్ హన్మంతరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో రఘునాథపాలెం మండల కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని మండల కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యరగర్ల హన్మంతరావు మాట్లాడుతూ రఘునాథపాలెం మండల అభివృద్ధే ధ్యేయంగా ఇచ్చిన మాట మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ. 300 కోట్ల నిధులను కేటాయించారన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, ఫార్మేషన్ రోడ్లు, సాగునీటిని అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి చెరువులకు నీటిని నింపారన్నారు. మండల అభివృద్ధికి అడిగిన వెంటనే నిధులు కేటాయిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను, మండలంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, నాయకులు దేవ్‌సింగ్, రామ్మూర్తి నాయక్, బండి వెంకన్న, బండి నాగేశ్వరరావు, నగేష్, లక్ష్మణ్, సుధాకర్, సిద్ధయ్య, రామునాయక్, జంపా నాయక్, జోనబోయిన పాపయ్య, సుధీర్, ప్రేమ్ కుమార్, మహేష్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సందడి

### అభ్యర్థుల ఎంపికపై కసరత్తు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్లు ప్రకటించడంతో గ్రామాల్లో సందడి మొదలైంది. రాజకీయ పార్టీలు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించారు. రఘునాథపాలెం మండలంలో జెడ్పిటిసి స్థానం బిసికి, ఎంపిపి స్థానం జనరల్‌కు కేటాయించారు. అదేవిధంగా సర్పంచ్, ఎంపిటిసి స్థానాలకు సంబంధించి కూడా రిజర్వేషన్లు ప్రకటించారు. 2019లో ఉన్న రిజర్వేషన్ స్థానాలు ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. ఇప్పుడు గతంలో ఉన్న రిజర్వేషన్లు కాకుండా కొత్త రిజర్వేషన్లు వచ్చాయి. దీనితో గతంలో సర్పంచ్‌గా, ఎంపిటిసిగా పనిచేసిన వారు మరల పోటీ చేసే అవకాశం లేకుండాపోయింది. పార్టీ నిర్ణయిస్తే ఆ రెండు స్థానాల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు నాయకులు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. జెడ్పిటిసి స్థానం బిసిలకు కేటాయించడంతో అభ్యర్థి ఎంపిక కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు ఇబ్బందికరంగా మారే పరిస్థితి నెలకొంది. ఇరు పార్టీల నుంచి పలువురు బిసి అభ్యర్థులు పోటీకి ఆసక్తి చూపుతున్నారు. సర్పంచ్, ఎంపిటిసి స్థానాలకు సంబంధించి గతంలో ఉన్న రిజర్వేషన్లు పూర్తిగా మారడంతో కొత్త అభ్యర్థులను ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే గ్రామ స్థాయిలో సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేసి నాయకులను సమన్వయ పరుస్తూ అభ్యర్థి ఎవరైనా గెలుపు కోసం పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. మండల నాయకత్వంతో పాటు ప్రత్యేకంగా ఎంపిటిసి స్థానాలకు ఇంచార్జీలను ఏర్పాటు చేసి గెలుపు కోసం సన్నాహకాలు మొదలుపెట్టారు. బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం కూడా గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించింది. మండలంలో ఎక్కువ గిరిజన జనాభా ఉన్నప్పటికీ రిజర్వేషన్‌లో తగిన ప్రాధాన్యత కల్పించడం లేదంటూ గిరిజనులు ఆరోపిస్తున్నారు. పంచాయతీల్లో అధికంగా గిరిజన జనాభా ఉన్నప్పటికీ ఎక్కువ స్థానాలు బిసిలకు కేటాయించారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఒకట్రెండు కుటుంబాలు ఉన్న గ్రామాల్లో ఆ వర్గానికే రిజర్వేషన్ రావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సిపిఐ, సిపిఎం ఇతర పార్టీలు కూడా తమకు పట్టున్న గ్రామాల్లో గెలుపు కోసం సన్నాహకాలు మొదలుపెట్టారు. కాంగ్రెస్, సిపిఐ మధ్య మండలంలో పొత్తు ఉంటుందా లేదా అన్నది తేలాల్సి ఉంది. రిజర్వేషన్లు ప్రకటించడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. నాయకులను, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ వంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

# జీవితాన్ని మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉంది



**ప్రజాపక్షం/వైరా:** ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు వేమూరి సత్యనారాయణ ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. వైరా పట్టణానికి చెందిన రిటైర్డ్ అధ్యాపకులు వేమూరి సత్యనారాయణ అనేక సంవత్సరాలుగా పేద కుటుంబాల్లోని ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్నారు. ఎంబిబిఎస్, ఐఐటి, బిటెక్ చదువుతున్న నిరుపేద కుటుంబాలకు చెందిన పలువురు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఉన్నత విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్నారు. ఆదివారం వేమూరి సత్యనారాయణ, స్వరూపరాణి దంపతులు వారి కుమారుడు ప్రముఖ ఎన్ఆర్ఐ వేమూరి సుధీర్ సౌజన్యంతో ఎంబిబిఎస్, ఐఐటి, బిటెక్ చదువుతున్న పానెం శ్రీహర్షిత, పానెం శ్రీహర్షిని, నిమ్మల కావ్య, ఉప్పునూతల కుశల, కొమ్మూరి లయ, మట్టూరి మీనాక్షి, మాగంటి మధుర, ఉప్పునూతల ధర్మ, గుత్తా దినేష్, కాంద్ర కిరణ్, ఫణితి వేదాంత్, తడికమళ్ల ఆదిత్య, ఆదూరి వంశీకిరణ్, పానుగంటి హేమంత్‌కుమార్, పానుగంటి శశికిరణ్ 15 మంది పేద విద్యార్థులకు సుమారు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వేమూరి సత్యనారాయణ, డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, జీవితాన్ని మార్చే శక్తి విద్యకు మాత్రమే ఉందని అన్నారు. శ్రద్ధగా చదువుకొని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వేమూరి సత్యనారాయణ, వేమూరి స్వరూపరాణి, డాక్టర్ శ్రీహర్ష, మార్పు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు గుడిమెట్ల రజిత, గుడిమెట్ల మోహన్‌రావు, కొంగర సుధాకర్, గూడపాటి సూర్యం, సూర్యదేవర సురేష్, మట్టూరి కృష్ణారావు, విసినేపల్లి కృష్ణ, సైదా, విద్యార్థులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయండి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మత్స్యకారులకు ఇచ్చే చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలని ముదిరాజ్ యువసేన రాష్ట్ర ఉపాధ్యక్షులు లేళ్ల లక్ష్మణ్ ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లేళ్ల లక్ష్మణ్ మాట్లాడుతూ మత్స్యకారులను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. చెరువులు నిండుకుండలా ఉన్న ఇప్పటి వరకు చేప పిల్లలను పంపిణీ చేయలేదన్నారు. నాసిరకం చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారని వాటిని కూడా సకాలంలో అందించడం లేదన్నారు. చేప పిల్లలను కాకుండా ప్రభుత్వం వాటికి బదులు నగదును మత్స్యకారుల సొసైటీలకు నేరుగా బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

## పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించాలి : ఎంపిడిఓ

**ప్రజాపక్షం/పాల్వంచ :** త్వరలో జరిగే సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులుని ష్పక్ష పాతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తమ విధులను నిర్వహించాలని ఎంపిడిఓ కుదుముల విజయ బాస్కర్‌రెడ్డి అన్నారు. ప్రిసైడింగ్ అధికారులు సమయపాలన పాటించాలని సూచించారు. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. విధులు, బాధ్యతలపై సాయిక్రిష్ణ, పార్థసారధి, ప్రకాష్‌రావులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కార్యాలయ సూపరిండెంట్ సుధాలక్ష్మి, ఎంపిఓ చెన్న కేశవులు, యుడిసి వీరబాబు పాల్గొన్నారు.

# లంబాడీలను ఎస్‌టి జాబితా నుండి తొలగించాలి

### న్యాయం జరిగే వరకూ భారీ శాంతియుత యుద్ధం
### మేడారం, హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభలు





**ప్రజాపక్షం/భద్రాచలం :** అక్రమంగా గిరిజన జాబితాలో చొరబడ్డ లంబాడీలను ఎస్టి జాబితా నుండి తొలగించాలి, ఆసమస్య పరిష్కారమయ్యేంత వరకు పోరాటాలు ఆపే ప్రసక్తే లేదని మాజీ ఎంపి సోయం బాపూరావు అన్నారు. చట్టబద్ధత లేని లంబాడీలను ఎస్టి జాబితా నుండి తొలగించాలని కోరుతూ గోండ్, కోయ, నాయకపోడు, పర్ధాన్, కొలాం, ఆంథ్, తోటి, కొండరెడ్డి, చెంచు 9 తెగలు భద్రాచలంలో ఆదివారం చేపట్టిన ధర్మయుద్ధం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. లంబాడీలు గిరిజనులుగా చెలామని అయ్యేందుకు ఎలాంటి చారిత్రక ఆధారాలు లేవని, దీనిని కోర్టులో సవాల్ చేయగా వాదోపవాదాలు సాగుతున్నాయని చెప్పారు. వాస్తవిక ఆధారాలతో ఆదివాసీ నాయకులు న్యాయ పోరాటాలు సాగిస్తున్నారని, ప్రధాని నరేంద్రమోడి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిజాలను చిత్తశుద్ధితో కోర్టుకు సమర్పించాలని కోరారు. భద్రాచలంలో మొదలైన ధర్మయుద్ధం లంబాడీల గుండెల్లో గుబులు పుట్టిస్తోందని, సమస్య పరిష్కారం కాకుంటే ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మేడారం, హైదరాబాద్‌లో పది లక్షల మందితో సభలు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, రేగా కాంతారావు, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీ సోదరులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇదే విషయాన్ని చర్చిస్తామని పొదెం, బిఆర్ఎస్ అధిష్టానం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు రేగా స్పష్టం చేశారు. తాటి కోయ భాషలో మాట్లాడి అదర్నీ అలరిచడంతో పాటు వేదికపై నుండి విల్లంబును ఎక్కిపెట్టి ఆదివాసీల సత్తా చాటుతామంటూ చెప్పుకొచ్చారు. అనంతరం ఉస్మానియా విద్యార్థి జేఏసి నాయకుల మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ అసలైన ఆదివాసీల ఉద్యోగ ఉపాధి అవకాశాలను దొడ్డిదారిన లాక్కుని అనుభవిస్తున్నారని అన్నారు. ఆదివాసీల మనుగడను దెబ్బతీస్తున్న లంబాడీలను వెంటనే ఎస్టి జాబితా నుండి తొలగించాలన్నారు. మైదాన ప్రాంతాల్లో ఉండే గిరిజనేతరులు లంబాడీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మీరు మేలుకోకుంటే రానున్న రోజుల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసి అందరి ఉనికిని దెబ్బతీస్తారని, ఆదివాసీలు చేస్తున్న న్యాయమైన ధర్మయుద్ధానికి సహకరించాలని కోరారు. పొడియం బాలరాజు, కల్లూరి జయబాబు, కొర్సా జేజే రాంబాబు, పూనెం శ్రీనివాస్, తెల్లం వెంకటేశ్వర్లు, తెల్లం రమణయ్య, ముర్రంవీరభద్రం, ముర్ల రమేవ, కోవా దలవత్ రావు, తెల్లం సీతమ్మ,పూనెం శ్రీను, పూనెం కృష్ణ దొర పాల్గొన్నారు.

# ఉపాధిహామీ చట్టాన్ని అమలు చేయండి :నానబాల రామకృష్ణ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** దేశానికి నిరుద్యోగ సమస్య పెను సవాలుగా మారిందని ఇటువంటి పరిస్థితుల్లో భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ చట్టాన్ని రూపొందించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ డిమాండ్ చేశారు. విద్యకు తగిన ఉపాధి అన్నది పోయి అసలు ఉపాధే కరువైందని దేశ వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక కోట్లాది మంది యువశక్తి నిర్వీర్యమవుతుందన్నారు. భగత్‌సింగ్ 118వ జయంతిని ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశం నిరంతరం మననం చేసుకోవడంతో పాటు యువత భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలన్నారు. 23 ఏళ్లకే దేశం కోసం ప్రాణాన్ని తృణప్రాయంగా భావించిన భగత్ సింగ్ యువతకు ఆదర్శం కావాలన్నారు. దేశం సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నదని నిరుద్యోగం, మత ఉన్మాదం, పెరుగుతున్న కార్పొరేటీకరణ, ఆర్థిక అంతరాలు ఇబ్బందికరంగా మారాయన్నారు.వీటిపై యువత పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పాలక వర్గాలు కేవలం ఓట్ల రాజకీయాలు చేస్తున్నాయి తప్ప యువ శక్తిని దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించడం లేదని రామకృష్ణ ఆరోపించారు. ప్రభుత్వం రంగం వట్టిపోయి ప్రైవేటు రంగం దిన దిన ప్రవర్ధమానమవుతున్న దశలో యువత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వలసలు పెరిగిపోతున్నాయని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వట్టిపోతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో సమరశీల పోరాటాలు మాత్రమే పరిష్కారం చూపగలవని రామకృష్ణ తెలిపారు. సమరశీల పోరాటాలకు యువతను సన్నద్ధం చేయడమే భగత్‌సింగ్‌కు ఇచ్చే సరైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మద్దోజు శ్రవణ్‌కుమార్, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మామిడాల కిరణ్, ఆముదాల వెంకన్న, రఫీ, వీరబాబు, అజయ్, సూరి, ఖాసీం, శివ, గణేష్ పాల్గొన్నారు.

## ఏజెన్సీ సమస్యలు పట్టని ప్రభుత్వం

### సమస్యలపై సిపిఎం పాదయాత్ర

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఏజెన్సీ ప్రాంతాలలో సమస్యలు ప్రభుత్వానికి పట్టడం లేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్రలు విమర్శించారు. మాణిక్యారం ఉమ్మడి గ్రామ పంచాయితీలో సమస్యలపై ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. మొట్లగూడెం నుండి మాణిక్యారం వరకు పాదయాత్ర సాగింది. మాణిక్యారం, చింతలపాడు, మొట్లగూడెం, కొత్తగుంపు గ్రామాల్లో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రహదారి, రైల్వే అండర్ బ్రిడ్జిలో నిల్వ నీటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు గ్రామస్తులు పాదయాత్ర బృందానికి తెలిపారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మాణిక్యారం మొట్లగూడెం గ్రామాల మధ్య ఆరు కిలోమీటర్ల రహదారి అసంపూర్తిగా మిలిగి అవస్థలు పాలు చేస్తుందన్నారు. ఈ రహదారికి ఫారెస్టు అనుమతుల ఆటంకం, బిల్లులు చెల్లింపుల జాప్యం వంటి కారణాలతో నిలిచి పోతూ వస్తుందన్నారు. 15 ఏండ్లుగా ఈ రహదారి పనులు సాగటం లేదన్నారు. ప్రస్తుతం కంకర వేసి బీటి ఆగి పోయిందన్నారు. రైల్వే శాఖ కారేపల్లి చీమలపాడు రైల్వే ట్రాక్ చింతలపాడు వద్ద ఉన్న రైల్వే గేట్‌ను తొలగించి అండర్ బ్రిడ్జి నిర్మాణం చేసిందన్నారు. ఈ బ్రిడ్జితో చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు మరింత బాధలు తప్పటం లేదన్నారు.

# క్రీడ

## బిసిసిఐ నూతన అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్



'భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు' నూతన అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్ నియమితులయ్యారు. ఆదివారం ముంబైలోని బిసిసిఐ కార్యాలయంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో మన్హాస్‌ను బిసిసిఐ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాజీవ్ శుక్లాను ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు. దేవజిత్ సైకియా గౌరవ కార్యదర్శిగా, ప్రభుతేజ్ సింగ్ భాటియా జాయింట్ సెక్రెటరీగా, కోశాధికారిగా ఎ రఘురామ్ భట్‌లను నియమించారు. ఇటీవల 70వ ఏట అడుగుపెట్టిన రోజర్ బిన్నీ బిసిసిఐ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో 45 ఏళ్ల మిథన్ మన్హాస్ బిసిసిఐ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుంటారు. ఈ నియామకంతో జమ్ముకశ్మీర్‌లో పుట్టి బిసిసిఐ అధ్యక్షుడిగా ఎంపికైన తొలి వ్యక్తిగా మిథున్ మన్హాస్ గుర్తింపు పొందారు. కాగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అపార అనుభవం ఉన్న మిథున్ మన్హాస్.. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.

### మిథున్ మన్హాస్‌కు కేంద్రమంత్రి అభినందనలు



బిసిసిఐ అధ్యక్షుడిగా మాజీ ఐపిఎల్ ఆటగాడు, మాజీ జమ్మూ కశ్మీర్ క్రికెటర్ మిథున్ మన్హాస్ నియామకమైన సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అభినందనలు తెలిపారు. రోజర్ బిన్నీ గత నెలలో బిసిసిఐ చైర్మన్ పదవి నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేంద్రమంత్రి స్పందిస్తూ.. జమ్ము కశ్మీర్ నుంచి ఓ ఆటగాడు ఈ పదవికి ఎన్నికవడం ఇదే తొలిసారని.. ఓ చారిత్రాత్మక క్షణాలని పేర్కొన్నారు.

## కామెంటరీ బాక్స్‌లోనూ మహిళలే..

మిథాలీ, అంజుమ్ చోప్రాకు ఛాన్స్



మహిళల వన్డే ప్రపంచ కప్ పోటీలకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో రెండు రోజుల్లో అహ్మదాబాద్ స్టేడియం వేదికగా మెగా టోర్నీ ప్రారంభం కానుంది. మహిళా సాధికారితను చాటేలా ఈ ప్రపంచకప్‌ను నిర్వహించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి భావిస్తోంది. అందుకే.. ఇప్పటికే పూర్తిగా మహిళా అంపైర్లు, రిఫరీలతో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. ఇప్పుడు కామెంటటేర్స్‌గానూ అతివలకే పెద్ద పీట వేసింది ఐసీసీ. భారత వెటరన్ మిథాలీ రాజ్‌తో పాటు పలువురు మాజీ క్రికెటర్లు తమదైన వ్యాఖ్యానంతో అభిమానులను అలరించనున్నారు. భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న వరల్డ్ కప్ పోటీలతో మహిళా క్రికెట్‌లో కొత్త అధ్యాయం మొదలపెట్టింది ఐసీసీ. విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని భారీగా పెంచడమే కాకుండా పూర్తిగా మహిళా బృందంతో కూడిన అంపైర్లు, రిఫరీలను ఎంపికచేసింది. ఇక కామెంటరీ బాక్స్‌లోనూ మహిళలకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈసారి మెగా టోర్నీ మ్యాచ్‌ల సందర్భంగా మాజీ క్రికెటర్లు తమదైన విశ్లేషణతో సందడి చేయనున్నారు. ఇందులో టీమిండియా మాజీలు మిథాలీ రాజ్, సనా మిర్, అంజుమ్ చోప్రా లకు చోటు దక్కింది. వరల్డ్ కప్ విజేతలైన మెల్ జోన్స్, ఇషా గుహ, స్టాసీ అన్ కింగ్, జులియా ప్రైస్‌కూడా కామెంటరీ ప్యానెల్‌లో ఉన్నారు. 'స్వదేశంలో వరల్డ్ కప్ మ్యాచ్‌లను వీక్షించడం నిజంగా గొప్ప అనుభూతి. ప్రపంచ క్రికెట్లో ఇదొక వేడుక మాత్రమే కాదు భావి తరం అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచే టోర్నీ. మాజీ క్రికెటర్‌గా ప్రపంచ కప్‌లో భాగం కావడంచాలా సంతోషంగా ఉంది. కామెంటరీ బాక్స్ నుంచి ఆటకు సంబంధించిన అప్‌డేట్స్ పంచుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని మిథాలీ వెల్లడించింది. ప్రపంచ కప్ కామెంటేటర్స్ బృందంలోకి వరల్డ్ కప్ హీరోలను తీసుకుంది ఐసీసీ. వీళ్లలో దినేశ్ కార్తిక్, అరోన్ ఫించ్, కార్లోస్ బ్రాత్‌వైట్ వంటి పలువురు దిగ్గజ ఆటగాళ్లు ఉన్నారు. అలానే.. రెగ్యులర్ కామెంటేటర్లు కటే మార్టిన్, ఇయాన్ బిషప్, నాటాష ఫర్రంట్, రస్సెల్ అర్నాల్డ్. నటాలీ జెర్మనోస్, అలాన్ విల్కిన్స్, కాస్ నాయుడు, రౌనక్ కపూర్, జతిన్ సప్రూలు సైతం తమ కామెంటరీతో ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

## ఆసియా కప్ ఫైనల్‌కు భారీ భద్రత..

పదిహేడో సీజన్ ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌కు మరికాసేపట్లో తెరలేవనుంది. 40 ఏళ్ల టోర్నీ చరిత్రలో భారత్, పాకిస్థాన్ జట్లు టైటిల్ పోరులో తలపడడం ఇదే మొదటిసారి. దాంతో.. దాయాదుల మధ్య పైచేయి ఎవరిదయ్యేను? అని అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ఇరుదేశాల ఆటగాళ్లు, అభిమానుల మధ్య భావోద్వేగాలతో ముడిపడిన ఈ మ్యాచ్‌కు భారీ భద్రత కల్పిస్తున్నారు. బిగ్ ఫైట్‌కు వేదికైన దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియాన్ని ఇప్పటికే తమ గుప్పిట్లోకి తీసుకున్నామని దుబాయ్ ఈవెంట్స్ సెక్యూరిటీ కమిటీ వెల్లడించింది. అంతేకాదు స్టేడియానికి వచ్చే అభిమానులకు కీలక ఆదేశాలు జారీ చేసిందీ సంస్థ.



**నిషేధిత వస్తువులు ఇవే..**
టపాసులు, లేజర్ పాయింటర్స్‌తో పాటు పేలుడు పదార్థాలు, హానికరమైన వస్తువులను స్టేడియం లోపలికి అనుమతించరు. కత్తి, బ్లేడ్ వంటి పదునైన వస్తువులు.. విష పదార్థాలు, రిమోట్‌తో కంట్రోల్ చేయగలిగే పరికరాలను తీసుకెళ్లకూడదు. పెద్ద గొడుగులు, కెమెరా ట్రైపాడ్స్, సెల్ఫీ కర్రలు తీసుకెళ్లడంపై నిషేధం ఉంది. నిర్వాహకులు అనుమతించని బ్యానర్లు, జెండాలు, సంజ్ఞలతో కూడిన వస్తువులను తీసుకెళ్లకూడదు. అలానే.. పెంపుడు జంతువులు, సైకిళ్లు, స్కేట్‌బోర్డులు, స్కూటర్లు, గాజు పదార్థాలను నిషేధించారు.

# ఫోకస్ ఆరోగ్యం



## గుండె వ్యాధులు తెచ్చే గుప్త జన్యువు..

మనుషుల ప్రాణాలు హరిస్తున్న లిపోప్రొటీన్ (ఎ) పట్ల జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 1.8 కోట్లు మంది గుండె సంబంధిత వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. కేన్సర్ల కంటే ఎక్కువగా ప్రాణాలు తీస్తున్నప్పటికీ, గుండె వ్యాధులకు ప్రధానమైన జన్యు ప్రమాద కారకం లిపోప్రొటీన్(ఎ) (ఎల్‌పి ఎ)పై అవగాహన చాలా తక్కువగా ఉంది. ఆసియా పసిఫిక్, మధ్యప్రాచ్యంలో జరిగిన తాజా సర్వే ప్రకారం, 66 శాతం మంది గుండె పరీక్షలు చేయించుకోవడం మానేస్తున్నారు. 45 శాతం మందికి జన్యు కారణం గుండె వ్యాధికి సంబంధం ఉందని తెలియదు. కేవలం 22 శాతం మందికి 'ఎల్‌పి ఎ' పరీక్ష గురించి తెలుసు. అయినప్పటికీ, పరీక్ష చేయించుకున్న వారు 7 శాతం మాత్రమే. నోవార్టిస్, గ్లోబల్ హార్ట్ హబ్ సంయుక్తంగా నిర్వహించిన వెబినార్‌లో నిపుణులు 'ఎల్‌పి ఎ' పరీక్షలను గుండె వ్యాధి నిర్ధారణలో తప్పనిసరి చేయాలని, ప్రభుత్వాలు విధానాల్లో చేర్చాలని పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే ఏర్పడే ఈ పరిస్థితి జీవితాంతం కొనసాగుతుంది. ఆహారం, వ్యాయామం దీనిపై పెద్ద ప్రభావం చూపవు. కాబట్టి, ఎప్పటికప్పుడు 'ఎల్‌పి ఎ' పరీక్షలు చేయించుకొని, తగిన వైద్య సేవలు పొందాలని నిపుణులు సూచిస్తున్నారు.



రక్తంలో పలు రకాలు ఉండడంతో, అత్యవసర సమయాల్లో సరిపోయే రక్తం లభించక ఇబ్బంది పడడం దాదాపు అందరి జీవితంలోనూ ఏదో ఒక సమయంలో ఎదుర్కొనే సమస్యే. కొన్ని సందర్భాల్లో సకాలంలో, సరైన రక్తం లభించక రోగి ప్రాణాలు పోవచ్చు. ఇలాంటి సమస్యలకు 'యూనివర్సల్ గ్రూప్ బ్లడ్' చెక్ పెట్టనుంది. జపాన్‌లో నారా మెడికల్ యూనివర్సిటీ నేతృత్వంలో, అన్ని రక్తపు గ్రూపులకు సరిపడే యూనివర్సల్ ఆర్టిఫిషల్ బ్లడ్ అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. ఇది సహజ రక్తం మాదిరిగానే ఆక్సిజన్‌ను తీసుకెళుతుంది. అంతేగాక, అన్ని రక్త గ్రూపులకు అనువుగా ఉంటుంది. రిఫ్రిజిరేటర్ అవసరం లేకుండా కొన్ని నెలలు నిల్వ చేయడం సాధ్యమవుతుంది. ఇది, హెమెగ్లోబిన్ అనే ప్రోటీన్‌ను కాలం చెల్లిన రక్తం నుంచి తీసుకొని, జీవ కణంపై కనిపించేలా ముఖ్యమైన లిపిడ్ విధానాల్లో నిల్వ చేసే ప్రక్రియ. ఫలితంగా, ఇది జీర్ణ మార్గాన్ని, రోగ నిరోధక వ్యవస్థను స్థిమితంగా ప్రభావితం చేయదు. అంతేగాక, ఇది వైరస్ రహితంగా, దీర్ఘకాలిక నిల్వకు కూడా బాగా అనువుగా ఉంటుంది. అంతర్జాతీయ జర్నల్స్‌లో వచ్చిన కథనాలను అనుసరించి, క్లినియల్ ట్రయల్స్‌లో దీని వినియోగం వల్ల ఎలాంటి తీవ్రమైన పరిణామాలు కనిపించలేదు. తొలుత తక్కువ పరిమాణంలో ఈ రక్తాన్ని తీసుకొని పరీక్షలు నిర్వహించారు. ఇప్పుడు ఎక్కువ రక్తాన్ని తీసుకొని ట్రయల్స్ చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఇది ఎలా పనిచేస్తుందో, ఎంత స్థాయిలో రక్షణ ఇస్తుందో పరీక్షిస్తున్నారు. ఈ సాంకేతికత విజయవంతమైతే, 2030 నాటికి ఆసుపత్రులు, ఎమర్జెన్సీ కేంద్రలు, యుద్ధ ప్రాంతాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన ప్రాంతాలలో రక్తం కొరత ఉండదు. రక్తం గ్రుప్ మ్యాచ్ కావాలనే అవసరం లేకుండా, సంఖ్య ప్రారంభించిన వెంటనే ట్రాన్స్‌ఫ్యూషన్ ఇవ్వగలిగే మెరుగైన అత్యవసర వైద్య సేవ లభ్యం కానుంది. ప్రపంచ వ్యాప్తంగా అత్యవసర పరికరాల్లో, ప్రకృతి విపత్తుల ప్రాంతాల్లో, ట్రామా కేర్‌లో ఈ తీరు సంచలన మార్పుని తీసుకురాబోతోంది.

## వెన్నెముక సమస్యలకు కొత్త చికిత్స



ఫెడరల్ యూనివర్సిటీ ఆఫ్ రియో డి జనీరో (యుఎఫ్ఆర్‌జె), క్రిస్టాలియా ల్యాబొరేటరీ ఆధ్వర్యంలో సుమారు 25 సంవత్సరాలు పరిశోధనలు జరిపిన బ్రెజిల్ శాస్త్రవేత్తలు 'పోలిలామినిన్' (Polylaminin)ను కనుగొన్నట్టు ప్రకటించారు. ఇది ప్లాసెంటా ప్రొటీన్ ఆధారంగా తయారుచేసిన ఔషధం. దెబ్బతిన్న వెన్నెముక వద్ద నరాలను ప్రేరేపించడం, శరీర కణజాలాన్ని పునరుద్ధరించడం ద్వారా ఇది మెరుగైన చికిత్సను అందిస్తుంది. దెబ్బతిన్న వెన్నెముక పనితీరును తిరిగి యథాస్థితికి తీసుకొచ్చే సామర్థ్యం ఇందులో ఉన్నదని తమ ప్రాథమిక పరిశోధనల్లో రుజువైంది. మొదటి దశ క్లినికల్ ట్రయల్స్‌లో, 'పారాప్లేజియా' లేదా 'క్వాడ్రిప్లేజియా' (అంతర్గతంగా లేదా అవయవాలు పనిచేయని స్థితి) సమస్యలు ఉన్న రోగుల్లో ఆశాజనకమైన మార్పులు కనిపించాయి. వారు ముందెన్నడూ ఊహించని విధంగా కదలికలను తిరిగి పొందాన్నట్టు గుర్తించారు. ఈ మందును నేరుగా మెదడు నుండి వెన్నెముకలోకి ఇంజక్షన్ రూపంలో అందిస్తారు. ఇది నరకణజాలాన్ని పునరుద్ధరించేలా పని చేస్తుంది. పూర్తి పునరుత్పత్తి, శాశ్వత నష్టాలు లేకుండా ఆరోగ్యం తిరిగి వచ్చే అవకాశాలు కల్పిస్తుంది. అయితే ఇది ఇంకా ప్రాథమిక స్థాయిలోని క్లినికల్ ట్రయల్స్‌లో ఉంది. బ్రెజిల్ ఆరోగ్య నియంత్రణ సంస్థ (ఎఎన్‌విఐఎస్ఎ) నుండి పూర్తిస్థాయి అనుమతులు ఇంకా రావాల్సి ఉంది. శాస్త్రీయ నివేదికలు మెడికల్ జర్నల్స్‌లో పూర్తివిధంగా ప్రచురితమవ్వాలి. ప్రపంచవ్యాప్తంగా దీని అప్లికేషన్, భద్రత, దీర్ఘకాల ప్రామాణికతపై మరిన్ని పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఆ తర్వాతే ఈ చికిత్సా విధానం రోగులకు పూర్తిగా అందుబాటులోకి వస్తుంది.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# విప్లవోద్యమాలకు దిక్సూచి భగత్‌సింగ్

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

ఘనంగా భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలు


వరంగల్...


హనుమకొండ...

**ప్రజాపక్షం/వరంగల్**: విప్లవ ఉద్యమాలకు దిక్సూచి విద్యార్థులు సర్దార్ భగత్‌సింగ్ అని, ఆయన ఆశయాల సాధనలో యువత, విద్యార్థులు ముందుండాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వరంగల్ పట్టణంలోని శివనగర్ తమ్మెర భవన్‌లో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 118 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిచారు. కార్యక్రమానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్‌బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, వలి ఉల్లా ఖాద్రి, నాయకులు దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, బుస్స రవీందర్, గుండె బద్రి, సంఘీ ఎలేందర్, ఎండి అక్బర్ పాషా, జున్ను రవి, ఆరెల్లి రవి, చింత కింది కుమారస్వామి, తాళ్లపల్లి జాన్ పాల్, యాకాంబ్ర చారి, ల్యాదల్ల శరత్, మస్కా సుధీర్, మునిగాల వేణు, లావుడ్య ధ్రసునాయక్, రాజేందర్, సౌందర్య, విజయలక్ష్మి, రంజిత్, ఎండి యాకూబ్, తస్లీమ్, చిరంజీవి, దివ్య, శ్వేత, మహేష్, రాజేష్, సాంబయ్య, చందు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్** : విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం హన్మకొండ బాలసముద్రం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ తక్కలపల్లి శ్రీనివాస హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఆకాంక్షను నిలువెల్లా నింపుకొని ఉద్యమ తరంగంగా ఆంగ్లేయులపై ఎగసిపడి యువతను స్వాతంత్ర ఉద్యమంలో భాగస్వామ్యులు చేసిన వీరుడు భగత్ అని అన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, బికెఎంయు గౌరవ అధ్యక్షులు ఏదునూరి వెంకటరాజం, అరసం రాష్ట్ర కార్యదర్శి పల్లేరు వీరస్వామి, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్, ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టెపాక రవి, డిహెచ్‌పిహెచ్ జిల్లా గౌరవ అధ్యక్షులు మధ్యల ఎల్లేష్, బికెఎంయు బాధ్యులు మునిగాల బిక్షపతి, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బుజ్జి జ్యోతి, నాయకులు పసునూరి సునీల్, అల్వాల రాజు, హుస్సేన్ పాషా పాల్గొన్నారు.

**కరీంనగర్‌సిటీ** : సర్దార్ భగత్‌సింగ్ నేటి విద్యార్థి, యువతకు ఆదర్శమని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చకుండా బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. దేశభక్తి పేరుతో రాజకీయపబ్బం గడుపుతున్న బిజెపి భగత్‌సింగ్ వర్ధంతి, జయంతిలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని బోయవాడ చౌరస్తాలో భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ మణికంఠరెడ్డి మాట్లాడుతూ విప్లవ మూర్తి భగత్‌సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, మహిళలలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి, అవినీతి అక్రమాలపై ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్, మచ్చ రమేష్, గర్ల్స్ వింగ్ రాష్ట్ర కో కన్వీనర్ కండె విజేత, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిపల్లి హేమంత్, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము, నాగుల జ్ఞానేశ్వర్, మచ్చ పవన్, ప్రవీణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

**ఆదిలాబాద్** : షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. షహీద్ భగత్ సింగ్ జయంతిని ఎఐవైఎఫ్ ఆదిలాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంప్ వద్ద భగత్ సింగ్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు అనిల్, మెస్రం విలాస్, బబ్లూ, మారుతి, హరీష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్** : భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు, యువత పాలకుల వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని డాక్టర్ మెడికల్ అకాడమీలో భగత్ సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఆకాంక్షను నిలువెల్లా నింపుకుని ఉద్యమ తరంగలా ఆంగ్లేయులపై పోరాడి యువతను స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యం చేసిన వీరుడు భగత్‌సింగ్ అన్నారు. విద్యార్థులు, యువత భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తుందని, విద్యను సైతం కాషాయికరణ చేస్తుందన్నారు. విద్య కాషాయికరణకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివ,గోపి, పవన్, నరేందర్, స్వాతి, ప్రవలిక, శిల్ప, శిరీష, భవాని, మాధవి పాల్గొన్నారు.

**నిజామాబాద్** : యువతకు ఉపాధి కల్పించే భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ తీసుకరావలని ఎఐఎస్ఎఫ్ జిల్లాకార్యదర్శి రఘురాం అన్నారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ చౌరస్తా వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు కుశాల్, నవీన్, కృష్ణ, నితిన్, రమేష్, మధు, రంజిత్, ఫిరోజ్‌అలీ, ఇమ్రాన్‌అలీ పాల్గొన్నారు.

**వలిగొండ** : వలిగొండ పట్టణ కేంద్రంలో మారోజు నరసింహా చారి అధ్యక్షతన భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఘనవాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు పాల్గొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం తమ ప్రాణాలను లెక్కచేయకుండా స్వాతంత్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఉరికొయ్యలను ముద్దాడిన వీర కిషోరం భగత్ సింగ్ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పాఠ్యపుస్తకాలలో భగత్ సింగ్ జీవిత చరిత్రను పొందుపరచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కోసం భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్‌ను చట్టం చేయాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ నేటి యువత భగత్‌సింగ్ ఆదర్శాలు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి సుద్దాల సాయికుమార్, మెట్టు లక్ష్మీ నారాయణ, గుండెగాని నాగరాజు బాలగోని రాజు, బాలాగోని మచ్చగిరి, దాసరి మాణికుమార్, కనబోయిన శివసాయి, ఆదిమూలం రమేష్, ఉప్పలయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

**వరంగల్** : భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని, మతోన్మాద శక్తులను ఓడించడమే భగత్ సింగ్‌కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వాలి ఉల్లా ఖాద్రి అన్నారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్ లోని కరీమాబాద్‌లో భగత్ సింగ్ విగ్రహం వద్ద భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12ఏళ్ల అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ల యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్ సింగ్ అని కొనియాడారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్‌కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదెల్ల శరత్, యాకుబ్ పాషా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్** : భారత స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ జయంతిని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా సిపిఐ ఇంద్రనగర్ కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కైలాష్, జిల్లా ఉపాధ్యక్షుడు అస్లాం, అనంత్రావు, అబ్దుల్,శ్రీకర్ పాల్గొన్నారు.

**పాల్వంచ** : సర్ధార్ భగత్‌సింగ్ జయంతి స్థానిక సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సృజన్, వినయ్, ఉపాధ్యక్షులు సంజయ్, రాజ్ కమల్, హార్మాన్, కళ్యాణ్, మహేష్, వరుణ్, నవీన్ పాల్గొన్నారు.


ఖమ్మం...


కరీంనగర్...


నిజామాబాద్...


వరంగల్...


నిర్మల్...


పాల్వంచ...


యాదాద్రి...


ఆదిలాబాద్...



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/వీణవంక: వీణవంక మండల టియుడబ్ల్యూజే(ఐజెయు) నూతన ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకోగా ఆదివారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన క్యాంపు ఆఫీసులో ఘనంగా సన్మానించారు. హుజురాబాద్‌లోని క్యాంపు ఆఫీసులో వీణవంక ప్రెస్‌క్లబ్ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడికి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. నూతనంగా ఏర్పాటైన వీణవంక ప్రెస్‌కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## నెంబర్ ప్లేట్ల మార్పుపై ఆందోళన చెందొద్దు : లక్ష్మణ్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : వాహనాల నంబరు ప్లేట్ల మార్పుపై వాహనదారులు ఆందోళన చెందవద్దని సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పాత వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్(హెచ్‌ఎస్ఆర్‌పి)లు బిగించేందుకు ఎలాంటి గడువు విధించలేదని స్పష్టం చేశారు. ఈ నెల 30వ తేదీలోగా హెచ్‌ఎస్ఆర్‌పి తప్పనిసరిగా ఏర్పాటు చే యాలని లేకుంటే రవాణా, పోలీసు శాఖల ఆధ్వర్యంలో జరిమానాలు విధిస్తారనే ప్రచారంలో వాస్తవం లేదని తెలిపారు. వాహనాలకు నంబరు ప్లేట్ల మార్పు అంశం ఇంకా ప్రభుత్వ పరిశీలనలోనే ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని డిటిఒ సూచించారు.

## ధర్మకర్తలు రాజకీయం చేయడం బాధాకరం

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల రూరల్ మండలం పోలాస పౌలేష్తేశ్వర స్వామి ఆలయ నూతన ధర్మకర్తలు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి హాజరై నూతన ధర్మకర్తలకు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పో లాస ఆలయం చాలా పురాతనమైనది. కాకతీయుల కాలం నాటి ఆలయం. ధర్మకర్తలలో 7 గురిలో ముగ్గురు పోలాస వాస్తవ్యులు ఉన్నారని, ధర్మకర్తలు నూతన కార్యవర్గం రాజకీయం చేయడం బాధాకరం అని ఎమ్మెల్యే అన్నారు. గత ధర్మకర్తల పాలనలో ఆలయం అభివృద్ధి చెందింది అనేది వా స్తవం అని ఆయన తెలిపారు. నూతన ధర్మ కర్తల కాలంలో ఆలయం మ రింత అభివృద్ధి చెందాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ఆకాంక్షించారు. మాజీ ఎఎంసి చైర్మన్ దామోదర్ రావు,మాజీ ఎంపిపి పాలేపు రాజేంద్ర ప్రసాద్, ధర్మకర్తలు భారతపు భూమన్న, అనుపురపు సత్యనారాయణ,మర్రిపెల్లి కొండల్ రావు, రంగు రాజయ్య, కొండపల్క ల వినీత, డా.పుట్ట నాగరాజు, అర్చకులు రామోజ్వల గోవర్ధన్, మాజీ సర్పంచ్లులు చిర్ర నరేష్, మేళ్ల శంకర్, మాజీ ఎంపిటిసి దమ్మ సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్ట్రేలియాలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



ప్రజాపక్షం/గంగాధర:తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్ ల్యాండ్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడేలా ఆస్ట్రేలియా దేశంలోని బ్రిస్‌బేన్ నగరంలో బతుకమ్మ సంబరాలు వైభవోపేతంగా జరిగాయి. ఈ వేడుకలకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తెలంగాణ అసెంబ్లీ మీడియా అడ్వయిజరీ కమిటీ చైర్మన్ ఐరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ సప్తసముద్రాలు దాటి ఇతర దేశానికి వచ్చి నివసిస్తున్నా తెలంగాణ సాంప్రదాయాలను పాటిస్తుండడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సంబరాల్లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ క్వీన్స్‌లాండ్ అధ్యక్షుడు చొల్లూరి నరేందర్ కుమార్, ఉపాధ్యక్షుడు గుర్రం మాధవరెడ్డి, ఏకె సంతోష్ రావు, న ల్ల విజయ, రూపిరెడ్డి శ్రీకళ, కర్క ప్రియాంక, కోరబోయిన విజయ్, వాసాల ప్రేమలత, ఎక్కంటి విరించిరెడ్డి, తన్నీరు హరిత, తదితరులు పాల్గొన్నారు.

## భావితరాలకు ఇచ్చే గొప్ప సంపద బతుకమ్మ

ఎమ్మెల్యే హరీశ్‌రావు సతీమణి శ్రీనిత



ప్రజాపక్షం/ సిద్దిపేట : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగను చిన్నకోడూరు మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంతోపాటు,మాచాపూర్‌లో జరిగిన బతుకమ్మవేడుకల్లో సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు సతీమణి శ్రీనిత మహిళలతో కలసి బతుకమ్మ వేడుకల్లో పాలుపంచుకున్నారు. గ్రామానికి చెందిన మహిళలు, బాలికలతో కలసి బతుకమ్మ ఆడిపాడి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాన్ని భావితరాలకు ఇచ్చే గొప్ప సంపద బతుకమ్మ అన్నారు. ఆడపడుచులుఆనందంగా సంతోషంగా జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు.

## జమ్మికుంటలో బతుకమ్మ ఏర్పాట్లు పూర్తి

మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్



ప్రజాపక్షం/జమ్మికుంట: జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో బతుకమ్మ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ తెలిపారు. సోమవారం బతుకమ్మ ఆటలు ఆడేందుకు ఘాట్ల వద్ద మహిళలకు లైటింగ్, బతుకమ్మ ఘాట్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ మహిళల సాంప్రదాయ పండుగైన బతుకమ్మ ఏర్పాట్లను మున్సిపల్ శాఖ పూర్తి చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 14 చోట్ల బతుకమ్మ ఆటలు మహిళలు ఆనందోత్సవాలతో నిర్వహించుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

# ఎఐటియుసిపై ఆరోపణలు సరికాదు

ఉప ప్రధాన కార్యదర్శులు వైవి.రావు, మడ్డి ఎల్లాగౌడ్ ఆరోపణ



ప్రజాపక్షం/పెద్దపల్లి : సింగరేణిలో గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) 2025 సెప్టెంబర్ 25న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందంపై అవగాహన లేకుండా, బాధ్యతారాహిత్యంగా సోషల్ మీడియాలో అవాకులు చవాకులు పేలిన హెచ్‌ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్‌ను బహిరంగ చర్చకు గోదావరిఖని ప్రెస్క్లబ్‌కు రావాలని చెప్పినప్పటికీ రాకుండా తోక ముడిచాడని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శులు వైవి రావు, మడ్డి ఎల్లా గౌడ్‌లు మండి పడ్డారు. ఆదివారం ఖని ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో 2009 నవంబర్ 20న, 2025 సెప్టెంబర్ 25న జరిగిన ఒప్పంద పత్రాలను వారు తీసుకొని హాజరై మాట్లాడుతూ గని ప్రమాదంలో మరణించిన కార్మికుల వారసులకు సూటబుల్ జాబు విషయంలో గతంలో ఉన్న అర్హతలకు అదనంగా డిగ్రీ, పీజీ చేసిన వారికి కూడా వర్తింపజేయాలని 2025 సెప్టెంబర్ 25న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో ఎఐటియుసి ఒప్పందం చేసుకుంటే, దాన్ని వక్రీకరిస్తూ హెచ్‌ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ ఎఐటియుసిపై బురద జల్లే విధంగా కార్మిక వర్గాన్ని తప్పుదోవ పట్టిస్తూ, సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కార్మిక సంక్షేమం కోసం, వారి హక్కుల పరిరక్షణ కోసం పాటుపడేది కేవలం ఎఐటియుసి మాత్రమేనని కార్మిక వర్గం గ్రహించాలని వారు పేర్కొన్నారు. హెచ్చెమ్మెస్లొ నాడు పని చేసిన నీ తోటి సహచరులైన మేరుగు రాజయ్య, నారాయణ రెడ్డి, యాదగిరి సత్తయ్య, దశరథం గౌడ్, వీరాస్వామి తదితరులు నీ నియంతృత్వ పోకడలు భరించలేక నేడు ఎక్కడ ఉన్నారో రియాజ్ ఆత్మ విమర్శ చేసుకోవాలని వారు పేర్కొన్నారు, నీ యూనియన్ లో పని చేసిన నాయకులను ట్రాన్స్ఫర్లు చేస్తే, చార్జిషీట్ లు ఇస్తే కాపాడుకోలేని నువ్వు, వంద ఏండ్ల చరిత్ర కలిగిన ఎఐటియుసి ని విమర్శించడమంటె ఆకాశం పై ఉమ్మివేసినట్లేనని వారు ఎద్దేవా చేశారు. అంతే కాకుండా మీ స్వంత యూనియన్ కార్యాలయాన్ని కూల్చివేస్తె అడ్డుకోలేని నువ్వు ఎఐటియుసిపై విమర్శలు తగదని వారన్నారు. నాడు నాయిని నర్సింహారెడ్డి ని ముంచినట్టు నేడు కవిత ను కూడా ముంచినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదని వారు అన్నారు. ఎక్కడో ఉండి సోషల్ మీడియాలో పోజులకె పరిమితమయ్యారు తప్ప కార్మికుల హక్కుల కోసం పోరాడిన దాఖలాలు ఏనాడూ లేవని వారు పేర్కొన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకోకపోతే కార్మికులే తగిన బుద్ధి చెప్తారని, ఇప్పటికైనా రియాజ్ అహ్మద్ సోషల్ మీడియాలో ఫోజులు మాని, అగ్రిమెంట్లపై అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్తులో తమ నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని కార్మిక వర్గ సమక్షంలో ప్రత్యక్ష, ప్రతి చర్యలకు పాల్పడతామని వారు హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఎఐటియుసి కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, అర్జీ వన్, టూ, త్రీ బ్రాంచి కార్యదర్శులు ఆరెల్లి పోషం, జీగురు రవిందర్, మందల రాంచంద్రారెడ్డి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, నాయకులు మాదన మహేష్,రంగు శ్రీను, బోగ సతీష్ బాబు, ఆకునూరి శంకరయ్య, సిర్ర మల్లికార్జున్, మానాల శ్రీనివాస్, నాయిని శంకర్, బలుసు రవి, గుర్రం ప్రభుదాస్, కారంపూరి వెంకన్న, చెప్యాల భాస్కర్, గొడిశల నరేశ్, వై.లెనిన్ , కండె కీర్తి శేఖర్, పొన్నం రంజిత్, మోటపలుకుల మహేందర్, వెంకటస్వామి, పూరెల్ల శ్రీనివాస్, అగ్గు శ్రీనివాస్, వి.గట్టయ్య, పొనగంటి రాజయ్య, వెంకటేష్, సాదరి రమేశ్, కుమారస్వామి, అనిల్, దాముక శ్రీనివాస్, వీరస్వామి, బండారి మల్లేష్, పోషం, దుగ్యాల తిరుపతి రావు, బండారి క్రాంతి, అమరగొండ పోషం, కె.సంపత్, కె.మల్లెశ్, నక్క రమేశ్, గందం శ్రీనివాస్, నరేశ్, శ్రీనివాస రెడ్డి, లక్ష్మయ్య, ధర్మయ్య ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో పటిష్టంగా కాంగ్రెస్ పార్టీ

'సుడా' చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్నిస్థానాల్లో విజయం సాధించి తీరుతుందని, అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏదో ఒక విధంగా లాభం జరుగుతుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటికి మేలు జరిగేలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి మోసపోకుండా ప్రజల నెత్తిపై మోయలేనంత అప్పుల భారం మోపిందని విమర్శించారు. 2014లో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఆటు పోట్లు ఎదుర్కొన్నామని ఆనాటి నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా అరెస్టులు నిర్బంధాలను ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీని కరీంనగర్‌లో పార్టీ బలోపేతం కోసం కృషి చేశామన్నారు. 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నో ప్రలోభాల మధ్య కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ చేశారని, ఆర్టీసీ సమ్మెలో కార్మికులకు మద్దతుగా పోరాటం చేశానని నరేందర్‌రెడ్డి గుర్తు చేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఒకవైపు నియంతృత్వ బిఆర్ఎస్ పార్టీకి మతతత్వ బిజెపి పార్టీకి వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతూనే పార్టీని బలోపేతం చేశామని నరేందర్ రెడ్డి అన్నారు. ఆనాడు మేము ధర్నా చేసి ఆనాటి ప్రభుత్వంలో పరిష్కారం కాని సమస్యలను ప్రస్తుతం అధికారంలో ఉండి పరిష్కరిస్తున్నామన్నారు. సుడా చైర్మన్‌గా కరీంనగర్ నియోజకవర్గంతో పాటు సుడా పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాలకు నిధులు కేటాయించి పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జిడి రమేష్, దండి రవీందర్, అనిల్ కుమార్, కుర్ర పోచయ్య, పెద్దిగారి తిరుపతి, షబానా మహమ్మద్, ముల్కల కవిత, ఊరడి లత, అస్తపురం తిరుమల, తోట అంజన్న, లింగమూర్తి, బషీర్, జ్యోతిరెడ్డి, రాజుకుమార్, వెంకట్‌రెడ్డి, పర్వతం మల్లేశం, ఆంజనేయులు, ఖలీల్ తదితరులున్నారు.

## హుజురాబాద్‌లో భగత్‌సింగ్ విగ్రహాన్ని నెలకొల్పాలి:రాంపెల్లి రోహిత్




ప్రజాపక్షం / హుజురాబాద్ : హుజురాబాద్ పట్టణ కేంద్రం లో అఖిల భారత విద్యార్థి స మాఖ్య (ఎఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో భగత్ సింగ్ 118వ జ యంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్ మాట్లాడుతూ భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ముష్కరులను ఎదిరించి పోరాడి దేశానికి స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడడని పేర్కొన్నారు. భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని భగత్‌సింగ్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని ట్యాంక్ బండ్‌పై భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని కో రారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గణేష్, రాధాకృష్ణ, సాయికిరణ్, రాజు తదితరులుపాల్గొన్నారు.

## ఆడపడుచుల ఆత్మగౌరవ ప్రతీక బతుకమ్మ : మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాపక్షం/ సిద్దిపేట : ఈనెల 29న సద్దుల బతుకమ్మ పర్వదినం పురస్కరించుకొని జిల్లా ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంటప్రదాయాలకు,ఆడపడుచుల ఔన్నత్యానికి ప్ర తీక ఐన బతుకమ్మ పండుగను జిల్లా ప్రజలందరు సు ఖ సంతోషాలతో ఘనంగా జరుపుకోవాలన్నారు. ఎంగిలి పూలను వెదజ ల్లే అమవాస్య నుండి తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలందరు కలసి తీరొక్క పూలు, తీరొక్క రంగులతో బతుకమ్మ ఆడుకొని రేపు సద్దుల బతుకమ్మను గొప్పగా చేసుకుంటారన్నారు. దేశంలో పూలతో చేసుకొని ప్రకృతిదేవతగా పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంసృ్కతి,మహిళల ఆత్మగౌరవాన్ని ,ప్రకృతి ప్రేమను ప్రతీకగా కొలిచే గొప్ప పండుగ బతుకమ్మ అన్నారు. ఈపండుగను ప్రజలందరు వేడుకగా,ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# బిసి రిజర్వేషన్లను అడ్డుకోవద్దు

జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి భార్గవరామ్



ప్రజాపక్షం/గొల్లపల్లి : రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతూ జారీ చేసిన జిఒకు వ్యతిరేకంగా న్యాయపరమైన సమస్యలు సృష్టించి బలహీన వర్గాల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవరావు అన్నారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి సంఘాల పోరాటం ఫలితమే ఈ రిజర్వేషన్ల ను సాధించుకోవడం జరిగిందని ఈ రిజర్వేషన్లను ఎవరు వ్యతిరేకించిన తీవ్రమైన పరిణామాలు ఉంటాయని రాజకీయ కోణంలో వీటిని చూడవద్దని అగ్రవర్ణాలు వ్యతిరేకించవద్దని మా జనాభా 60 శాతానికి పైగా ఉన్నది జనాభా ప్రాతిపదికపై మేమెంతో మాకంత అనే నిదా నినాదం మీద జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ నాయకత్వంలో బిసిలు సంఘటితమై చేసిన పోరాటాల ఫలితంగా కుల గణన జరిగిందని దానికి అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడం జరిగిందని అన్నారు. 42 శాతం ర్వేషన్లను భరించలేని కొందరు అగ్రవర్ణాల వారు కొన్ని రాజకీయ పార్టీలు కోర్టుకు వెళ్ళి ఎన్నికలను ఆపాలనే దురుద్దేశంతో హైకోర్టులలో పిటీషన్లు వేసి బిసిల హక్కులను కాలరసే ప్రయత్నం చేస్తున్నారని అందుకు చరిత్ర ఎప్పుడు వారిని క్షమించదని హెచ్చరించారు. అగ్రవర్ణాలకు కేటాయించిన 10 శాతం రిజర్వేషన్లను వెంటనే రద్దు పరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కొరారు. అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు బీసీ సంఘాలు వ్యతిరేకించాయ మా బిసిలకు ప్రభుత్వం తగిన విధంగా న్యాయం చేస్తానంటే ఈ అగ్రవ ర్ణాలకు ఎందుకు ఇంత కుట్ర అని అన్నారు .జనరల్ స్థానాలలో కూడా బిసి, ఎస్‌సి ఎస్‌టి, మైనారిటీలు పోటీ చేయాలని 90 శాతం ఉన్న ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఓరగంటి భార్గవరాం, మండల అధ్యక్షులు బంగుడపు తిరుపతి, జిల్లా కార్యదర్శి కాళ్ళ రాజయ్య ముదిరాజ్, ఎలివేణి గంగయ్య ముదిరాజ్, నాగపురి మహేష్ ,ఓరగంటి సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ వలస జీవులకు భరోసా నిచ్చేలా సంక్షేమ కార్యక్రమాలు

దుబాయి బతుకమ్మలో వెన్నెల గద్దర్



ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : గల్ఫ్ తెలంగాణ ఫోరం (జిటిఎఫ్) ఆధ్వర్యంలో శనివారం రాత్రి దుబాయిలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్ పర్సన్ జి.వెన్నెల గద్దర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగిత్యాల మునిసిపల్ తాజా మాజీ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మ ణ్, నిర్మల్ జిల్లావాసి అల్లూరి క్రిష్ణవేణిలు అతిథులుగా హాజరయ్యారు. దుబాయి, షార్జాలలో ఉన్న తెలుగు ప్రవాసులు బతుకమ్మ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకుదెరువు కోసం గల్ఫ్ తదితర దేశాలకు వలస వెళ్లిన, తెలంగాణ ప్రవాసులకు భరోసా ఇచ్చే విధంగా సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్నారని వెన్నెల గద్దర్ ఈ సందర్భంగా అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, గల్ఫ్ వలసవ జీవులకు బతుకమ్మ లాంటి భరోసా ఇస్తున్నదని ఆమె అన్నారు. అనంతరం కళాకారులు బుర్ర సతీష్, అష్ట గంగాధర్, పూజ నాగేశ్వర్ ఆహుతులను అలరించారు. ఈ కార్యక్రమంలో జిటిఫ్ అధ్యక్షులు ఆకుల సురేందర్, తెలంగాణ ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ మెంబర్ కొట్టాల సత్యం గౌడ్, దుబాయి లోని ఎన్నారై ప్రముఖులు బాలరాజ్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణానికి నిధులివ్వండి

మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుని కోరిన మంథని మున్నూరుకాపు నేతలు



ప్రజాపక్షం/ముత్తారం/మంథని : మంథని నియోజకవర్గ కేంద్రం ఐన మంథనిలో మున్నూరు కాపు సంఘం కార్యకలాపాల కోసం, శుభ కార్యాల నిర్వహణ కోసం, రాబోయే తరాలకు అవసరమైన డిజిటల్ లైబ్రరీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణం కోసం కోటి రూపాయల ప్రభుత్వ నిధులు కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబుకి మంథని డివిజన్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలోని పలువురు నేతలు వినతిపత్రం అందించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గల హైటెక్ సిటీలోని ఒక హోటల్లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో శనివారం రాత్రి మంత్రిని కలిసిన మున్నూరు కాపు సంఘం నేతలు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలో గల 10 మండలాల్లో వ్యవసాయం ఇతర వృత్తులను నమ్ముకొని పెద్ద సంఖ్యలో మున్నూరు కాపు కుల సోదరులు ఉన్నారని, అదేవిధంగా జనాభా ప్రకారంగా కూడా మంథని నియోజకవర్గం పరిధిలో మున్నూరు కాపులు అధిక సంఖ్యలో ఉన్నా కూడా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా మున్నూరు కాపు సంఘం సభ్యులు ఇప్పటికీ వెనుకంజలోనే ఉన్నారన్నారు. మున్నూరు కాపు కుల సంఘం ఐక్యత కోసం గత కొన్ని ఏండ్లుగా గ్రామగ్రామాన కుల సంఘాలు ఏర్పాటు చేసుకొని ఉన్న మంథని డివిజన్ కేంద్రంలో సంఘం అవసరాల కోసం, సమావేశాల నిర్వహణ కోసం, శుభ కార్యక్రమాల నిర్వహణ కోసం సొంత స్థలం కానీ, భవనం కానీ లేకపోవడం చాలా ఇబ్బందిగా ఉందని, మొదటి నుండి కూడా బలహీన వర్గాలపై అందునా మున్నూరు కాపులకు అధిక ప్రాధాన్యత ఇచ్చే తమరి హయాంలో మున్నూరు కాపు సంఘం నిర్వహణ కోసం అవసరమైన స్థలాన్ని మంథని డివిజన్ కేంద్రం ఐన మంథనిలో కేటాయించి సంఘ భవన, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కోటి రూపాయల ప్రభుత్వ నిధుల మంజూరుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు మహాసభ కన్వీనర్ ఇనుముల సతీష్,మంథని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుదుదుల వెంకన్న,సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల కిరణ్,మంథని మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సీపతి బానయ్య,మాజీ ఎంపిటిసి ఎడ్ల సత్యనారాయణ,మంత్రి వ్యక్తిగత సహాయకులు ఇసంపల్లి శ్రీకాంత్,మాజీ సర్పంచ్‌లు అయిలి శ్రీనివాస్, సేమంతుల ఓదెలు, కుదుదుల కోటేశ్వర్, సింగిల్ విండో డైరెక్టర్ కొత్త శ్రీనివాస్,మంథని పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పెంటరి రాజు లతో పాటు మంథని డివిజన్ కు చెందిన మున్నూరు కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్‌తోనే సంక్షేమం

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్: కాంగ్రెస్ పార్టీకి తోనే ప్రజా సంక్షేమం అని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్పష్టం చేశారు. ఆదివారం పెద్దపల్లి జిల్లాఓదెల మండలం కనగర్తి గ్రామంలో రూ24.30 లక్షల నిధులతో మహిళా సమాఖ్య భవనం, పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళల అభ్యున్నతి కోసం మహిళా సంఘాల భవనాలు నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఓదెల మండలంలోని కనగర్తి గ్రామంలో తాను ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుండి రూ. 1.03 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవడం జరిగిందని అన్నారు. సంవత్సరంన్నర కాలంలోనే ఇన్ని సంక్షేమ పథకాలను చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే గ్రామాల్లో అనేక అభివృద్ధి పథకాలను, రోడ్లు, డ్రైనేజీలు రవాణా వంటి మౌలిక సదుపాయాలను చేపట్టడం జరుగుతుందన్నారు. తాను కూడా 24 గంటల్లో 18 గంటలు ప్రజల కోసం నిర్విరామంగా పనిచేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటే అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత ముందుకు తీసుకువెళ్లే వీలుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిలబెట్టే అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, అల్ల సుమన్ రెడ్డి, చికట్ల మండేయ్య, గోపు నారాయణ రెడ్డి, ఆకుల మహేందర్ , యూత్ కాంగ్రెస్ నాయకులు మహిళలు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# స్థానికం

REGIONAL NEWS



కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## 21 గేట్ల ద్వారా నీటి విడుదల



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లను ఎత్తివేసి గత కొన్ని వారాలుగా నీటిని మాంజీరాలోకి వదులుతున్నారు. ఆదివారం ప్రాజెక్టు అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి 1,30,144 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా 1,52,044 క్యూసెక్కుల నీటిని మాంజీరాలోకి వదులుతున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు వెల్లడించారు. అదేవిధంగా వ్యవసాయ అవసరాల నిమిత్తం 900ల క్యూసెక్కుల నీరు పంటకాలువ ద్వారా వదిలిపెడుతున్నామని తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు కాగా ప్రస్తుతం 1401.40 అడుగులు,పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు గాను 12.954 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. రైతులు, పశువుల కాపర్లు ఎవరూ దిగరాదని హెచ్చరించారు.

## సిర్పూర్‌టి అడవిలో పెద్దపులి సంచారం

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ టి ప్రాంతంలో పులి సంచారంతో స్థానికులు కలవరపడుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలం అరెగూడా పరిసరాల్లో ఆదివారం ఉదయం పులి తిరుగుతున్న దృశ్యం కనిపించింది. తెల్లవారుజాము 4 గంటల సమయంలో రైల్వే పోల్ నంబర్లు 189/15, 192 మధ్య పులి సంచారాన్ని రైల్వే సిబ్బంది గమనించారు. వారు వెంటనే ఈ విషయాన్ని అటవీ అధికారులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పులి జాడ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో బయటకు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇంచార్జి ఎఫ్ఆర్ఒ ప్రవీణ్ కుమార్, అటవీ శాఖ అధికారులు ప్రజలకు సూచించారు.

## బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** బెల్లంపల్లి పట్టణంలో సద్దుల బతుకమ్మ నిమజ్జన కార్యక్రమం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఎల్ఎ వినోద్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పోచమ్మ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఎంఎల్ఎ వినోద్, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ 34 వార్డుల నుంచి ఆడపడుచులు తీసుకువచ్చే బతుకమ్మల నిమజ్జన కార్యక్రమం సాఫీగా సాగేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోచమ్మ చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని వివిధ బస్తీల్లో బతుకమ్మ ఆడిన అనంతరం మహిళలు పెద్దఎత్తున పోచమ్మ చెరువుకు చేరుకుంటారని, నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా జరగాలని ఆకాంక్షించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో డిఇ సాయి కిరణ్, పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య, నాయకులు మునిమంద రమేష్, నాతరి స్వామి, రాము, చిట్యాల మధు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## దసరాను 3న నిర్వహించాలి

**ప్రజాపక్షం / కాసిపేట :** గాంధీ జయంతి, దసరా ఒకే రోజు రావడంతో పండుగను శుక్రవారం, అక్టోబరు 3న జరిపేందుకు చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ కోరారు. కాసిపేట ప్రాంతంలోని సింగరేణి కార్మికులు ఈ ఏడాది దసరా పండుగ తేదీ విషయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ ఆదివారం యాజమాన్య దృష్టికి తీసుకొచ్చారు. గాంధీ జయంతి, దసరా ఉత్సవాలు ఒకే రోజు (అక్టోబరు 2) రావడంతో కార్మికులు మైసమ్మ తల్లి ఆశీర్వాదాలు తీసుకొని, బొగ్గు బావిలో పనిచేసి, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సవాలతో జరుపుకునే దసరాకు ఆటంకం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా అమ్మవారికి బలిదానాలు, మంద మొక్కలు వంటి సాంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్మికులు ఇబ్బందులుపడతారని తెలిపారు. అందువల్ల సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి కార్మికుల పక్షాన దసరా ఉత్సవాలను శుక్రవారం, అక్టోబరు 3న జరిపేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన కమ్మరి సురేశ్ నివాసం పెంకుటిల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఐదారు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాల దాటికి సురేశ్ ఇల్లు పూర్తిగా నేలమట్టమైంది. రాత్రిపూట కాకపోవడంతో పెను ప్రణప్రాయం తప్పింది. నివాస ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో సురేశ్ కుటుంబీకులు ఉండడానికి ఇల్లు లేక దిక్కులేని పక్షుల్లాగ రోడ్డున పడాల్సి వచ్చింది. గూడు లేని మాకు దిక్కెవరని సురేశ్ కుటుంబీకులు రోధిస్తూ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వమే డబుల్‌బెడ్‌రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## మహాచండీగా ఏడుపాయల దుర్గమ్మ

### ఆలయం చుట్టూ మంజీర పరవళ్ళు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** జగత్ జనని సన్నిధి ఏడుపాయల వన దుర్గ భవాని మాత సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయం చుట్టూ ఉన్న మంజీర నది పరవళ్ళు తొక్కుతుంది. దీనితో ఆలయ మంజీరా చుట్టేసింది. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన ఆదివారం పంచమిని పురస్కరించుకుని మహచండి దేవిగా (కాళరాత్రి దేవి) రూపంలో (నారింజ రంగు పట్టు వస్త్ర) కాళరాత్రి అవత రంలో ఏడుపాయల దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. . ఈ సందర్భంగా రాజగో పురం లో ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాన్ని సైతం మహాచండి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గోకుల్ షెడ్డులో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల ఉత్సవ విగ్రహాన్ని మహాచండి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండ ఏడుపాయల అధికారులు తగిన తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకరి కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, బిక్షపతి, అంజిరెడ్డి, శివాజీ, కొమురయ్య, లక్ష్మణ్, గంగారం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### తరగని ఉధృతి.. రాకపోకలకు అంతరాయం

సింగూరు నుండి నిజాంసాగర్ ప్రాజెక్టు విడుదల చేసిన 1 లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ప్రసిద్ధ పర్యాటక పుణ్యక్షేత్రమైన ఏడుపాయల కూవిచ్చేసే రహదారులు అన్ని జలమయం కావడంతో రహదారులు అన్ని మూసివేశారు. ఘనపూర్ ప్రాజెక్టు వద్ద మూడవ బ్రిడ్జి పై నుండి నీరు వెళుతుండగా, ఎల్లపూర్ బ్రిడ్జి వద్ద సైతం నీటి ప్రవాహం ప్రధాన రహదారి పై నుండి వెళుతుండడంతో జిల్లా యంత్రాంగం సూచన మేరకు బ్రిడ్జి పై రాకపోకలను నిలిపి వేశారు. బ్రిడ్జి పై ప్రజలు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. దీంతో ఏడుపాయల ఉత్చవాలకు విచ్చేసే భక్తులు ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలని కోరుతున్నారు.

# సమృద్ధిగా యూరియా



### కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం / చెన్నూర్ :** జిల్లాలో పంట సాగుకు అవసరమైన యూరియా నిల్వలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ కుమారి దీపక్ తెలిపారు. ఆదివారం చెన్నూరు మండలం సుద్దాల గ్రామంలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.మండల వ్యవసాయ అధికారి యామిని, ఎంపిడిఒ మోహన్‌లతో కలిసి యూరియా నిల్వలను, సంబంధిత రిజిస్టర్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ రైతులకు యూరియా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నందున రైతులు సాగుకు అవసరమైన మేరకే తీసుకొని వినియోగించుకోవాలని సూచించారు. రైతులు ముందస్తు సాగుకు, అవసరానికి మించి యూరియా తీసుకోవద్దని, ఎరువులు పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సాగు చేస్తున్న రైతులకు యూరియాను సమయానుసారంగా అందిస్తామని, ఈ విషయంలో రైతులు సహకరించాలని కోరారు.

### పొరపాట్లకు తావివ్వొద్దు

త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ కుమారి దీపక్ అధికారులను ఆదేశించారు. చెన్నూరు మండల కేంద్రంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, సర్వే ల్యాండ్ ఎడి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఓటర్ స్లిప్పుల పంపిణీ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై అప్రమత్తంగా ఉండాలని, సజావుగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. శిక్షణకు హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### గోదావరి నీటిమట్టంపై నిరంతర పర్యవేక్షణ



**మంచిర్యాల :** జిల్లాలో వర్షాలు, వరదనీటి ప్రవాహం నేపథ్యంలో గోదావరి నది తీరంలో నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా చేరుతున్న వరద నీటి పరిస్థితిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డు వద్ద గల గోదావరి నది తీరాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో కడెం, ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టుల నుంచి వరదనీటిని దిగువకు విడుదల చేయడం వలన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కూడా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో, గోదావరి నదిలో పెరుగుతున్న వరదనీటి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. గోదావరి నది వద్ద మున్సిపల్, పోలీస్ శాఖల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎవరూ నదీ తీరానికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహిళ సంఘం భవనాలకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/భీమ్‌గల్:** మండలంలోని పలు గ్రామాల్లోని మహిళ సమాఖ్య భవనాలకు, మరమ్మతుల కోసం ఎస్‌డిఎఫ్ ద్వారా నిధులు మంజూరైనట్లు నాయకులు తె లిపారు. కాగా మెండోరా 2 లక్షలు, బాచన్‌పల్లికి 1.5 లక్షలు, పల్లికొండకు 1.5 లక్షలు మంజూరయ్యాయని అధ్యక్షులు స్వామి తెలిపారు. ఆయా గ్రామాల వారిగా మహిళ సంఘ అధ్యక్షులచే భూమిపూజ చేయించామన్నారు. కార్యక్రమంలో స్వామి, రమేష్, భోజా గౌడ్, సురేందర్, దేవేందర్, గంగారెడ్డి, చిన్నారెడ్డి, అనంతరావు, చరణ్ గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, జెమ్స్, రాజేశ్వర్, గంగాధర్, శేఖర్, లింబాద్రి, గంగాధర్, శ్రీను, మల్లేష్, జనార్ధన్, కిషన్ పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయం

### సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్/నిర్మల్ :** భారత స్వాతంత్ర్య సమరయోధుడు కామ్రేడ్ భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలు ఆదిలాబాద్ జిల్లాలో ఘనంగా జరిగాయి.సోమావారం రోజు సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..భగత్ సింగ్ భారతదేశ స్వాతంత్ర్యంకోసం ఉరికోయ్యలను ముద్దాడారని అన్నారు. ఆయన త్యాగం మరువలేనిదని,భగత్ సింగ్ దేశభక్తి,ధైర్యం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.యువత ఆయన ఆశయాల స్పూర్తితో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు,అరుణ్ కుమార్,సీపీఐ ఆదిలాబాద్ రూరల్ కార్యదర్శి మహబూబ్ ఖాన్,తాంసి మండల కార్యదర్శి అర్ధాంగి రమేష్,ఆదిలాబాద్ టౌన్ సీపీఐ సహాయ కార్యదర్శి తబ్రేజ్ ఖాన్తో పాటు పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

# స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం : ధన్‌పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** స్వదేశీ వస్తువులను ఉపయోగిద్దాం స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిద్దామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆదివారం పిఎం మోడీ 126వ మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని సుభాష్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కంఠేశ్వర్ మండల బీజేపీ నాయకులతో కలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ వీక్షించి మాట్లాడారు. పిఎం మోడీ జాతిని ఉద్దేశించి గొప్ప సందేశంతో పాటు ముఖ్యమైన అంశాలను ప్రస్తావించటం జరిగిందన్నారు. దేశ ప్రజందరూ స్వదేశీల వస్తువులను ఉపయోగిస్తూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని మాన్ కీ బాత్ వేదికగా పిఎం దేశ ప్రజలకు పిలుపునివ్వటం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత మేడ్ ఇన్ ఇండియా మేక్ ఇన్ ఇండియా నినాదంతో దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని మాన్ కీ బాత్ వేదికగా పిఎం దేశ ప్రజలకు పిలుపునిచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మేడ్ ఇన్ ఇండియా మేక్ ఇన్ ఇండియా నినాదంతో దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ సహకారమందించటం జరుగుతుందన్నారు. భారతీయ మహిళలు తమ నారీ శక్తితో వివిధ రంగాలలో చూపిస్తున్న ప్రతిబను ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకునేలా ఎదగడం గర్వకారణమన్నారు. నేవి, ఎయిర్, రక్షణ రంగాలతో పాటు గ్రామీణ స్థాయి మహిళలు సైతం చిన్నచిన్న కుటీర పరిశ్రమలతో అభివృద్ధిని సాధిస్తున్నారన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ చేసిన సేవలను పిఎం గుర్తు చేశారన్నారు. డాక్టర్ కేశవ బలిరాం హెగ్వేర్, గురూజీల స్ఫూర్తితో వారి ఆశయాలకు ఆకాంక్షలకనుగుణంగా జాతీయ పునఃనిర్మాణమే లక్ష్యంగా స్వయం సేవకులు పని చేయటం జరుగుతుందన్నారు. హిందువుల ఆరాధ్య దైవం శ్రీరాముని చరిత్రను ఆయన గొప్పతనాన్ని వాల్మీకి రాసిన రామాయణం సమస్త మానవాళికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అయోధ్య రామ మందిర పునఃనిర్మాణంతో హిందువులు చిరకాల స్వప్నం నెరవేరిందని గుర్తు చేశారు. దేవి నవరాత్రులు, దీపావళి కానుకగా మోడీ దేశ ప్రజలకు గొప్ప బహుమతిగా జీఎస్టీ తగ్గింపులు చేశారన్నారు. ఇది పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరటను ఇచ్చేలా ఉందన్నారు. ప్రముఖ లలిత కళ రంగాలలో పేరు పొందిన వారికి ప్రోత్సాహంగా పద్మశ్రీతో గుర్తింపునివ్వటం జరిగిందన్నారు. ప్రముఖ గాయిని లత మంగేష్కర్‌కు నివాళులర్పించామన్నారు. బీజేపీ నాయకులు స్రవంతిరెడ్డి, లక్ష్మీ నారాయణ, జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో బిజెపి గెలుపు పక్కా

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్

**ప్రజాపక్షం / హాజీపూర్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు బిజెపిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలో ఆదివారం మాజీ వైస్ ఎంపిపి బేతు రమాదేవి, రవి ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బిజెపిలో చేరారు. శ్రీ సాయి గార్డెన్‌లోపెద్దంపేట మాజీ సర్పంచ్ పెంద్రం ప్రేమ్ సాగర్, దొనబండ మాజీ ఉపసర్పంచ్ (బిఆర్ఎస్) పోలాస నేహాన్య, పెద్దంపేట బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పొట్టల శ్రీనివాస్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు మోతే భాగ్య శాంతయ్య, నాగవెల్లి శ్రావణ్ కుమార్ చేరారు.

## ఎంపి నిధులతో అభివృద్ధి పనులు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జహిరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ షెట్కార్ నిదుల నుండి జుక్కల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను 50 లక్షల రూపాయలు మంజూరు చేశారని నిజాంసాగర్ మండల మాజీ జడ్పీటీసీ చీకోటి నాగలక్ష్మీ జయప్రదీప్ ఆదివారం పేర్కొన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో పలు గ్రామాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారని, నిజాంసాగర్ మండలం మాగి గ్రామ బస్టాండుకు రూ 5 లక్షలు, మాగి బస్టాండు వద్ద హైమాస్‌లైట్ల ఏర్పాటుకు 3 లక్షలు, వడ్డేపల్లి పాపేశ్వరం ఆలయం వద్ద హైమాస్ లైట్ల కొరకు 2 లక్షలు, మహ్మద్‌నగర్ మండలంలోని నర్వలో గంగపుత్ర సంఘం కమిటీహాల్ కొరకు రూ. 5లక్షలు మంజూరు చేశారు.ఎంపీకి నిజాంసాగర్ నాయకులు గౌస్, నిహాల్, కర్ణం శ్రీను,శేఖర్, భూమాగౌడ్, వెంకాగౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# పల్లెల్లో ఎన్నికల సందడి..ఆశావాదులకు నిరాశే




**ప్రజాపక్షం/రేగోడ్:**మండల కేంద్రంలోని స్థానిక సంస్థల ఎనికల నోటికేషన్ అధికారికంగా జారీ చేయకపోయినప్పటికీ రిజర్వేషన్ల జాబితాలు సోషల్ మీడియాలోచక్కర్లు కొడుతున్నాయి. రేగోడ్ జడిప్టిటిసి బిసి మహిళ కాగా ఎంపిపి బీసీ జనరల్ గా రిజర్వేషన్ వచ్చినట్టు తెలుస్తుంది గ్రామ పంచాయతీ సర్పంచుల ఎంపీటీసీల రిజర్వేషన్లు నోటికేషన్కు ముందే ఎంపీడీవో ఆర్డీవో సంతకాలతో జాబితా చెక్కరు కొడుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల వేడి గ్రామాల్లో జోరు అందుకుంది ఇప్పటికే చక్కరు కొడుతున్న రిజర్వేషన్ల జాబితాతో కొందరు ఆశావాదులు నిరాశగా ఉండగా మరి కొందరు ఆశావాదులు నిరాశగా ఉండగా మరి కొందరు అనుకూలంగా వచ్చాయి అంటూ విందులు చేసుకుటున్నారు ఈ సారి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ఎంపీటీసీ గ్రామ పంచాయితీల వారీగా రిజర్వేషన్ల వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది దీని పై మండల అధికారులను అడిగితే అధికారికంగా ప్రకటించలేదని తెలిపారు. స్థానిక సంస్థల సంస్థల ఎన్నికలు జరుగుతాయని కొం దరు.. పండగ సమయంలో పంచాయతీల ఎన్నికల వేడి కొనసాగుతుంది.

# జెడ్‌పి పీఠాన్ని అధిరోహించేది వీళ్లే



### 6 మండలాల నుంచి మహిళా జెడ్‌పిటిసిలకు అవకాశం



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడెప్పుడు అని ఎదురుచూస్తున్న నాయకుల ఆశలు ఆడియాశలయ్యాయి. అందులో ప్రధానంగా జడ్పీటీసీ స్థానాలలో జడ్పీ చైర్మన్ బీసీ మహిళకు కేటాయించటంతో అంత తారుమారైంది. జడ్పీ పీఠాన్ని మా నాయకుడు అధిరోహిస్తారంటే మా నాయకుడి డెలుస్తాడంటూ ప్రధాన సంస్థల రిజర్వేషన్లలో ఈసారి జడ్పీ పీఠం మహిళలకు రావటం గమనార్హం. మహిళా రిజర్వేషన్లు కలిగిన కోటగిరి, మాక్లూర్, మెండోరా, మోర్తాడ్, మోస్రా ఏర్గట్ల మండలాల్లో జడ్పీటీసీలను బీసీ మహిళలకు రిజర్వు చేసిన నేపథ్యంలో వీరికే జడ్పీ పీఠం దక్కించుకునే అవకాశం కలగనుంది. కాగా గతంలో మండలం నుంచి మాక్లూర్ నుంచి బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాదన్న గారి విఠల్‌రావు జడ్పీ చైర్మన్‌గా గెలిచిన విషయం అందరికి తెలిసిందే. మరి ఈసారి మరోమారు ఈమండలానికి అవకాశం దక్కుతుందా ? లేక మిగతా మండలాల నుంచి జడ్పీ చైర్‌పర్సన్ అయ్యే అవకాశముందా అనేది వేచి చూడాల్సిందే ? మొత్తం 31 మండలాలకు ఖరారైన రిజర్వేషన్లలో ఆరు మండలాలకు బీసీ మహిళ రిజర్వేషన్ రావటం పట్ల మహిళ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తుంటే మరోపక్క జడ్పీ పీఠాన్ని అధిరోహిస్తామని కలలు కన్నా నాయకులకు కలలు కల్లలు అయ్యాయని చెప్పాలి. బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కోటగిరి, మోస్ర ఉండగా ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్, బాల్కొండ నియోజకవర్గం లో మెండోరా, మోర్తాడ్,ఏర్గట్ల ఉండటం విశేషం. కాంగ్రెస ప్రభుత్వంలో బాల్కొండ నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వంలో గానీ పార్టీలో కీలక పదవులున్న నేపథ్యంలో జడ్పీ పీఠం లభిస్తుందా ? ఈ జడ్పీ పీఠం వేరే నియోజకవర్గాలకు కేటాయిస్తారా అన్నది గెలిచిన అభ్యర్థుల మీద ఆధారపడి ఉంటుంది. జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ఎంపీ అరవింద్ సైతం రాష్ట్ర అధిష్టానానికి ధీమా వ్యక్తం చేసిన నేపథ్యంలో బీజేపీ కైవసం చేసుకుంటుందా ? అధికారంలో ఉన్న కాంగ్రెస్ దక్కించుకోనుందనే చర్చ జిల్లా ప్రజల్లో కొనసాగుతుంది ఇదిలా ఉండగా మాక్లూర్ నుంచి మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత ఈ వైపు వస్తే గనుక కాంగ్రెస్ పార్టీ నుంచి మరోమారు జడ్పీ చైర్‌పర్సన్ అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

రీల్




# నేడు 'రాజా సాబ్' ట్రైలర్ రిలీజ్

రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీ 'రాజా సాబ్' ట్రైలర్ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఈ చిత్ర ట్రైలర్‌ను నేడు సాయంత్రం 6 గంటలకు రిలీజ్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మోస్ట్ అవేటెడ్ అనౌన్స్ మెంట్ తో రెబల్ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ హ్యాపీగా ఫీలవుతున్నారు. ఈ అనౌన్స్ మెంట్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ప్రభాస్, సంజయ్ దత్ కాంబో స్టిల్ ఆసక్తి కలిగిస్తోంది. 'రాజా సాబ్' ట్రైలర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.

# పెద్ది పోస్టర్ విడుదల

## రామ్ చరణ్‌కు పద్దెనిమిదేళ్లు.. చిరంజీవి భావోద్వేగం






చిరుత సినిమాతో మొదలైన రామ్ చరణ్ సినిమా ప్రయాణానికి పద్దెనిమిదేళ్లు నిండాయి. ఒక్కో సినిమాతో ఒక్కోమెట్టు ఎక్కుతూ ఇప్పుడు గ్లోబల్ స్టార్‌గా పేరుగాంచాడు. మగధీర వంటి ప్రయోగాత్మక సినిమాలకు ఆజ్యం పోసిన నటుడు రామ్ చరణ్. ఆర్ ఆర్ ఆర్ ప్రపంచ వ్యాప్తంగా రామ్ చరణ్ పేరు సంపాదించుకున్నాడు. తనదైన శైలిలో సినిమాలు చేసుకుపోతున్న రామ్ చరణ్ సైలెంట్‌గా ఎదిగాడు. చిరంజీవి తనయుడిగా తెలుగు తెరకు పరిచయమైనా, తనదైన ప్రతిభతో నిలదొక్కుకున్నారు. రామ్ చరణ్ ఇండస్ట్రీకి పరిచయమై పద్దెనిమిదేళ్లు అవుతున్న సందర్భంగా చిరంజీవి తన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో ఉద్వేగభరిత పోస్ట్ ను పెట్టారు. పద్దెనిమిదేళ్ల క్రితం చిరుత తో మొదలైన నీ సినీ ప్రయాణం నేడు కోట్లాది అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచినందుకు ఎంతగానో సంతోషిస్తున్నాను అని చిరంజీవి పోస్ట్ చేశారు. ప్రస్తుతం రామ్ చరణ్ పెద్ది అనే సినిమాలో నటిస్తొన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ రెగ్యులర్‌గా జరుగుతోంది. పక్క మాస్ యాక్షన్ సినిమాగా నిర్మిస్తున్న ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చి 27న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మైత్రి మూవీస్ బ్యానర్ పై తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు ఏ ఆర్ రెహ్మాన్ సంగీత అందిస్తున్నారు. రత్నవేలు సినిమాటోగ్రాఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. రామ్ చరణ్ సరసన దివంగత నటి శ్రీదేవి కూతురు జాహ్నవి కపూర్, త్రిష, విజయ్ సేతుపతి, జగపతి బాబు, శివ రాజ్ కుమార్ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

# మెప్పిస్తున్న మన విలన్లు







తెలుగు తెరపై ఒకప్పుడు పర భాషా విలన్ల హవా ఎక్కువగా నడిచేది. కానీ ఇప్పుడిప్పుడే టాలీవుడ్ తెరపై తెలుగు విలన్లు రాజ్యమేలుతున్నారు. పర భాషా విలన్లపై దివంగత నటుడు కోట శ్రీనివాస్ రావు గతంలో పలు మార్లు వ్యాఖ్యలు చేశారు కూడా. ఎందుకంటే ఆ రోజుల్లో పరభాషా విలన్లు ఎక్కువ మంది కనిపించే వారు. కానీ ఇప్పుడు తెలుగు సినిమా పరిస్థితి మారింది. తెలుగు సినిమాల్లో తెలుగు నటులే విలన్లుగా కనిపిస్తున్నారు. తెలుగు సినిమా పాన్ ఇండియా స్థాయికి పెరిగిన తరువాత తెలుగు విలన్లకు సైతం మార్కెట్ పెరిగిందని చెప్పడం అతిశయోక్తి కాదు. తెలుగు నటులు విలన్లుగా నటిస్తే డబ్బింగ్ చెప్పేటప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పలువురు దర్శకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విలన్ల ట్రెండ్‌కు ఆజ్యం పోసింది మాత్రం జగపతి బాబు అని బల్ల గుద్ది మరీ చెప్పొచ్చు. హీరోగా అనేక సినిమాల్లో మెప్పించిన జగపతి బాబు విలన్‌గా మారడంతో తెలుగు తెరపై విలన్ల కొరత కొంత తగ్గుతూ వచ్చింది. ఆయన్ని చూసి కొంతమంది నటులు విలన్ బాటను పట్టారు. జూనియర్ ఎన్టీఆర్, నందమూరి బాలకృష్ణ ఇలా అగ్ర హీరోల సినిమాల్లో జగపతి బాబు విలన్ పాత్రలను పోషిస్తున్నారు. హీరోగా చేసినప్పుడు వచ్చిన సంపాదన కంటే విలన్‌గా మారిన తరువాత జగపతి బాబు సంపాదన పెరిగిందని ఫిలిం ఇండస్ట్రీ టాక్. జగపతి బాబు బాటలోనే హాస్య నటుడు సునీల్ కూడా ప్రయాణం చేస్తున్నారు. ప్రముఖ దర్శకుడు రాజా మౌళి తో సినిమా చేసినా సక్సెస్ ఫుల్ హీరోగా సునీల్ ఎదగలేకపోయాడు. దీంతో పుష్ప సినిమాతో విలన్ గా మారిపోయాడు. సుకుమార్ రూపొందించిన పుష్ప, పుష్ప2 సినిమాల్లో విలన్‌గా నటించిన సునీల్ ఇప్పుడు ఇతర భాషల్లో కూడా ఫుల్ బిజీగా ఉన్నాడు. ఒకరోజు ఒక దేశంలో షూటింగ్‌లో పాల్గొంటే, మరో రోజు ఇంకో భాష సినిమాలో ఇంకెక్కడో దేశంలో షూటింగ్ జరుపుకునేంత బిజీ అయ్యారని ఇండస్ట్రీ చర్చించుకుంటోంది. ఫామిలీ చిత్రాల హీరోగా పేరు గాంచిన శ్రీకాంత్ కూడా బాలకృష్ణ తో ఒక సినిమాలో విలన్‌గా నటించారు. అయితే శ్రీకాంత్ చాలా సెలెక్టివ్ గా చేస్తున్నారు. రజనీ కాంత్ సినిమాలో సుమన్ విలన్ గా నటించారు. ప్రభాస్ కు పాన్ ఇండియా పేరు తీసుకొచ్చిన బాహుబలి సినిమాలో రానా ప్రభాస్ తమ్ముడిగా నటించినా అది విలన్ పాత్రే.

నిజానికి ఇప్పుడు యంగ్ జనరేషన్‌కు ఒక మంచి విలన్ కావలి. జగపతి బాబు, సునీల్ లాంటి విలన్లు పెద్ద బాలకృష్ణ స్థాయి హీరోలతో సరిపోతారు కానీ ఇప్పుడు యంగ్ హీరోలకు విలన్లుగా వారు చెయ్యలేరు. కాబట్టి ఒక యంగ్ విలన్ ఇండస్ట్రీకి అవసరం అనుకుంటున్న తరుణంలో మంచు మనోజ్ మిరాయ్ సినిమాతో విలన్ గా మెప్పించడం పరిశ్రమకు శుభ పరిణామమే అని చెప్పవచ్చు. దొంగ దొంగది అనే సినిమాతో హీరోగా పరిచయమైన మంచు మనోజ్ పలు సినిమాలు చేసిన ఆశించిన సక్సెస్ దక్కలేదు. దీంతో కొంత గ్యాప్ వచ్చింది. మిరాయ్ సినిమాలో ఆయన విలన్‌గా నటించడం, ఒక్క మాటలో చెప్పాలంటే హీరో సజ్జ తేజ కంటే మిరాయ్ సినిమాలో విలన్‌గా మనోజ్‌కె మంచి పేరు వచ్చింది. దీంతో మనోజ్ ఆనందానికి అవధులు లేవు. మిరాయ్ సినిమాలో మనోజ్ యాక్టింగ్ చూసిన కొత్త దర్శకులు చాలా మంది ఈ తరం హీరోలకు కరెక్ట్ విలన్ దొరికాడని చర్చించుకుంటున్నారు. నిజానికి తెలుగు తెరపై హీరో కంటే విలన్ పత్రాలు వేసే వారికే మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు.మన హీరోలే విలన్లుగా మరి జనాన్ని మెప్పిస్తున్నారు.

## 'పూరి సేతుపతి' సినిమా టీజర్ ఆవిష్కరణ వాయిదా



తమిళ నటుడు విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పూరిసేతుపతి టైటిల్ టీజర్ సెప్టెంబర్ 28న రిలీజ్ కానుంది. కానుంది తమిళనాడులో నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ సభలో జరిగిన తొక్కిసలాటలో చాలామంది చనిపోయిన నేపథ్యంలో ఈ సినిమా టీజర్ ఆవిష్కరణను వాయిదా వేస్తున్నట్టు దర్శకుడు పూరి జగన్నాథ్ చెప్పారు. పూరి జగన్నాథ్, యాక్టర్ విజయ్ సేతుపతి తొలిసారిగా కలిసి చేస్తున్న పాన్ఇండియా మూవీ పూరిసేతుపతి. ఈ ప్రాజెక్ట్‌ను జెబి మోషన్ పిక్చర్స్ జెబి నారాయణ్ రావు కొండ్రోల్లా కొలాబరేషన్ లో పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు. చార్మీ కౌర్ సమర్పిస్తున్నారు.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో సంయుక్త కథానాయికగా నటిస్తోంది. టబు, విజయ్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో విడుదల కానుంది.

## విరూపాక్ష దర్శకుడి ఎంగేజ్మెంట్



సాయి ధరమ్ తేజతో విరూపాక్ష సినిమా రూపొందించి సక్సెస్ ఫుల్ దర్శకుడిగా పేరు గాంచిన కార్తీక్ దండు ఓ ఇంటివాడవుతున్నాడు. హర్షిత అనే అమ్మాయితో ఆదివారం ఘనంగా ఎంగేజ్మెంట్ జరిగింది. హర్షిత నివాసంలో ఈ ఎంగేజ్మెంట్ కొద్ది మంది సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య జరిగింది. బంధువుల అమ్మాయి హర్షితను వివాహమాడుతున్నాడు. ఈ ఏడాది వీరి వివాహం జరుగనున్నట్టు సమాచారం.



## 'కానిస్టేబుల్' పాటను ఆవిష్కరించిన ఆర్.నారాయణమూర్తి

దేశ సరిహద్దులలో జవానులు, దేశం లోపల పోలీసులు ప్రజలను రక్షించేందుకు ప్రాణాలను పణంగా పెట్టి అహర్నిశలు శ్రమిస్తుంటారని ప్రముఖ నటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. వరుణ్ సందేశ్, మధులిక వారణాసి, హీరో హీరోయిన్లుగా జాగృతి మూవీ మేకర్స్ బ్యానర్ పై ఆర్యన్ సుభాన్ ఎస్.కె దర్శకత్వంలో బలగం జగదీష్ నిర్మిస్తున్నచిత్రం 'కానిస్టేబుల్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలోని ఓ ఎమోషనల్ పాటను హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్ లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్.నారాయణమూర్తి ఆవిష్కరించారు.




## దర్శకురాలిగా వరలక్ష్మి

తెలుగు, తమిళ తెరపై వైవిధ్యమైన పాత్రలతో అలరిస్తున్న వరలక్ష్మి శరత్ కుమార్ తన కెరీర్‌లో మరో అడుగు ముందుకు వేశారు. నిర్మాతగా, దర్శకురాలిగా మారుతున్నారు. తన సోదరి పూజా శరత్ కుమార్‌తో కలిసి దోస డైరీస్ బ్యానర్ని ప్రారంభిస్తున్నారు. చిత్ర నిర్మాణ ప్రపంచంలో సరికొత్త ప్రయాణానికి నాంది పలుకుతోంది. ఈ బ్యానర్ పై తొలి చిత్రంగా 'సరస్వతి' టైటిల్ తో సినిమా నిర్మించబోతున్నట్టు ప్రకటించారు. సరస్వతి టైటిల్‌లో 'ఐ' అనే అక్షరం ఎరుపు రంగులో హైలైట్ చేయబడి, సినిమా ఇంటన్సిటీని ప్రజెంట్ చేస్తోంది. టైటిల్ ప్రేక్షకులలో క్యురియాసిటీ పెంచింది. హై కాన్సెప్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించగా, ప్రకాష్ రాజ్, ప్రియ మణి, నవీన్ చంద్ర ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## రూ.134 కోట్ల వ్యయంతో

# కొండారెడ్డిపల్లి అభివృద్ధి

### రాష్ట్ర మంత్రులు దామోదరం రాజనర్సింహ్మా, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి





ప్రజాపక్షం/ నాగర్‌కర్నూల్ /వంగూర్ : రాష్ట్రంలో కాంగ్రె స్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా పాలనలో గ్రామాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అహరిశ్నలు శ్రమిస్తుందని రాష్ట్ర మంత్రులు దామోదరం రాజనర్సింహ్మా, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలు అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో రూ.134 కోట్ల వ్యయంలో 18 అభివృద్ధి కార్యక్రమాలను అట్టహసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌర విద్యుత్ గ్రామంగా కొండారెడ్డిపల్లి దేశంలోనే రెండోవ గ్రామంగా, దక్షణ భారత దేశంలో మొదటి గ్రామంగా నిలిచిందని వారు గుర్తు చేశారు. రైతుల వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించాలని వారు సూచించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వానికి దేశానికి ఆదర్శంగా ముందుకు తీసుకెళ్లామని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యావైద్యానికి అధిక ప్రాముఖ్యత ఇస్తూ క్యాన్సర్ నివారణకు కృషి చేస్తుందని, యువత వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించేందుకు ప్రస్తుతం రాష్ట్రంలో 65 ఏటీసీ కేంద్రాలను ప్రారంభించి యువత నైపుణ్యా పరిజ్ఞానానికి సహకార అందించిందన్నారు. ఒక్కొక్క ఏటీసీకి రూ.45 కోట్ల చొప్పున ఖర్చు చేసిందని,వచ్చే విద్యా సంవత్సరం గాను మరో 51 ఏటీసీ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్‌బాదవత్ సంతోష్, ఎస్పీ వైభవ రఘునాథ్, విజయ డైరి చైర్మన్ అమిత్‌రెడ్డి వివిధ శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సౌర విద్యుత్ గ్రామంగా ముఖ్యమంత్రి స్వగ్రామం

### దేశంలో రెండో గ్రామం, దక్షిణ భారత దేశంలో మొదటి గ్రామం

ప్రజాపక్షం/హైదరాబాద్ : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూర్ మండలంలో అచ్చంపేట నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా గుర్తింపు పొందనుంది. దేశంలో రెండో గ్రామంగా, దక్షిణ భారతదేశంలో మొదటి సోలార్ విద్యుత్ గ్రామంగా నిలువనుంది. సంపూర్ణ సౌర విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దుటకు చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. టిజి ఆర్ఇడిసిఐ ద్వారా రూ.10.53 కోట్లతో 514 ఇండ్లతో, పాటు 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 1,500 కిలో వాట్స్ కాగా, ప్రతి ఇంటికి 3కిలో వాట్స్ స్థాపిత సామర్థ్యంతో 480 ఇండ్లకు సౌర విద్యుత్ వసతిని కల్పించారు. అలాగే 60 కిలో వాట్స్ సామర్థ్యం కలిగిన 11 ప్రభుత్వ భవనాలకు సౌర విద్యుత్ పరికరాలు బిగించారు. మట్టి గోడలతో ఉన్న మరో 34 ఇండ్ల కుటుంబాలకు కూడా సౌర విద్యుత్ కల్పించాల్సి ఉండగా, ఈ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే, ఇండ్లపై సౌర విద్యుత్ పరికరాలు బిగించనున్నట్లు టిజి ఆర్ఇడిసిఐ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మేనేజర్ కె.మనోహర్ రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లి గ్రామం సౌర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 10.53 కోట్లు కాగా, అందులో రూ.7.96 కోట్లను సౌర విద్యుత్ పరికరాల ఏర్పాటుకు కేటాయించారు. సౌర విద్యుత్‌కు కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ రూ.3.56 కోట్లు కాగా, ప్రీమియర్ ఎనర్జీస్ కంపెనీ కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధుల నుండి రూ. 4.092 కోట్లు భరించింది. మరో రూ.2.59 కోట్లను మౌలిక వసతుల అభివృద్ధికి ఖర్చు చేశారు. ప్రతి ఇంటి నుండి నెలకు 360 యూనిట్స్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. (ప్రతి కిలో వాట్‌కు 120 యూనిట్స్ అవుతుంది) ఇళ్ల నుండి ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఇంటి వినియోగానికి పోగా, మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. గ్రిడ్‌కు పంపే విద్యుత్ యూనిట్‌కు రూ.5.25 చొప్పున చెల్లించేందుకు లబ్ధిదారులతో విద్యుత్ పంపిణీ సంస్థ ఒప్పందం చేసుకున్నది. సెప్టెంబర్ నెలలో విద్యుత్ గ్రిడ్‌కు గ్రామం మొత్తం నుండి సుమారు ఒక లక్ష యూనిట్స్ విద్యుత్ ఎగుమతి అయింది. తద్వారా రూ.5 లక్షల ఆదాయాన్ని గ్రామస్తులు ఒక నెలలోనే ఆర్జించారని ప్రభుత్వ అధికారులు వివరించారు.



శరన్నవరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏడో రోజు శ్రీ చండీ దేవత పూజ, పారాయణ కార్యక్రమం రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ప్రైవేట్ సెక్రటరీ సోమరాజు ఇంటి వద్ద నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ విచ్చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.




# బలమైన ప్రజాపోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, టిఎస్‌డిఎఫ్ కన్వీనర్ ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దిడ్డి సుధాకర్, తెలంగాణ సాయుధ పోరాటయోధులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, వామపక్ష నాయకులు పోటు రంగారావు (సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ ), చలపతిరావు (సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ) ఎ.జానకిరాములు (ఆర్ఎస్‌పి), వనం సుధాకర్ (ఎంసిపిఐ), ప్రసాదన్న (సిపిఐ ఎంఎల్), కృష్ణ ప్రసాద్ (ఇండియన్ నేషనలిస్ట్ మూవ్‌మెంట్), విజయ్ (సిపిఐ ఎంఎల్), నయనాల గోవర్ధన్ (జలసాధన కమిటీ), సోగరా బేగం, (ఓట్ నీడ్ గ్యారంటీ ఆర్గనైజేషన్), వెల్దుర్తి సదానందం (రైతు కూలి సంఘం), ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ (జాగో నవ తెలంగాణ), అబ్దుల్ అజీజ్ (మూవ్‌మెంట్ పీస్ అండ్ జస్టిస్), జీవన్ కుమార్ (హ్యూమన్ రైట్స్ ఫోరం), దుర్గా ప్రసాద్ (శాంతి చర్చల కమిటీ), అబ్దుల్ హక్ ఖమర్, (తెలంగాణ మైనారిటీస్ అండ్ వక్ఫ్ ప్రొటెక్షన్ సెల్), వంగూరు నరసింహ కార్యదర్శి (తెలంగాణ రైతు సంక్షేమ సమితి), మునీరుద్దీన్ ముజాహిద్ (సెక్యులర్ డెమోక్రటిక్ ఫోరం), వెంకట్ (అడ్వకేట్ పొలిటికల్ జెఎసి) పాల్గొని ప్రసంగించారు.

### దేశ సంస్కృతిని, ఆత్మను చంపివేస్తున్నారు : ప్రశాంత్ భూషణ్

కేంద్రంలో ప్రస్తుత పాలకులు భారతదేశ సంస్కృతిని, దేశ ఆత్మను పూర్తిగా చంపేసే ప్రయత్నం చేస్తున్నారని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విమర్శించారు. మీడియా ముసుగు కప్పుకున్న ప్రధాని మోదీ పెంపుడు కుక్కలు కొందరు అరాచక పరిపాలనకు వంతపాడుతూ ఆకాశానికి ఎత్తేస్తున్నారన్నారు. మన దేశంలో మనస్సాక్షి అనేది ఇంకా బతికే ఉందని, మంచి ఏది, చెడు ఏది అనేది ఆలోచించే వారి సంఖ్యకు కొదవలేదని, ఆలాంటి వారంతా సోషల్ మీడియా వేదికగా కేంద్ర పాలకుల దురాగతాలను ఎండగడుతుండడం హర్షణీయ పరిణామన్నారు. ఈ దేశంలో టిఎన్.శేషన్ కాలంలో స్వతంత్ర సంస్థగా పనిచేసిన ఎన్నికల కమిషన్ మోదీ అధికారం చేపట్టిన తర్వాత బిజెపి అనుబంధ సంస్థగా మారిపోయిందన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న అరాచకాలకు ఎన్నికల కమిషన్ రొమ్ము విరుచుకుని మరీ సహకరిస్తోందన్నారు. ఇందుకు కారణం గతంలో ఎన్నికల కమిషన్ సంస్థ కమిషనర్ల నియామకానికి ప్రధానమంత్రి, ప్రధాన ప్రతిపక్షనాయకులు సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఎన్నుకునే విధానాన్ని మార్చి ఇప్పుడు ప్రధాని, మరో కేంద్రమంత్రి, ప్రతిపక్షనాయకుడు కలిసి ఎన్నుకునే విధానాన్ని తీసుకురావడమే అన్నారు. నేడు ప్రతిపక్ష నాయకుడి మాటకు విలువేలేదని, ప్రధానితో పాటు కేంద్ర మంత్రి ఎవరు అనుకుంటే వారు కమిషనర్లుగా నియమించబడుతుండడంతో ఎన్నికైన వారు కేంద్రం ఏది చెబితే అదే చేస్తూ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపికి సంబంధించి కోటి మంది ఓటర్లను తయారు చేసుకుందని, దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే అక్కడ వీరిని ఓటర్లుగా నమోదు చేయడం, తమకు ఓటు వేయని వారిని జాబితాలో నుంచి తొలగించి ఓట్ల చోరీకి పాల్పడుతోందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో బిహార్‌లో ప్రస్తుతం ఇదే కొనసాగుతోందని తెలిపారు. న్యాయ వ్యవస్థకు సంబంధించి కొలిజియం నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా వ్యవహరించే కొంతమందిని న్యాయమూర్తులుగా ఎంపిక చేసి కేంద్రానికి సిఫార్సు చేసినా అలాంటి వారిని పక్కన పెడుతూ తమకు అనుకూలమైన వారి పేర్లను మాత్రమే ఆమోదిస్తున్నారని, దీంతో న్యాయమూర్తుల్లో కొందరు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ రిటైర్ అయిన తర్వాత పార్లమెంట్ సభ్యులుగాను, గవర్నర్లుగాను, వివిధ సంస్థలకు చైర్మన్లుగా నియమించబడుతున్నారని వివరించారు. దేశంలో న్యాయవ్యవస్థ చాలా మేరకు పారదర్శకంగానే పనిచేస్తోందని, అందుకే అంతో ఇంతో ప్రజాస్వామ్యం బతికి ఉందని భూషణ్ తెలిపారు.

### ప్రజాస్వామ్యానికి పునాదులైన నాలుగు స్తంభాలు కూనారిల్లి పోతున్నాయి : కూనంనేని సాంబశివరావు

ప్రజాస్వామ్యానికి పునాతులైన శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు మూడు స్తంభాలైతే నాలుగో స్తంభం మీడియా అని ఈ నాలుగు స్థంభాలు కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిన మాదిరిగా కూనా రిల్లి పోతున్నాయని కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవస్థలను తిరిగి నిలబెట్టడంతో పాటు దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రగతిశీల శక్తులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. పేదల హక్కుల కోసంపోరాడుతున్న వ్యక్తులు అక్రమంగా జైళ్లలో బంధించబడుతుంటే దేశాన్ని దోచుకుంటున్న కొంత మంది దొంగలు మాత్రం గద్దెనెక్కుతుండడం దేశానికి పట్టిన గ్రహణమని ఆయన పేర్కొన్నారు. దేశంలో కొద్దో గొప్పో న్యాయవ్యవస్థ పనిచేస్తున్నందునే సమాజం మనుగడ సాగిస్తోందని, న్యాయ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు జరిగే ప్రతి ఉద్యమంలో సిపిఐ ప్రత్యక్షంగా పూర్తిగా భాగస్వామ్యం అవుతుందని కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ ఇవిఎంల ద్వారా ఓట్ల చోరీకి పాల్పడుతూ గద్దెనెక్కిన బిజెపి దేశంలోని అన్ని ప్రధాన సంస్థలను చెరబట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. బిజెపి అధికారానికి చరమగీతం పాడేందుకు ఈవిఎం విముక్తి భారత్ పేరుతో ప్రజాఉద్యమానికి శ్రీకారం చుట్టాలని, ఇందుకు ప్రశాంత్ భూషణ్ దేశ వ్యాప్తంగా న్యాయకత్వం వహించాలని కోరారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ బిజెపికి వ్యతిరేకంగా ఎవరు ఓటు వేయాలకున్నా వారికి ఓటు హక్కు అనేది ఇంకా ఉండబోదన్నట్లుగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాలో భాగంగానే ఈ చర్యలన్నీ జరుగుతున్నాయని, తెలంగాణలో కూడా ఇలాంటి పరిస్థితులు రానున్నాయని వీటిని అడ్డుకునేందుకు వీర తెలంగాణ వేదికగా ప్రజా ఉద్యమాలను సిద్ధం కావాలని కోరారు. వివిధ వామ పక్షాలు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో ఒకనాడు ఓట్ల రిగ్గింగ్, బ్యాలెట్ బాక్స్‌ల అపహరణతో మొదలై చివరికి ఎమ్మెల్యేలను కొనడం, గవర్నర్ల ద్వారా ప్రజా ప్రభుత్వాలను కూల్చడం చూడగా ప్రస్తుతం మోదీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌నే నిర్వీర్యం చేసి ఏకంగా ఓట్ల చోరీకి పాల్పడి అధికారాన్ని సొంతం చేసుకోవడం హేయమైన చర్య అన్నారు. నేరమే అధికారమై ప్రజలను నేరస్తులను చేసి పరిపాలిస్తున్న బిజెపి పాలకుల కోరలను పికేందుకు అందరూ సంఘటితం కావాల్సిన అవసరముందని అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com